# ఐక్య ఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

ఆగస్టు - 2017

సంపుటి- 43 సంచిక : 08



## సంపాదక వర్గం

**ఎన్.కుమార్ రాజా**

ప్రధాన సంపాదకులు

**ఐ.వెంకటేశ్వరరావు**

**పి.బాబురెడ్డి**

**టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు**

**సిహెచ్.శ్రీహరి**


## ఈ సంచికలో...


| | |
|---|---|
| జాతీయం అంతర్జాతీయం | -04 |
| ఇక పాఠశాల విద్యారంగం... | -05 |
| యుటియఫ్-ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ... | -07 |
| మున్సిపల్ డైరెక్టర్ ఎదుట ధర్నా | -09 |
| స్వయం పోషక స్వతంత్ర.... | -11 |
| మాతృభాషను కొనసాగించాలి... | -12 |
| ఎయిడెడ్ పదోన్నతులు ... | -13 |
| ముఖ్యమైన ప్రాతినిధ్యాలు | -15 |
| ఆదర్శ పాఠశాలకు ఆదరణ | -17 |
| ప్రశ్నోత్తరాలు | -19 |
| పోరాడి సాధించుకున్న.... | -20 |
| ఉద్యమవార్తలు | -21 |
| ప్రభుత్వఉత్తర్వులు | -34 |



| | | |
|---|---|---|
| దశాబ్దిచందా | : ₹ | 1250-00 |
| 5 సం॥ చందా | : ₹ | 650-00 |
| సం॥ చందా | : ₹ | 150-00 |
| విడిప్రతి | : ₹ | 15-00 |

Union Bank Online
A/c No. 346402010025027
IFSC Code : UBINO534641



**ఐక్య ఉపాధ్యాయ**

యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520002

Ph.No.: 0866-2573763

Website: www.aputf.org

E-mail: ikyopadhyaya1975@gmail.com


# కర్తవ్య దీక్షకు పునరంకితమవుదాం!

ఆగస్టు 10 యుటియఫ్, ఆగస్టు 12న ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం. నిరంతర కృషి పట్టుదల, అంకితభావం, త్యాగాల ద్వారా నిర్మించబడిన మన ఉపాధ్యాయ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళడమే మన కర్తవ్యం. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం, ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని పెంపొందించుకోవడం మన ఉపాధ్యాయ ఉద్యమంలో అంతర్భాగం కావాలి.

నేడు విద్యారంగంలో సంస్కరణల పేరుతో పలు మార్పులు తెస్తున్నారు. 5 మరియు 8 తరగతులలో డిటెన్షన్ విధానాన్ని తిరిగి ప్రవేశ పెట్టడానికి విద్యాహక్కు చట్టానికి సైతం సవరణలు తేనున్నారు. సైనిక స్కూళ్ళలో ఉండే శిక్షణాంశాలు కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ స్కూళ్ళకు విస్తరింపచేయాలని యోచిస్తున్నారు.

మన విద్యా విధానాలని, లక్ష్యాలను నిర్దేశించే ఆంధ్రప్రదేశ్ విద్యాచట్టం 1984ను విస్మరిస్తూ స్వయంపోషక స్వతంత్ర పాఠశాల చట్టం-2017ను తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాలు పాఠశాల విద్యారంగాన్నే కబళించనున్నాయి. శాసనమండలి సభ్యులు, విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా వాణిజ్య సంస్థల ఫెడరేషన్ సహకారంతో ముసాయిదా రూపొందించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని చట్టబద్ధం చేస్తున్నది. ఇది ఎవరి ప్రయోజనాల కోసం?

అందరికి ఉచిత నిర్బంధ విద్య అందించే బాధ్యత నుండి ప్రభుత్వాలు తప్పుకుంటున్నాయి. ప్రభుత్వ విద్యారంగ శ్రేయోభిలాషులు కోరుకుంటున్న కామన్ స్కూలు కల చెదిరిపోతున్నది. ప్రభుత్వ పాఠశాలల క్రమబద్ధీకరణ పేరుతో పాఠశాలల మూసివేత, ఉపాధ్యాయ పోస్టుల కుదింపు ఊపు అందుకుంటున్నది. ఎయిడెడ్ విద్యాసంస్థలలో నియామకాలకు స్వస్తి పలకడంతో ఎంతోమందికి ఉచితంగా విద్యనందించిన ఎయిడెడ్ విద్యాసంస్థలు ఉసూరుమంటున్నాయి. వాటి ఉనికి కాపాడుకు నేందుకు యాజమాన్యాలు ప్రైవేటు బడులు నిర్వహించుకుంటున్నాయి.

మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ తరహా విద్యా విధానం పేరుతో ప్రయోగాలు ఊపందుకున్నాయి. మున్సిపల్ పాఠశాలల విద్యార్థులందరికి నాణ్యమైన విద్య అందించాల్సి ఉండగా ఫౌండేషన్ కోర్సుల పేరుతో కొద్దిమందికి ప్రత్యేక బోధనా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులకు స్వేచ్ఛ లేకుండా ఇంగ్లీషు మీడియంలోకి నెట్టేస్తున్నారు. విద్యాశాఖతో సంబంధం లేకుండా మున్సిపల్ విద్యా విధానాన్ని మారుస్తున్నారు. పెరిగిన పట్టణ జనాభాకనుగుణంగా నూతన పాఠశాలల ఏర్పాటు చేయకపోగా పట్టణ పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రైవేటుబాట పట్టిస్తున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడేలా ఉన్నాయి. నూతన పిఆర్‌సి కమిటీని వేయవలసిన సమయం ఆసన్నం అయినా 2015 పిఆర్‌సి అరియర్స్ ఊసేలేదు. హెల్త్‌కార్డు కష్టాలు, సిపిఎస్ రద్దు సమస్యలు వెంటాడుతున్నాయి. ఇలా ఎంతకాలం?

వీటన్నింటికి దారి సంఘటిత పోరాట పథం. యుటియఫ్, ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా అన్ని స్థాయిల్లో కార్యకర్తల్లో చైతన్యం పెరగాలి. ఉపాధ్యాయుల్లో చైతన్యం పెంపొందించాలి. ఉపాధ్యాయ ఉద్యమాల్లో అందరు భాగస్వాములు కావాలి. ప్రజా ఉద్యమాలకు మద్ధతు పలకాలి. ఉపాధ్యాయుల ఐక్యతా శక్తిని పదిలపరచుకోవాలి. యుటియఫ్, ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయ ఉద్యమ కర్తవ్య దీక్షకు పునరంకితమవుదాం!



# జాతీయం అంతర్జాతీయం

### ఉత్తీర్ణతా శాతం తగ్గడానికి టీచర్లు మాత్రమే బాధ్యులు కారు!

**-మద్రాస్ హైకోర్టు**

తమిళనాడులో తిరునవేలి పాలిటెక్నిక్ కాలేజీలో ఉత్తీర్ణతా శాతం తగ్గడానికి బాధ్యులను చేస్తూ 7మంది టీచర్లకు చార్జిమెమో ఇవ్వడాన్ని మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ తప్పుపట్టింది. "విద్యా బాధ్యత టీచర్లదేకాదు. మొత్తం సమాజానిది, దేశానిది" అని చెప్పింది. స్కూలుకు సక్రమంగా రాని పిల్లల వెనుకబాటు తనాన్ని టీచర్లకు అంటకట్టడం, టీచర్ల నుండి వివరణ కూడా తీసుకోకుండా చార్జి మెమోలు ఇవ్వడం ఎలా చేస్తారని కోర్టు ప్రశ్నించింది. సిలబస్ చాలా కష్టంగా ఉందని, స్పెషల్ క్లాసులకు హాజరుకాని పిల్లల వైఫల్యాలకు మేమెలా బాధ్యులం అని బాధిత టీచర్లు కోర్టుకు విన్న వించుకొన్నారు.

### అమర్త్యాసేన్ డాక్యుమెంటరీపై ఆంక్షలు

ఆర్థిక శాస్త్రవేత్త అమర్త్యాసేన్ జీవితం ఆధారంగా సుమన్ ఘోష్ తీసిన "ఆర్గుమెంటేటివ్ ఇండియన్" డాక్యుమెంటరీలో గుజరాత్, గోవు, హిందూత్వ లాంటి పదాలు తొలగించాలని లేదా ఆ పదాలు వినిపించకుండా బీప్ శబ్దం వినియోగించాలని సెన్సార్‌బోర్డు సూచించింది. దీంతో ఆ చిత్రం విడుదల వాయిదా పడింది. దీనిపై చిత్ర దర్శకుడు సుమన్‌ఘోష్ స్పందిస్తూ "సెన్సార్ బోర్డు సూచనలు అంగీకరించేది లేదు. గతంలో ఉడ్తాపంజాబ్, లిప్‌స్టిక్ అండర్ బుర్ఖా సినిమాల విషయంలో కూడా సెన్సార్‌బోర్డు తీరు వివాదాలకు దారితీసింది. భావ ప్రకటనా స్వేచ్ఛపై ఈ దాడిని త్రిప్పికొడతాం" అన్నారు. సీనియర్ నటుడు సౌమిత్ర చటర్జీ "ఇటువంటివి జరిగితే అసలు మనది ప్రజాస్వామ్య దేశమని ఎలా అనగలం. ఈ ఫాసిజానికి అడ్డు కట్టవేయాలి" అన్నారు.

### స్కూళ్ళు, కాలేజీలు, జైళ్ళు - ప్రైవేటుకు అప్పగించండి!!

**- నీతి అయోగ్ సిఇఓ**

నీతి అయోగ్! ప్రణాళికా సంఘం స్థానే ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పర్చిన సంస్థ. దాని సిఇఓ అమితాబ్‌కాంత్ బాహాటంగానే, ఏ దాపరికం లేకుండానే "ప్రజాసేవా సంస్థల నిర్వహణ నుండి ప్రభుత్వం తప్పుకోవాలి. స్కూళ్ళను, కాలేజీలను, జైళ్ళను ప్రైవేట్ వారికి అప్పగించాలి" అనేశారు. నీతి అయోగ్ నుంచి ఈ మాట వచ్చిందంటే త్వరలో ప్రభుత్వం అమలుపరుస్తుందని భావించాలి. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి) సదస్సులో ఇంకా చాలా మాట్లాడేశారు. "ప్రభుత్వరంగ సంస్థలకు ప్రభుత్వం చాలానే చేసింది. ఇక తప్పుకోవడం మంచిది. Built – Operate – Transfer (BOT) పద్ధతి ఇప్పటివరకూ అమలు చేస్తున్నారు. దీనికి వ్యతిరేక దిశలో చివరిదైన "అప్పగించే" పని ఇక చేయాలి. పెద్ద ప్రాజెక్టులను ప్రైవేటు సంస్థలకు అమ్మివేయాలి" అన్నారు. ఇప్పటివరకూ ప్రభుత్వ వ్యవస్థలు నిర్లక్ష్యం కారణంగా పెచ్చులూడి పడుతూ శిథిలం అవుతున్నాయని అనుకొన్నాం. ఇప్పుడు ప్రభుత్వ వైఖరి చూస్తే బుల్‌డోజర్‌తో ఏకంగా కూల్చేపనికి తెగబడినట్లు కనిపిస్తోంది.

### అన్నింటిని మిలటరీ స్కూళ్ళుగా మార్చే ప్రయత్నం?



ప్రధానమంత్రి కార్యాలయం నుండి మానవ వనరుల శాఖకు అందిన సూచన చూస్తే రాబోయే రోజుల్లో అన్ని స్కూళ్ళు మిలటరీ స్కూల్స్ (సైనిక స్కూల్స్)గా మార్చేయబోతున్నారా అన్పిస్తోంది. సైనిక స్కూళ్ళలో వుండే క్రమశిక్షణ, దేహదారుఢ్యం, దేశభక్తి తదితర శిక్షణాంశాలు అన్ని స్కూళకు విస్తరింపజేయాలని యోచిస్తున్నారు. ప్రస్తుతానికి కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ స్కూళ్ళలో ప్రవేశ పెట్టడానికి నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతోపాటు సిబిఎస్ఇతో సంధానించిన 20,000 ప్రైవేటు స్కూళ్ళలో కూడా ప్రవేశపెట్టడానికి పరిశీలన చేస్తున్నారు.

1961లో సైనిక అవసరాలకోసం సైనిక స్కూళ్ళు ఏర్పాటు చేశారు. రక్షణశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం దేశంలో 25 సైనిక స్కూల్స్ వున్నాయి. యుద్ధరంగంలో పనిచేయడానికి కావల్సిన నైపుణ్యాలు, దేహదారుఢ్యం, మానసిక స్థైర్యం, జాతీయాభిమానం తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. కానీ దీన్ని మిగిలిన స్కూళ్ళకు విస్తరింపజేయడం అంటే ఏమిటి? అందర్నీ సైనికులుగా చేయాలనా? అయితే మిగిలిన సామాజిక, సాంకేతిక రంగాల మాటేమిటి? విద్వేషాల్ని రెచ్చగొడుతున్న జాతీయతను స్కూళ్ళలోకి తేవడం ఏ ఉద్దేశ్యానికి సంకేతం? ఏ ఏకోన్ముఖ వ్యవస్థ ఏర్పాటుకు సూచన??

### లైబీరియాలో విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకించిన పౌర సమాజం, సంఘాలూ

లైబీరియాలో "భాగస్వామ్య పాఠశాలలు" PSL (Partnership Schools for Liberia) పేరుతో ప్రభుత్వం ప్రీప్రైమరీ, ప్రైమరీ విద్యను ప్రైవేటు సంస్థలకు అప్పగించపూనుకొంది. ఈ ప్రాజెక్టు నిర్వహణకు అమెరికాకు చెందిన బ్రిడ్జ్ ఇంటర్నేషల్ అకాడమీస్ (BIA) సంస్థను ప్రొవైడర్‌గా లైబీరియా ప్రభుత్వం ఎంచుకొంది. ఈ బ్రిడ్జ్ సంస్థ కెన్యాలాంటి దేశాల్లో ప్రభుత్వ స్కూళ్ళను తీసుకొని ఎంత నాసిరకమైన విద్య అందించిందో, ఎంత సౌకర్యాలు లేని దరిద్రపుగొట్టు స్కూళ్ళను నడిపిందో మనం చూశాం.

PSL పై లైబీరియాలోని టైలర్‌హుక్ అనే వ్యక్తి పరిశోధన చేసి జులై 29న రిపోర్టు వెలువరించారు. "ప్రాథమిక విద్యను ప్రైవేటు వ్యక్తులకు వదిలేయడం వల్ల భవిష్యత్‌లో మొత్తం లైబీరియా విద్యా వ్యవస్థ సమాధి చేయబడుతుంది. పారదర్శకత, బాధ్యత లేని సంస్థలకు విద్యను అప్పగించడం వల్ల వెనుకబడిన వర్గాల పిల్లలు శాశ్వతంగా విద్యకు దూరం అయ్యే ప్రమాదం వుంది" అంటూ రిపోర్టు తెలిపింది.

ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నేషనల్ టీచర్స్ అసోసి యేషన్ ఆఫ్ లైబీరియాతోపాటు 11 ఉపాధ్యాయ సంఘాలు, మత సంస్థ లు, పౌర సమాజం పోరాటానికి సిద్ధ పడ్డాయి. "ఒకసారి ప్రైవేటు వాళ్ళ చేతుల్లోకి ఈ స్కూళ్ళు వెళితే ఇక ఎప్పటికీ తిరిగి తెచ్చుకోలేము. లాభాపేక్ష గల కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు లైబీరియా పిల్లల భవిష్యత్తు ఫణంగా పెట్టబడింది" అంటూ ఉమ్మడి ప్రకటన చేశాయి.

# ఇక పాఠశాల విద్యారంగం...కార్పొరేట్ హస్తగతం...

రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా 'స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం' అంటూ పాఠశాల విద్యారంగం మొత్తాన్ని అతలాకుతలం చేసే డ్రాఫ్టునొకదాన్ని తెరమీదికి తెచ్చింది. జులై మొదటి వారంలో వెబ్‌సైట్‌లో పెట్టి 11వ తేదీకల్లా అభిప్రాయాలు చెప్పాలని ప్రకటించింది. డ్రాఫ్టు బిల్లు కాకుండా ఏకాఏకిన చట్టాన్నే వెబ్‌సైట్‌లో పెట్టడం వింతల్లో కల్లా వింత. దీన్ని రూపొందించేందుకు 'ఫిక్కీ' వారి సహకారం తీసుకొన్నట్లు ప్రకటించడం మరో విచిత్రం. విద్యారంగ నిపుణులతోగాని, సంస్థలతోగాని, ఉపాధ్యాయ విద్యార్థి సంఘాలతోగాని, తల్లిదండ్రులతోగాని ఏ మాత్రం సంప్రదించకుండా 'ఫిక్కీ'తో మాత్రం సంప్రదించడంలో ఆంతర్యమేమిటి? వ్యాపార వాణిజ్య వర్గాలు లబ్దిదారులా? తల్లిదండ్రులూ పిల్లలూ మాత్రం బయటి వారా? ఈ ప్రశ్న తలెత్తుతుందని కూడా విద్యాశాఖ భావించలేదు.



వి.బాలసుబ్రహ్మణ్యం MLC
పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్

### కార్పొరేట్ సంస్థల వాదనలు :


చాలాకాలంనుంచి ఫిక్కీ, సిఐఐ లాంటి సంస్థలు కొత్త కొత్త వాదనలను తెరమీదికి తెస్తున్నాయి. ప్రభుత్వమే అందరికీ మంచి విద్యను అందించాలనడం హాస్యాస్పదమని, అలా అనుకున్నందు వల్లనే భారతదేశం విద్యారంగంలో వెనకబడి వుందనేది వారి మొదటి వాదన. ప్రపంచ విద్యార్థుల్లో 20% భారతదేశంలోవుంటే ప్రభుత్వం విద్యకోసం పెట్టే ఖర్చులో ఇండియాది 5.7% మాత్రమేనని, ప్రైవేట్ పెట్టుబడులు రాకుండా లక్ష్యం సాధించలేమని వాళ్ళు వాదిస్తూ వస్తున్నారు. ఆంక్షలు ఎక్కువకావడం, ప్రోత్సాహకాలు లభించక పోవడం, లాభాలకు అవకాశాలు లేకపోవడంతో పెద్దపెద్ద ప్రైవేట్ సంస్థలు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకురావడం లేదట. ఫలితంగా 40% కూడా ప్రైవేట్ రంగంలో చదవడం లేదట. తల్లిదండ్రుల్లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యకోసం విపరీతమైన తహతహ పెరుగుతున్న కాలంలో కార్పొరేట్ దిగ్గజాలు పాఠశాల విద్యారంగంలో రాగల లాభాల్ని అర్థం చేసుకోవాలని కూడా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ బిల్లు వచ్చిందని మనం సులభంగానే అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ప్రయోగాలు చేయడంలో మన రాష్ట్ర ప్రభుత్వానికి అపారమైన అనుభవం వుంది. కార్పొరేట్ విద్యాధిపతులే రాజ్యాన్ని ఏలుతున్న రాష్ట్రంగదా మనది. అందువల్ల మన రాష్ట్రమే ఎవరూ చెయ్యని దుస్సాహసానికి పూనుకొని ఈ బిల్లు తెచ్చింది.

### 'స్వతంత్ర' అంటే ఇష్టారాజ్యమే :

ప్రస్తుతం రాష్ట్రంలో 'విద్యా చట్టం 1982' అమల్లో వుంది. దీనికి లోబడి 1984లో వచ్చిన జిఓ ఎంఎస్ 1 ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల స్థాపన, నిర్వహణల నిబంధనల్ని నిర్దేశించింది. కొన్ని లోపాలున్నా, ఈ నిబంధనల్ని పాటించడంలో ఎన్ని ఉల్లంఘనలున్నా ఈ ఉత్తర్వు ప్రభుత్వ విద్యా వ్యవస్థకు, విధానాలకు లోబడి ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు పనిచేయాలంటుంది. కానీ ఇప్పుడు తెస్తున్న చట్టం ప్రైవేట్ పాఠశాలల కోసం తెచ్చిన ప్రత్యేక చట్టం. ఇది మన విద్యా లక్ష్యాలు, విధానాల నుంచి ప్రైవేటు స్కూళ్ళను విడదీసి ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తుంది. ఇష్టారాజ్య స్వయంపోషకత్వాన్ని కట్టబెడుతుంది. కార్పొరేట్లు కోరుతున్నట్లే ఇందులో ప్రైవేటు స్కూళ్ళకు ఫీజులపై సర్వాధికారాలు సంక్రమిస్తాయి. వీటితో ప్రభుత్వానికేమీ సంబంధం వుండదు. స్వయం ప్రతిపత్తిగల 'ప్రాంతీయ ఫీజు నియంత్రణా కమిటీ' ఫీజుల్ని నిర్ణయిస్తుంది. దీనిపై అప్పీళ్ళు ఇంతకంటే స్వతంత్ర ప్రతిపత్తిగల 'రివిజన్ కమిటీ' మాత్రమే చేపడుతుంది. అసలు ఏకాఏకిన యాజమాన్యాలు ప్రతి యేడాదీ వాటికవే 12% ఫీజులు పెంచుకోవచ్చు. ఇవికాక పుస్తకాల నుంచి స్విమ్మింగ్ పూల్‌దాకా, వార్షికోత్సవాల నుంచి కంప్యూటర్లదాకా, ప్రత్యేక సదుపాయాలకు మరిన్ని ఫీజులు వడ్డించవచ్చు. మరీ విచిత్రం ఏమిటంటే.... యాజమాన్యం మరో స్కూలు పెట్టాలనుకొంటే దానికి కావాల్సిన నిధుల కోసం కూడా ఫీజుల్ని పెంచుకోవచ్చు. ప్రస్తుతం యాజమాన్యాలు వసూలు చేసే ఫీజుల్ని ఎలా ఖర్చు చేయాలో స్పష్టమైన నిబంధనవుంది. ఫీజుల్లో 50% జీతాలకు, 15% ప్రావిడెంటు ఫండ్ లాంటి వాటికి, 15% నిర్వహణకు, 15% పాఠశాల అభివృద్ధికి వాడుకోగడా మిగిలిన 5% మాత్రమే మేనేజ్‌మెంటుకు దక్కుతుంది. కొత్తచట్టం యాజమాన్యాలకు ఈ 'సంకెళ్ళ' నుంచి 'విముక్తి' కలిగించింది. ఇప్పటిదాకా ప్రభుత్వాలుగానీ, న్యాయస్థానాలు గానీ విద్యా సంస్థల్లో లాభాల్ని అంగీకరించలేదు. ఈ సాహసాన్ని తొలిసారి ఈ చట్టం చేస్తోంది.

### ప్రవేశాల నుంచీ పాఠాలదాకా...

ప్రవేశాల విషయంలో 'విద్యాహక్కు చట్టం' పిల్లలకు పరీక్షలు పెట్టరాదనీ, ఒత్తిడి కల్గించరాదనీ చాలా ఖచ్చితంగా చెపుతుంది. కానీ కొత్త చట్టం ప్రవేశ విధానాన్ని పూర్తిగా యాజమాన్యాల చేతిలో పెట్టింది. పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని సైతం ఇది తోసిరాజంది. ఇప్పటిదాకా తెలుగును మొదటి భాషగా లేదా రెండవ భాషగా బోధించి తీరాలన్నది జిఓ ఎంఎస్ నం.1 నిర్దేశం. దీన్నిప్పుడు తొలగించారు. ప్రభుత్వ పాఠ్యగ్రంథాలనే వాడాలన్న నిబంధన కూడా ఎత్తివేశారు. పనిగంటలు, పనిదినాలు కూడా ఇక యాజమాన్యాల ఇష్టం. 'జాతీయ పాఠ్య ప్రణాళికా విధానాని'కిది పూర్తి వ్యతిరేకం. కేంద్ర, రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థలు రాజ్యాంగ విలువలతో, ప్రమాణాలతో పాఠ్యగ్రంథాల్ని ఎంతో పరిశోధన చేసి రూపొందిస్తాయి. వాటిని వదిలేసి స్వతంత్ర ప్రచురణ సంస్థలు పాఠ్య పుస్తకాల్ని



# నూతన రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్

భారత 14వ రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్ ఎన్నికయ్యారు. జులై 17వ తేదీన జరిగిన ఎన్నికల్లో బిజెపి (ఎన్‌డిఏ) అభ్యర్థిగా పోటీచేసిన రామ్‌నాథ్ ప్రతిపక్షాల అభ్యర్థి మీరాకుమార్‌తో జరిగిన పోటీలో 65.65% ఓట్లతో విజయం సాధించారు. జులై 25వ తేదీన పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జెఎస్ ఖేహార్ ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు.

71ఏళ్ళ రామ్‌నాథ్ కోవింద్ యుపిలోని కాన్పూర్ డెహార్ జిల్లా పారౌంఖ్ గ్రామంలో 1945 అక్టోబర్ 1న జన్మించారు. యుపిలోని దళిత వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన కోవింద్ కాన్పూర్ విశ్వ విద్యాలయంలో బి.కాం., ఎల్ఎల్‌బి పూర్తి చేశారు. 1971లో న్యాయ వాదిగా ప్రారంభమై రెండెళ్ళు ఢిల్లీ హైకోర్టులో న్యాయవాదిగా, సుప్రీం కోర్టులో అడ్వకేట్ ఆన్ రికార్డ్సుగా ఉన్నారు.

1977 ఆనాటి ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం బిజెపిలో చేరి దళితుల హక్కుకోసం పోరాడుతూ అంచెలంచెలుగా ఎదిగారు.

1994లో యుపి నుండి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైనారు. 1997లో బిజెపి జాతీయ కార్యవర్గం సభ్యునిగా, 1998 నుండి బిజెపి దళిత మోర్చా అధ్యక్షునిగా పనిచేశారు.

2000–2006 మరోసారి రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. ఐక్యరాజ్య సమితిలో భారతదేశానికి కోవింద్ ప్రాతినిధ్యం వహించారు.

2015 ఆగస్టు 8 నుండి బీహార్ గవర్నర్‌గా నియమితులయ్యారు. కోవింద్ అనేక పార్లమెంటరీ కమిటీలకు సారధ్యం వహించారు.

రచించడం, ముద్రించడం ప్రారంభిస్తే ఎలాంటి విలువలుంటాయి? ఎలాంటి ధరలుంటాయి? వీటిని ప్రశ్నించే అధికారం ఎవరికుం టుంది? గుర్తింపు, రెన్యూవల్ తదితర అంశాల్లో నిర్దిష్ట కాలవ్యవధి నిచ్చారు. అప్పట్లోగా ఇవ్వకపోతే ఇచ్చినట్లే పరిగణించాలట. యాజ మాన్యాలకు ఇన్ని హక్కులను ప్రసాదించిన ఈ చట్టం టీచర్ల గురించీ, వాళ్ళ సంక్షేమం గురించి ఒక్కమాట కూడా ప్రస్తావించదు. యాజ మాన్యం తనస్వంత పద్ధతిలో కాంట్రాక్టుగా మాత్రమే టీచర్లను నియమించుకొంటుంది. ఎంత వేతనం ఇవ్వాలో నిర్ణయిస్తుంది. ప్రతి సంవత్సరం పనితీరును అంచనావేసి మాత్రమే కొనసాగిస్తుంది, జీతం పెంచుతుంది. సంక్షేమం, భద్రత, హక్కులు, ఆత్మగౌరవం వంటి పదాలు ఇందులో వెతికినా కనబడవు. 'యునిసెఫ్' లాంటి సంస్థలు ఉపాధ్యాయుల గౌరవ ప్రతిపత్తులమీద మాత్రమే విద్యా సంస్థల ప్రమాణాలుంటాయని చెప్పిన సూక్తులన్నీ ఈ బిల్లుముందు చెల్లని కాసులయ్యాయి. దీంతో చాలక పార్ట్‌టైం, కాంట్రాక్టు, తాత్కాలిక టీచర్లకు ఈ చట్టం ద్వారాలు తెరుస్తుంది.

**పిల్లల హక్కులు గాలికి :**

పిల్లల సంగతీ ఇంతే. వాస్తవానికి ఇప్పటి కార్పొరేట్ విద్యా విధానంలో నలిగిపోతున్నది పిల్లలే. వాళ్ళ వికాసానికీ, హక్కులకూ ఏమాత్రం అవకాశం, రక్షణలేనివీ స్కూళ్ళు. దీనిపై ప్రతి ఒక్కరం ఆవేదన చెందుతున్నాం. కానీ ఈ చట్టం పిల్లలకు ఎన్నిరకాల దండనలు విధించవచ్చో, పిల్లలపై ఎన్ని ఆంక్షలు పెట్టవచ్చో, వాళ్ళ క్రమశిక్షణ ఎంత పకడ్బందీగా వుండాలో చెప్పిన తీరుచూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఇక తల్లిదండ్రుల హక్కులు. ఫీజులు వీరివి, పిల్లలు వీరి పిల్లలు. మరీ వీళ్ళకున్న హక్కులేమిటి? తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సంఘాన్నొకదాన్ని పెట్టి, అది కేవలం సాంస్కృతిక, సామాజిక, సేవా కార్యక్రమాలు చెయ్యడానికే ఈ చట్టం పరిమితం చేసింది. అంతకుమించి పాఠశాల నిర్వహణలో, పిల్లల ప్రయోజనాల్లో, నిధుల ఖర్చులో వీరికి ప్రమేయమేలేదు. ప్రపంచంలోని గొప్ప విద్యా సంస్థలన్నింటిలో తల్లిదండ్రులకు గొప్ప పాత్ర వుంటుంది. ఇంత ఆధునిక విద్య నేర్పుతామనే కార్పొరేట్లకి ఇంత నిరంకుశ వ్యవస్థ, పనితీరు దేనికి? ఈ చట్టం యాజమాన్యాలపై స్వతంత్ర కమిటీలకు ఫిర్యాదులు, అప్పీళ్ళు చేసుకోవడం తప్ప కోర్టుల గడపనెక్కడానికి వీల్లేదంటుంది. న్యాయస్థానాలకతీతంగా, ప్రభుత్వాని కతీతంగా కార్పొరేట్లు నడుస్తాయన్నమాట. 'స్వయంపోషక', 'స్వతంత్ర' అన్ని విశేషణాల పరమార్థం ఇదన్నమాట.

**ఆంధ్రప్రదేశ్ 'సాహసం'**

చివరిగా ఒకమాట మనం మరచిపోకూడదు. అమరావతినిండా అంతర్జాతీయ పాఠశాలలొస్తున్నాయి. వాటికి 10 నుంచి 50 ఎకరాల దాకా భూమిని అప్పగిస్తున్నారు. ఇవన్నీ కార్పొరేట్ కంపెనీల స్కూళ్ళు. త్వరలో అంబానీలు, అదానీలు కూడా ఈ రంగంలోకి దిగబోతున్నారు. పాఠశాల విద్య 80 బిలియన్ డాలర్ల వ్యాపార సామ్రాజ్యం అని వాళ్ళే చెబుతున్నారు. దేశంలోనే ఎక్కడాలేనట్లు ఆంధ్రప్రదేశ్ వీరికి సర్వసౌకర్యాలు కల్పించి స్వాగతం చెబుతోంది. వీరు లాభాలకు, రాయితీలకు గ్యారంటీ లేకుండా రారు. ఆంక్షలూ, అడ్డంకులూ వీరికి నచ్చవుగాక నచ్చవు. సముద్రాలు దాటి ఎఫ్‌డిఐలు కూడా రాబోతున్నాయి. వారికి కావలసినవన్నీ వ్యవస్థీకృతం చేస్తేనే వాళ్ళని సంతృప్తిపరచగలం. దీనికనుగుణంగానే ఈ చట్టం వచ్చింది. ఇప్పుడు 55–60% కార్పొరేట్ స్కూళ్ళలో పిల్లలున్నారు. కార్పొరేట్ పిల్లల శాతం పెరగాలి. పెరగాలంటే చిన్న స్కూళ్ళను కూడా దివాలా తీయించేలా చట్టాలు, పరిస్థితులు వుండాలి. వీటన్నిటినీ కబళించగల ఏర్పాట్లు వుండాలి. ఈ మహత్తర లక్ష్యంతో ఈ చట్టం పుట్టుకొచ్చింది. ఇక కార్పొరేట్ సంస్థలు తప్ప మరేవీ మిగలవని, టీచర్ల, తల్లిదండ్రుల, పిల్లల–ఎవ్వరి హక్కులూ నిలవవని మనందరినీ హెచ్చరించి మరీ చెప్పడానికే ఈ చట్టం వచ్చింది. నేడు నడుస్తున్నది 'బుల్డోజరు రాజ్యం' గదా. దీనికి విద్యారంగం మాత్రం మినహాయింపు ఎందుకవుతుంది.

# UTF-STFI ఆవిర్భావ దినోత్సవాలు

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ 1974 ఆగస్ట్ 10న ఆవిర్భవించింది. 2017 ఆగస్టు 10 నాటికి 43 సం॥లు పూర్తి చేసుకొని 44వ సం॥లోకి ప్రవేశిస్తున్నది. ఈ 43 ఏళ్ళలో అలుపెరగని అవిశ్రాంత పోరాటాలు చేసింది. ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆగస్టు నెలలో యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించాలి.

1974 వరకు ఉన్న ఉపాధ్యాయ సంఘాలన్నీ ప్రాంతీయంగాను, మేనేజ్‌మెంట్‌వారీగా, క్యాడర్‌వారీగా పనిచేసేవి. ప్రాంతీయ ఉద్యమాలకే పరిమితమయ్యేవి. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మేనేజ్‌మెంట్, కేడర్‌లో తేడా లేకుండా పనిచేసే ఉపాధ్యాయ సంఘం ఆవశ్యకత ఏర్పడింది. అందుకే రాష్ట్రవ్యాప్త ఉపాధ్యాయ ఉద్యమం నిర్మించడానికి ఒక చారిత్రక అవసరంగా 1974లో ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించింది. యుటియఫ్ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యంగా నిర్దేశించుకుంది. హక్కులు – బాధ్యతలు ఉద్యమ నేత్రాలుగా మలచుకుంది. అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకుంది.

సంఘం ఆవిర్భావంనాటికి నాయకత్వం, సభ్యత్వం తక్కువైనా సంఘ లక్ష్యాలు, ఆశయాలు ఉపాధ్యాయులకు ఆదర్శాలుగా నిలిచాయి. మార్గనిర్దేశం చేశాయి. తొలితరం నాయకత్వం త్యాగాలు, సంఘ క్రమశిక్షణ, నిర్వహించిన ఉద్యమాలు, మహాసభలు, సంఘ పని పద్ధతులు, కార్యకర్తలను, ఉపాధ్యాయులను ఆకర్షించాయి. నానాటికి సంఘ సభ్యత్వం పెరుగుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి నూతన ఆంధ్రప్రదేశ్ ఏర్పడే నాటికి లక్షా ఇరవై వేలకు చేరింది. ఇప్పటి 13 జిల్లాల నవ్యాంధ్ర ప్రదేశ్‌లోకూడా లక్షపైగా సభ్యత్వం కలిగి అతి పెద్ద ఉపాధ్యాయ సంఘంగా ఆవిర్భవించింది.



ఎన్.కుమార్ రాజా
ఐక్యఉపాధ్యాయ
ప్రధాన సంపాదకులు

రాష్ట్రంలో ఈ రోజు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న సౌకర్యాలు అన్నీ పోరాడి ఉపాధ్యాయ ఉద్యమం ద్వారా సాధించుకున్నవే. ఈ పోరాటాలలో యుటియఫ్ ఒంటరిగాను, ఇతర సంఘాలతో కలిసి ఉమ్మడిగాను పాల్గొన్నది. అనేక ఉమ్మడి ఉద్యమాలనూ ముందుండి నడిపించింది.

రీగ్రూపింగ్ స్కేళ్ళ సాధన, పే స్కేళ్ళ పెంపుదలకు, ఎయిడెడ్ టీచర్ల డైరెక్టు పేమెంట్ నుండి 60 సం॥ల రిటైర్మెంట్ వరకు, మున్సిపల్ టీచర్ల జీతాల అకౌంట్ నుండి 010 పద్దుతో జీతాల చెల్లింపు వరకూ, నోషనల్ ఇంక్రిమెంట్ల సాధనకు, అప్రెంటీస్ విధానం రద్దుకు, బదిలీల కౌన్సిలింగ్ విధానంకు, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన కోసం ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ స్వతంత్రంగాను, సమైక్యంగాను ఉపాధ్యాయ ఉద్యమాలలో అగ్రభాగాన నిలిచి పోరాడింది.

యుటియఫ్ ఆవిర్భావం తర్వాత జరిగిన శాసనమండలి ఎన్నికలలో యుటియఫ్ అభ్యర్థులు పలు విజయాలు సాధించారు. శాసనమండలి పునరుద్ధరణ తర్వాత 2007లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 5 గ్రాడ్యుయేట్, 3 ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా యుటియఫ్ అభ్యర్థులు గెలిచి ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌గా ఏర్పడి ఉపాధ్యాయ, విద్యారంగ, ప్రజా సమస్యల పరిష్కారంలో కృషి చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో యుటియఫ్ అభ్యర్థులు హ్యాట్రిక్ మరియు ద్వితీయ విజయాలను సాధించారు.

యుటియఫ్ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులు, జెఏసి సెక్రటరీ జనరల్‌గా పనిచేస్తూ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల సమస్యలు పరిష్కారంలో కృషి చేస్తున్నారు. యుటియఫ్ ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో చైర్మన్‌గా పనిచేస్తూ రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు.

దేశంలోను, రాష్ట్రంలోను విద్యారంగంలో పాలకులు తెస్తున్న విద్యారంగ విధానాలపై ఎప్పటికప్పుడు యుటియఫ్ స్పందిస్తూ సదస్సులు, పోరాటాలు నిర్వహిస్తున్నది. పాఠశాల విద్యారంగ సంరక్షణకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూఉన్నది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి క్రమంగా కేటాయింపులు తగ్గిస్తూ కార్పొరేట్ విద్యావిధానంవైపు మొగ్గుచూపుతున్నది. విద్యాహక్కు చట్టం అమలు చేయకపోగా పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం వంటి రకరకాల పేర్లతో ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి తిలోదకాలు ఇస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్సు యాక్టు 2017 పేరుతో కార్పొరేట్ విద్యా వ్యాపారానికి దాసోహం అంటోంది.

రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలను మూసివేస్తూ, ఉపాధ్యాయ పోస్టులను క్రమంగా కుదిస్తూపోతున్నది. ఎయిడెడ్ విద్యా సంస్థలు మూసివేత దిశగా పయనిస్తున్నాయి. మున్సిపల్ పాఠశాలల్లో విద్యాశాఖ పరిధి దాటి నిర్ణయాలు చేస్తూ పట్టణాలలో ప్రభుత్వ విద్యను పేదలకు దూరం చేస్తున్నారు. ఈ విధానాలను త్రిప్పికొట్టాలి.

43 యేళ్ళ ఉద్యమ చరిత్రలో అనేక ఆర్థిక విజయాలు సాధించాం. కాని నేడు ప్రభుత్వ విద్యావ్యవస్థే ప్రమాదంలో పడింది. 5 మరియు 8 తరగతులలో డిటెన్షన్ విధానం అమలు, పాఠశాల విద్యా వ్యవస్థలో రెండంచెల విధానం, సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ వంటివి అమలులోకి వస్తే ప్రభుత్వ విద్యా వ్యవస్థ క్రమంగా మూతపడుతుంది. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం ప్రధాన కర్తవ్యంగా పని చేయాలి. అందుకోసం పునరంకితం కావాలి.

యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సదస్సులు, సమావేశాలు, చర్చాగోష్టులు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను చైతన్యపరచాలి. ప్రజలతోను, కలిసివచ్చే సంఘాలతోను కలిసి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడు కోవడమే ధ్యేయంగా పనిచేయడం మన ప్రధాన కర్తవ్యం.

# ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) ఆగస్టు 12న ఆవిర్భవించింది. దేశవ్యాప్త ఉపాధ్యాయ ఉద్యమాన్ని విస్తరింపచేందుకు ఏర్పాటుచేసిన ఎస్‌టిఎఫ్ఐ ఏర్పాటులో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) ప్రధాన పాత్ర పోషించింది. తొలుత 1981లో భీమవరంలో తర్వాత నెల్లూరులో జరిగిన మహాసభల్లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ఉపాధ్యాయ సంఘ నేతలతో చర్చించి దేశవ్యాప్త ఉపాధ్యాయ ఉద్యమం నిర్మించడానికి నిర్ణయించటం జరిగింది. 1997లో చెన్నైలో జరిగిన సమావేశంలో కో–ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ స్కూలు టీచర్స్ ఆర్గనైజేషన్ (సిసిఎస్‌టిఓ) పేరుతో ఏర్పడింది. 2002లో కలకత్తాలో సిసిఎస్‌టిఓ రెండవ మహాసభ జరిగింది. ఆ సభలో సిసిఎస్‌టిఓను స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ)గా మార్చుకొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆ మహాసభలో ఆంధ్రప్రదేశ్ నుండి ఏపియుటియఫ్, కేరళ నుండి కెఎస్‌టిఏ, పశ్చిమ బెంగాల్ నుండి ఏబిటిఏ, ఏబిపిటిఏ, రాజస్థాన్ నుండి ఆర్ఎస్ఎస్, పంజాబ్ నుండి జిటియు, హర్యానా నుండి హెచ్ఆర్ఎస్ఏ, త్రిపుర నుండి టిజిటిఏ, టిటిఏ, పాండిచ్చేరి నుండి టిఏపి, తమిళనాడు నుండి టిఎన్‌పిటిఎఫ్, టిఎన్‌హెచ్ఎస్ఎస్‌జిటిఏ, టిఐఏఎస్, జమ్మూ కాశ్మీరు నుండి జె & కెయుటిఏ సంఘాలు హాజరయ్యాయి.

ఎస్‌టిఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నది. అన్ని రాష్ట్రాల్లో విద్యాహక్కు చట్టం కొరకు రౌండ్‌టేబుల్ సమావేశాలు, వర్కుషాపులు, ప్రదర్శనలు ఎస్‌టిఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగాయి. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలపై కోటి సంతకాలు సేకరించి ఎస్‌టిఎఫ్ఐ రాష్ట్రపతికి మెమోరాండం ఇచ్చింది. 1994లో ఢిల్లీలో భారీ సభ నిర్వహించి విద్యాసదస్సు నిర్వహించింది. పిఎఫ్ఆర్‌డిఏ బిల్లుకు వ్యతిరేకంగా ఎస్‌టిఎఫ్ఐ పోరాటాలు నిర్వహించింది. సార్వత్రిక సమ్మెకు మద్ధతు తెలియజేస్తూ ఎప్పటికప్పుడు సమ్మెలో పాల్గొనడం, సంఘీభావం తెలియజేయడం జరిగింది.

ఎస్‌టిఎఫ్ఐ రెండవ మహాసభ 2003లో కేరళలోని పాలఘాట్‌లో జరిగింది. ఎస్‌టిఎఫ్ఐ ఢిల్లీలో స్వంత భవనం నిర్మించుకుంది. ఎస్‌టిఎఫ్ఐ ప్రస్తుతం 17 రాష్ట్రాలలో విస్తరించింది. యుపి, బీహార్, ఒరిస్సా రాష్ట్రాల్లో విస్తరణ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

దేశవ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న సంస్కరణలపై చర్చించి, నూతన విద్యా విధానంలో ప్రభుత్వరంగంలోనే విద్య ఉండాలని, విద్యను కార్పొరేటీకరణ చేయరాదని, బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు పెంచాలని పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసింది. తదనుగుణంగా పోరాటాలు నిర్వహిస్తున్నది. ప్రస్తుతం విద్యారంగంలో నూతన పోకడలు చూస్తున్నాం. విద్యాహక్కు చట్టంకు సవరణలు చేసి 5,8 తరగతుల్లో డిటెన్షన్ విధానాన్ని తిరిగి ప్రవేశ పెట్టమన్నారు. దేశవ్యాప్తంగా పాఠ్యపుస్తకాలలో సమూలంగా మార్పులు తేనున్నారు. వీటిపై స్పందించాల్సిన అవసరం ఉన్నది. మన రాష్ట్రంలో కూడా ఎస్‌టిఎఫ్ఐ పిలుపులకు స్పందిస్తూ కార్యక్రమాలు, ఉపాధ్యాయ ఉద్యమాలు విస్తృతంగా నిర్వహించడం స్కూలు టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్య సంఘంగా మన కర్తవ్యం.

# యుటియఫ్

**- వేమగుప్తాపు వీరన్న,** సామర్లకోట (టౌ), తూ॥గో॥

పల్లవి : యుటియఫ్ యుటియఫ్ ఉపాధ్యాయ హక్కుల సాధన సంఘం
యుటియఫ్ యుటియఫ్ ఉపాధ్యాయ లోకానికి మరో స్వరాజ్యం
అమరజీవి చెన్నుపాటి ఆశయాల సాధనకు (లో)
మనమంతా ఒక్కటై మునుముందుకు సాగాలి ॥యుటియఫ్॥

చరణం : పెంక్షన్లు తెచ్చాము – భద్రత కల్పించాము
కౌన్సిలింగ్ బదిలీల విధానాలు తెచ్చాము
మెడికల్ లీవులు చైల్డ్‌కేరు లీవులు
మెటర్నిటీ పెటర్నిటీ లీవులు ఇప్పించాము
అమరజీవి చెన్నుపాటి ఆశయాల స్ఫూర్తిగా
మనమంతా ఒక్కటై సాధించుకున్నాము ॥యుటియఫ్॥

చరణం : మున్సిపాల్టి కార్పొరేషన్ సర్వీస్ రూల్స్
కౌన్సిలింగ్ సిస్టమ్ సాధించుకున్నాము
పిఇఐ అప్‌గ్రేడేషన్ పండిట్ అప్‌గ్రేడేషన్
ప్రమోషన్లు అన్ని సాధించుకున్నాము
అమరజీవి చెన్నుపాటి ఆశయాల స్ఫూర్తిగా
మనమంతా ఒక్కటై సాధించుకున్నాము ॥యుటియఫ్॥

చరణం : సర్వీస్‌రూల్స్ ఏకీకృత రూల్స్
ఎయిడెడ్ ప్రమోషన్లు సాధించుకోవాలి
ఉపాధ్యాయ బ్రతుకుల్లో చీకటిని నిలిపే
సిపిఎస్ విధానాన్ని రద్దు చేయించాలి
అమరజీవి చెన్నుపాటి ఆశయాల స్ఫూర్తిగా
మనమంతా ఒక్కటై సాధించుకోవాలి ॥యుటియఫ్॥

## పాఠకుల అభిప్రాయాలు పంపండి

**"ఐక్యఉపాధ్యాయ"** మాసపత్రిక ఉపాధ్యాయ సమస్యలు, ఉద్యమాలతో పాటు అనేక సామాజిక, ఆర్థిక, అకడమిక్ అంశాలపై వ్యాసాలు ప్రచురిస్తోంది. కథలు, కవితలతో పాటు పలు శీర్షికలు నిర్వహిస్తోంది. వీటిపై పాఠకుల ప్రతిస్పందనను ఆహ్వానిస్తున్నది. పత్రికలో ప్రచురితమైన అంశాలపై మీ అభిప్రాయాలు మరియు ఏ అంశాలు వుంటే బాగుంటుందో మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. మీ అభిప్రాయాలు క్లుప్తంగా, సూటిగా ఉత్తరాల ద్వారాగానీ, మెయిల్ ద్వారాగానీ తెలియజేయగలరు.

**ఉత్తరాల ద్వారా ....''ఐక్యఉపాధ్యాయ'',** యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారివీధి, గవర్నరుపేట, విజయవాడ–520002.

**E-Mail** : **ikyopadhyaya1975@gmail.com**కి పంపవచ్చు.

**– సంపాదకవర్గం**

# ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య

## మున్సిపల్ పాఠశాలల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఫ్యాప్టో ఆధ్వరంలో

# ఆగస్టు 17న మున్సిపల్ డైరెక్టరేట్ ఎదుట ధర్నా

**ఉపాధ్యాయ మిత్రులారా!**

మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ తరహా విద్యా విధానం పేరుతో ప్రయోగాలు చేస్తున్నారు. విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించాల్సి ఉండగా ఫౌండేషన్ కోర్సుల పేరుతో కొద్దిమందికి ప్రత్యేక బోధనా ఏర్పాట్లు చేస్తున్నారు. తల్లిదండ్రుల్లో ఆంగ్లభాష పట్ల ఉన్న ఆకాంక్ష ఆధారంగా తెలుగు మీడియం మొత్తం రద్దు చేస్తున్నారు. తెలుగు మీడియంలో కొనసాగుతున్న వారికి పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదు. నిన్నటివరకు తెలుగు మీడియంలో వున్న విద్యార్థులందరినీ ఇంగ్లీషు మీడియంలోకి మార్చేస్తున్నారు. విద్యాశాఖతో సంబంధం లేకుండానే మున్సిపల్ శాఖామంత్రి ఏకపక్ష నిర్ణయాలతో మున్సిపల్ పాఠశాలల్లో విద్యా విధానం, బోధనా విధానం మార్చేస్తున్నారు.

తెలుగు, ఇంగ్లీషు రెండు మీడియంలు కొనసాగిస్తామని ఇచ్చిన హామీని గాలికొదిలేశారు. రేషనలైజేషన్ జరిగినప్పటికి పెద్ద ప్రయోజనాలు లేవు, పెరిగిన జనాభాకనుగుణంగా నూతన పాఠశాలలు ఏర్పాటులేదు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ వచ్చినప్పటికి అనేక సవరణలు రావలసిఉంది. పిఎఫ్ సౌకర్యం రాలేదు, పెండింగ్ సమస్యలపై పలుమార్లు ప్రాతినిధ్యాలు చేసినప్పటికీ పరిష్కారం కాలేదు, ప్రమోషన్స్ ఇవ్వాల్సిఉంది, రిక్వెస్టు బదిలీలకు కూడ అవకాశం ఇవ్వలేదు.

అనివార్య పరిస్థితుల్లో మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలపై దశలవారీ పోరాటానికి ఫ్యాప్టో నిర్ణయించింది. **రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ / కార్పొరేషన్ కార్యాలయాల ఎదుట ఆగస్టు 3వ తేదీన ధర్నాలు, మున్సిపల్ డైరెక్టరేట్ (గుంటూరు) ఎదుట ఆగస్టు 17వ తేదీన మహాధర్నా నిర్వహించాలని ఫ్యాప్టో పిలుపునిచ్చింది.** మున్సిపల్ / కార్పొరేషన్ ఉపాధ్యాయులంతా పాల్గొని ధర్నాలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

**సమస్యలు :**

1. పురపాలక పాఠశాలలయందు అన్ని తరగతులకు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి.
2. ఉపాధ్యాయుల సర్వీసు రూల్సుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులలో ఉన్న అసంబద్ధాలను సవరించాలి.
3. ఉపాధ్యాయులకొరకు రూపొందించిన సర్వీసు రూల్స్ యింకా అమలులోనికి రాలేదు కావున ప్రస్తుతము పురపాలక సంఘాలయందు ఏర్పడిన ఖాళీలకు పాత పద్ధతిలోనే పదోన్నతులు చేపట్టాలి.
4. ఉన్నతీకరించిన పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే పదోన్నతులద్వారా పూరించాలి.
5. పురపాలక పాఠశాలల్లో వున్న ప్రాధమికోన్నత పాఠశాలలయందు అవసరమైన స్కూల్ అసిస్టెంటు పోస్టులు మంజూరు చేయాలి.
6. పాఠశాలలు ప్రారంభించి 40రోజులుపైగా గడిచినప్పటికి పాఠ్యపుస్తకాలు అందించలేదు. వెంటనే పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలి.
7. పురపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఏకీకృత సర్వీసురూల్సు పరిధిలోనికి తేవాలి.
8. పాఠశాలల పర్యవేక్షణకు అవసరమయిన మునిసిపల్ విద్యాశాఖాధికారులు, ఉపవిద్యాశాఖాధికారుల పోస్టులు మంజూరుచేయాలి.
9. ప్రధానోపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించి జీఓ 40లో ఉన్న అధికారాలు ఇవ్వాలి.
10. పరస్పర బదిలీలు, స్పౌజు ఆధారిత బదిలీలు వెంటనే చేపట్టాలి.
11. జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలి.
12. ఉర్దూ పాఠశాలల్లో అవసరం మేరకు స్కూల్ అసిస్టెంటు పోస్టులు మంజూరుచేయాలి.
13. జిల్లా యూనిట్‌గా గుర్తించినప్పుడు బదిలీలకు మున్సిపాలిటీని యూనిట్‌గా కాకుండా వార్డును యూనిట్‌గా గుర్తించాలి.
14. ఆన్‌లైన్‌లో అంతర్‌జిల్లా బదిలీలకు అవకాశం కల్పించాలి.
15. ఉపాధ్యాయులకు వర్క్‌లోడు వారానికి 30పీరియడ్లకు మించకుండా చూడాలి.
16. బేసడ్ ఆన్ ఎబిలిటీతో పదోన్నతులు అనేది తొలగించి సీనియారిటీ ప్రకారమే పదోన్నతులు ఇవ్వాలి. ప్రమోషన్స్‌లో 2/3: 1/3 కోటా రద్దుచేసి దానిని 70 : 30గా ఇవ్వాలి.
17. ఇ-టెక్నో స్కూల్‌పద్ధతిని విరమించుకోవాలి.
18. ప్రభుత్వ ఉత్తర్వులు 322లో పొందుపరచబడిన పదోన్నతుల నియామకాలు విధివిధానాలకు, ఉత్తర్వులు 323లో పదోన్నతుల నియామక విధివిధానాలకు తేడా ఉన్నది. అందరికి ఒకేరకమయిన విధివిధానాలు ఉండాలి.
19. జిల్లాను యూనిట్‌గా తీసుకొన్న సందర్భములో 2000తరువాత ఉపాధ్యాయులు డిఎస్‌సిద్వారానే నియమింపబడ్డారు. కావున కార్పోరేషన్ మున్సిపాలిటీ అనే తేడాలు లేకుండా చూడాలి.
20. ఉపాధ్యాయులకు అర్థవేతన సెలవును నగదుగా మార్చుకొనే సౌలభ్యమును కల్పించాలి.
21. పట్టణీకరణ వలన పెరిగిన జనాభాకి అనుగుణంగా పట్టణ శివార్లు, కొత్తకాలనీల్లో పాఠశాలలు ప్రారంభించి టీచర్ పోస్టులు మంజూరు చేయాలి.

# స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017 ముసాయిదా బిల్లును నిలువరిద్దాం

## రాష్ట్ర సదస్సులో వక్తల పిలుపు

విద్యావికాస వేదిక, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటి, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రాలు సంయుక్తంగా జులై 23న విజయవాడ ఎంబివికెలో "స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం–2017" అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించాయి. ఈ సదస్సుకు రిటైర్డ్ ప్రిన్సిపల్ వి.సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు.

ముఖ్యవక్తగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కొత్తగా రూపొందించిన ఈ ముసాయిదా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను పూర్తిగా కార్పొరేటీకరించేందుకు సిద్ధమైందని, దీనిని ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ చట్టంలో యాజమా న్యాలకు ఎన్నో స్వతంత్ర అధికారాలను ఇస్తూ నిబంధనలు రూపొందించారన్నారు. ఫీజుల విషయంలో వాళ్ళు వసూలు చేసే సొమ్ము దేనికెంత ఖర్చు పెట్టాలనేది లేదు. సంవత్సరానికి 12% పెంచుకోవచ్చు. ప్రత్యేక అవసరాలరీత్యా ఏ పేరుతోనైనా ఎంతైనా పెంచుకోవచ్చును. ఇది జిఓ ఎంఎస్ నం.1కి పూర్తిగా విరుద్ధం.

అకడమిక్‌కు సంబంధించి రిక్రూట్‌మెంట్ మీడియం, పనివేళలు, పాఠ్య పుస్తకాలు, అడ్మిషనున్న మొ|| అన్ని అధికారాలు యాజమాన్యానికి అప్పగించారు. ప్రభుత్వ నియంత్రణ లేదు. పుస్తకాలు, నోట్సులు, బ్యాగులు, దుస్తులు అన్నిరకాల పేర్లతో తల్లిదండ్రులను దోచుకునే వాటికన్నింటికి చట్టబద్ధత కల్పించి నట్లయిందన్నారు. స్వతంత్ర ప్రతిపత్తిగల కమిటీల చేతిలోకి అనుమతులు ఇస్తూ నిబంధనలు ఉన్నాయి. తల్లిదండ్రుల పాత్ర నామమాత్రమే.

ఉపాధ్యాయుల హక్కులు, గౌరవానికి సంబంధించి ఒక్కటీ లేదు. జీతాల ప్రస్థావనలేదు. విద్యార్థుల హక్కుల ప్రస్థావన లేదు. ఈ యాక్టు ప్రభావంతో ప్రభుత్వ పాఠశాలలు, చిన్నచిన్న ప్రైవేట్ విద్యా సంస్థలు కనుమరుగవుతాయని ఆందోళన వ్యక్తపరచారు. విద్యావ్యవస్థ ప్రయోజనాలను దెబ్బతీసే ఈ కొత్త డ్రాఫ్టును అడ్డు కోవడానికి అందరు సమైక్యంగా కదలాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటి కన్వీనర్ డి.రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రపంచ వాణిజ్యసంస్థ, వరల్డ్ బ్యాంకల ఒత్తిడితో వ్యాపారాలకు అడ్డగా నిలిచే ప్రభుత్వ నియంత్రణా వ్యవస్థలను తగ్గించి, స్వతంత్ర ప్రతిపత్తిగల వ్యవస్థలను ఏర్పాటు చేసి, విద్యా వ్యాపారానికి ద్వారాలు తెరవడమే ఈ ముసాయిదా రూపకల్పన అన్నారు. దీనిలో కోర్టులు జోక్యము చేసుకోకూడదు అనే నిబంధన ఉంది. అంటే దీని అర్థము ప్రభుత్వపరంగా, విద్యారంగ పరంగా, న్యాయశాఖాపరంగా ఎలాంటి నియంత్రణలు ఈ స్వయంపోషక్ పాఠశాలలపై ఉండదని తెలిపారు.

విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యూటోరియల్స్ అధ్యక్షులు పి.కె.సాంబశివరావు మాట్లాడుతూ బడ్జెట్ స్కూల్సు నిర్వహిస్తూ తక్కువ లాభార్జనతో విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నామన్నారు.

వికాస విద్యావనం వ్యవస్థాపకులు ఎస్.ఆర్.పరిమి మాట్లాడ ుతూ కొత్తచట్టం బాలల హక్కులు హరించేదిగా వుందన్నారు. బాలల విద్యా, సాంస్కృతిక అంశాలకు ప్రాధాన్యత కనబడ లేదన్నారు. క్రిష్ణా అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాయకులు బి.రాజారావు ఈ చట్టంను పూర్తిగా వ్యతిరేకిస్తూ, ప్రజలను చైతన్యపరచాలన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ డ్రాఫ్టు చట్టం కాకుండా పోరాడేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉద్యమాలకు అండగా ఉంటామన్నారు.

సదస్సులో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఉపాధ్యాయ సంఘాల నుండి యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి, ఏపిటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.పాండు రంగప్రసాద్, ఏపిటిఎఫ్ 1938 కృష్ణా జిల్లా నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యారంగ నిపుణులు, ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఉపగ్రహం రూపశిల్పి యు.ఆర్.రావు మృతికి సంతాపం

ప్రపంచ ప్రఖ్యాత అంతరిక్ష శాస్త్రవేత్త ఇస్రో మాజీ చైర్మన్ ఉడిపి రామచంద్రరావు (యు.ఆర్. రావు) జులై 24వ తేదీన మరణించడం పట్ల యుటియఫ్ సంతాపాన్ని తెలియజేస్తోంది.

దేశంలో తొలి ఉపగ్రహం ఆర్యభట్టు రూపశిల్పి అయిన యు.ఆర్.రావు అంతరిక్ష ప్రయోగాలలో ఇస్రో బాలారిష్టాలు ఎదుర్కొంటున్న సమయంలో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. తొలినాళ్ళలో అనేక ప్రయోగాలు విఫలం అయ్యి విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా అలుపెరగని వీరుడిలా ముందుకు వెళ్లారు. అత్యాధునిక పరిజ్ఞానంతో PSLVని రూపొందించారు. ఆయన వేసిన పునాదులపై ఈ రోజు ఇస్రో అనేక విజయాలు సాధించి ప్రపంచ అగ్ర దేశాల సరసన నిలవడం వారి కృషి ఎంతో తోడ్పడింది. భారత అంతరిక్ష ప్రస్థానంలో మరువలేని పాత్ర యు.ఆర్. రావుది.



# నేర్చుకోకుండా పిల్లల ప్రతిఘటన



టీచర్లు తమ శక్తికొలది చదువు చెబుతూ ఉంటారు. పిల్లలు కూడా తమ శక్తికొలది నేర్చుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. కాని ఆశించినంత ఫలితం కనిపించదు. ఎందుకు అని ప్రశ్నిస్తే వెంటనే కొన్ని కారణాలు వినిపిస్తాయి. టీచర్లు చెప్పడం లేదనీ, తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదనీ, పిల్లలకు శ్రద్ధ లేదనీ–

ఈ మూడు కారణాలతోపాటు ఇంకా అనేక కారణాలు కూడా ఉన్నాయనుకొందాం. కేవలం 50 అక్షరాలు వాటి గుణింతాలు నేర్చుకోడానికి ఎన్ని రోజులు కావాలి? ఐదేళ్ళు బడిలో కూర్చున్నందుకైనా రావాలి. టీచర్ చెప్పనందువల్ల రాలేదు అనడం సరిగాదు. టీచర్ ఎంతచెప్పినా రానివారు నేర్చుకోని వారు ఉంటారు. ఇలా నేర్చుకోని పిల్లల్ని మొద్దులని వారికి శ్రద్ధ లేదనీ అనడం కూడా సరిగాదు. రాకపోవడానికి ఇతర కారణాలేవో ఉండి ఉంటాయి. అవేమిటో పరిశీలిద్దాం.



సి.వి.కృష్ణయ్య
జనవిజ్ఞాన వేదిక

గుర్రాన్ని ఏటివరకు లాక్కెళ్లగలమేగాని దానిచేత నీళ్లు తాగించ లేము అనే సామెత మనకు తెలుసు. పిల్లల పరిస్థితి కూడా అలాంటిదే. బలవంతంగా బడికి పంపగలమే గాని నేర్చుకోవడం అనేది పిల్లల మనస్సుకు సంబంధించిన విషయం. దురదృష్టం ఏమిటంటే ఆ పిల్లలకు ఒక మనస్సుంటుందని మనం ఆలోచించం.

**పిల్లల్లో ఆత్మాభిమానం :**

పిల్లల్లో ఆత్మాభిమానం ఎక్కువ. అది ఒక్కటే వారి ఆస్థి. పిల్లలు ఈ ప్రపంచమంతా తనచుట్టూ తిరగాలను కొంటారు. తనకు తానే రాజు. తల్లిదండ్రులుగాని టీచర్లు గాని పిల్లల్ని ప్రత్యేక వ్యక్తులుగా గుర్తించరు. వారుచేసే ప్రతి పనిని తప్పుపడుతూ ఉంటారు. చాలా చులకనగా చూస్తారు. మర్యాదగా పేరు పెట్టి పిలవరు.

వారు చేసే పనులకు ఆడే ఆటలకు అడ్డంకులు సృష్టిస్తారు. ఇంట్లో అయితే పిల్లలు ఏడ్చి తమ పంతం నెగ్గించుకోవడమో లేదా దెబ్బలు తిని తోక ముడుచుకొని గుర్రుమంటూ లోపల బుసలు కొడుతూనో ఉంటారు.

బడిలో ఏమి చేస్తారు? అన్నీ భరించి అక్కడ కూర్చుని ఉండక తప్పదు. టీచర్ అదిలింపులు, బెదిరింపులు భరిస్తూ లాంగ్‌బెల్ కోసం ఎదురుచూస్తూ ఉంటారు.

టీచర్‌కు ఉండాల్సిన మొదటి యోగ్యత పిల్లలచేత ఆమోద యోగ్యుడిగా గుర్తింపు పొందడం. పిల్లవాడి మనస్సులో టీచర్‌కు ఆమోద ముద్రపడకపోతే ఆయన చెప్పే చదువు మాటలు ఆమోద యోగ్యం కాకుండాపోతాయి. అవి ఎంత ప్రయత్నించినా బుర్రకెక్కవు. క్రమ క్రమంగా నేర్చుకోకూడదు అని మనస్సు లోపల తీర్మానం జరిగిపోతుంది. ఇక నేర్చుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఉంటారు. ఇదొక ప్రతిఘటన. తన ఆత్మాభిమానాన్ని దెబ్బతీసిన వారిపై ప్రతిఘటన. ఇందువల్లనే కొందరు పిల్లలు నేర్చుకోలేరు. పిల్లలేగదా అని తేలిగ్గా తీసుకోవడం పెద్ద పోరపాటు.

**ఆత్మ విశ్వాసం కోల్పోవడం :**

ఒక పనిచేసి విజయం సాధించాలంటే ఎవరికైనా ఆత్మ విశ్వాసం కావాలి. బడిలో పిల్లలు ఆత్మ విశ్వాసాన్ని రెండు రకాలుగా కోల్పోతారు. తనకంటే చురుగ్గా ఉన్న పిల్లల్ని చూసి స్వతహాగా తన లోపల ఒక జంకు ఏర్పడుతుంది. తనకు చదువు రాదేమోనని భయపడతారు. దీనికితోడు టీచర్లు, తల్లిదండ్రులు తరగతిలో తెలివి తేటలున్న పిల్లల్ని చూసి నేర్చుకో అంటూ వారితో పోల్చి నీతులు చెబుతూ ఉంటారు. దీనివలన కోపం వస్తుంది. మనస్సులో వ్యతిరేకత ఏర్పడు తుంది. ఆత్మ విశ్వాసం కూడా దెబ్బతింటుంది. నేర్చుకోలేకపోవడానికి ఇది కూడ ఒక కారణం.

**భయం :**

కొందరు పిల్లలకు టీచర్లన్నా, కొన్ని సబ్జెక్టులన్నా భయం ఏర్పడుతుంది. ఈ భయానికి కూడా ప్రారంభంలో కొన్ని కారణాలు ఉంటాయి. ఏ క్లాసులో నేర్చుకోవలసిన విషయం ఆ క్లాసులో నేర్చుకోలేక వెనకబడినందు వల్ల భయం ఏర్పడి ఉండవచ్చు. ఎంత చదివినా గుర్తుండడం లేదనీ భయపడుతూ ఉండవచ్చు. కొంతమంది టీచర్ల మాటతీరు భయపడేటట్లు ఉండవచ్చు. చిన్న పిల్లల్లో అక్షరాలు నేర్చుకొనే వయస్సులో భయమనేది ఉండనేకూడదు. సాధారణంగా టీచరంటేనే వారు భయపడుతూ ఉంటారు. ఎప్పుడు తిడతాడో, ఎప్పుడు ఒంటిమీద దెబ్బపడుతుం దోనని భయపడుతూ ఉంటారు. తప్పులు పోయినా టీచర్ నవ్వుతూ ధైర్యం చెబుతూ సరిదిద్దాలేగాని తిట్టగూడదు. భయం వలన కూడా కొందరు పిల్లలు నేర్చుకోలేరు.

**అశాస్త్రీయమైన బోధనా పద్ధతులు :**

అక్షరాలు నేర్పడంలో విసుగు పుట్టించే పద్ధతులు – ఎలాంటి ఆసక్తి రేకెత్తించని పద్ధతులు ఉపయోగించినందు వల్ల పిల్లలు నేర్చు కోవడంలో వెనకబడతారు. నేర్చుకొన్నవి మరిచిపోతుంటారు. – ఆసక్తి రేకెత్తించేటట్లు ఆటలా ఉండేటట్లు బోధనా పద్ధతులు ఉండాలి.

ఈ పద్ధతులేమిటో – అక్షరాలు నేర్పడంలో కొన్ని మెళకువుల గురించి వచ్చే సంచికలో తెలుసుకుందాం.

**సారాంశం :**

1) చదువు మనస్సుకు సంబంధించిన అంశం. అది రాక పోవడానికి కారణాలు మనస్సులోనే వెదకాలి.
2) పిల్లల్లో ఆత్మభిమానం ఎక్కువ. అది దెబ్బతింటే పిల్లల మనస్సుల్లో ప్రతిఘటన ప్రారంభమవుతుంది. నేర్చుకోకుండా ఉండడానికి ప్రయత్నిస్తూ ఉంటారు.
3) ఆత్మ విశ్వాసం దెబ్బతినే మాటలు పిల్లల్ని అనగూడదు.
4) బోధనా పద్ధతుల్లో శాస్త్రీయత ఉండాలి.
5) టీచర్లకు పిల్లల సైకాలజీ తెలిసి ఉండడం చాలా ముఖ్యం.

## రాష్ట్ర వ్యాపితంగా ఫ్యాప్టో ధర్నాలు

# మాతృభాషను కొనసాగించాలి




రాష్ట్రవ్యాప్తంగా వున్న అన్ని మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులకు స్వేచ్ఛ, సృజనాత్మకత పెంపొందించే మాతృభాష తెలుగు మాధ్యమాన్ని కొనసా గించాలని, తక్షణమే జిఓ 14ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ఆగస్టు 3న ఆందోళనలు చేపట్టారు. విజయవాడ ధర్నాచౌక్ వద్ద అన్ని ఉపాధ్యాయ సంఘాలు ధర్నా నిర్వహించాయి.

ముఖ్య అతిథిగా పాల్గొన్న యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ విధానాలు అమలుచేస్తున్నారని అందరికి నాణ్యమైన, సమానమైన విద్య అందించాలన్నారు. తెలుగు, ఇంగ్లీషు రెండు మీడియంలు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి గుంటూరు జిల్లా తెనాలి, పట్టణంలో జరిగిన మున్సిపల్ టీచర్ల ధర్నాలో పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ లను దాసోహం అయినాయని అందకనుగుణంగా విద్యారంగంలో మార్పులు తెస్తున్నారని అన్నారు. అందులో భాగమే తెలుగు మీడియం రద్దు, డిటెన్షన్ విధానం, సెల్ఫ్ ఫైనాన్స్డ్ ఇండిపెండెంట్ స్కూల్సు యాక్టు-2017 తెచ్చారని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు అప్రమత్తంగా ఉండాలి, ఉద్యమించాలని లేకుంటే విద్యారంగనాన్ని మొత్తం కార్పొరేట్‌లకే అప్పగించేస్తారని వారు అన్నారు. ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా గుడివాడ, మచిలీపట్నం మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు.

గుడివాడలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యా విధానమంటూ తెలుగు మీడియంను రద్దుచేసి ఇంగ్లీషు మీడియాన్ని బలవంతంగా రుద్దాలని చూడడం దారుణమన్నారు.

విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నాలో ఉత్త రాంధ్ర అభివృద్ధివేదిక ప్రధానకార్యదర్శి అజశర్మ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పేదలకు అందకుండా చేయడంకోసం అనేక పాఠశాలలను చంద్ర బాబు ప్రభుత్వం మూసివేస్తోందన్నారు.

కర్నూలులో నిర్వహించిన ఆందోళనలో ఫ్యాప్టో రాష్ట్ర సెక్రటరీ జనరల్ జి.హృదరాజు పాల్గొని మాట్లాడారు. యుటియఫ్ జిల్లా కార్యదర్శి జి.సర్వేశ్వర రెడ్డి అధ్యక్షతన నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్. నరసింహుడు మాట్లాడారు.

శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, ఇచ్ఛాపురంలో ధర్నాలు చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాను యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్ర ప్రారంభించారు. ఇచ్ఛాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం మున్సిపల్ కమీషనర్ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు.


విజయనగరం, పార్వతీ పురం మున్సిపల్ కార్యాలయాల వద్ద జరిగిన ధర్నాల అనంతరం కమీషనర్లు కనక మహాలక్ష్మి, ఎస్.శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. సాలూరులో ధర్నానుద్దేశించి ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య పేరుతో ప్రభుత్వం అనేక ప్రయోగాలు చేస్తోందన్నారు.

గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మంగళగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, పెద్దాపురం, సామర్లకోంట, పిఠాపురం మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

నెల్లూరులో నగర కార్పొరేషన్ ఎదుట ధర్నా చేపట్టారు.


ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ధర్నానుద్దేశించి యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు డి.వీరాంజనేయులు మాట్లాడారు.



# ఎయిడెడ్ పదోన్నతులు - మార్గదర్శకాలు

ఎయిడెడ్ పోస్టులలోని ఖాళీ పోస్టులలో ప్రమోషన్లు ఆర్‌సి 90/పిఎస్-1/2010-2; తేది. 20.07.2017 ద్వారా మార్గదర్శకాలు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసింది. వీటి ప్రకారం ...

1) అభ్యర్థి ఎయిడెడ్ పోస్టులో పనిచేస్తూ, ప్రభుత్వ / స్థానిక సంస్థల ఉపాధ్యాయ పోస్టులకు గల విద్యార్హతలు కలిగి యుండాలి.



కెఎస్ఎస్ ప్రసాద్
**యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి**

2) ప్రమోషన్లకు పాఠశాల ఒక యూనిట్‌గా పరిగణించ బడుతుంది. అనేక పాఠశాలలు ఒకే యాజ మాన్యంలో ఉన్నప్పుడు వాటినన్నిటినీ ఒకే యూనిట్‌గా పరిగణిస్తారు. అయితే ఆయా యాజ మాన్యాలు తమ మేనేజిమెంటులోని పాఠశాల లన్నిటిలో రిక్రూట్‌మెంట్ / సీనియార్టీ ఒకే యూనిట్‌గా నిర్వహించబడుతున్నాయని ఆధారా లు చూపాలి.

3) ప్రమోషన్లు సీనియార్టీ ప్రకారం ఇవ్వాలి. అభ్యర్థు లపై ఎటువంటి క్రమశిక్షణా చర్యలు పెండింగ్‌లో ఉండరాదు.

4) పోస్టులు భర్తీ చేయునప్పుడు ప్రమోషన్లు, రిక్రూట్‌మెంట్ / అబ్జార్షన్ 2:1 నిష్పత్తిలో జరపాలి. అనగా మొదటి, రెండు పోస్టులు ప్రమోషన్ ద్వారాను, 3వ పోస్టు రిక్రూట్‌మెంట్ / అబ్జార్షన్ ద్వారాను భర్తీ చేయాలి. పాఠశాలలో సంబంధిత కేడరు పోస్టు ఒకటే యుంటే మొదటి, రెండు పర్యాయాలు ప్రమోషన్ ద్వారాను; మూడవ పర్యాయం అబ్జార్షన్ / రిక్రూట్ మెంట్ ద్వారాను భర్తీ చేయాలి.

5) ఫీడర్ కేటగిరీలోని టీచింగ్ సిబ్బందికి తగిన అర్హతలు లేనప్పుడు, పాఠశాల నాన్-టీచింగ్ సిబ్బందిలో ప్రమోషన్ పోస్టుకు అర్హతలు కలిగియున్న వారికి ప్రమోషన్ కల్పించ వచ్చు.

6) స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు తగిన విద్యార్హతలతోపాటు సంబంధిత సబ్జెక్టు మెథడాలజీగా ట్రైనింగ్ పొందియుండాలి.

7) ప్రమోషన్ల ప్రక్రియ 2017 ఆగస్టు 3 నుండి 7వ తేదీలోపు పూర్తి చేయాలి.

8) కరస్పాండెంట్ / మేనేజరు పోస్టులు ఖాళీగా ఉన్నచోట స్పెషల్ ఆఫీసర్ లేదా జిల్లా విద్యాశాఖాధికారి ప్రమోషన్ల ప్రక్రియ నిర్వహిస్తారు.

9) ప్రమోషన్లు పొందిన వారు వెంటనే రిలీవు అయి ఆగస్టు 14వ తేదీలోగా ప్రమోషను పోస్టులో చేరాలి.

**ప్రమోషన్లకు నియమ నిబంధనలు :**

31.12.2016నాటి రోలు ఆధారంగా పాఠశాలలో ఉండ వలసిన పోస్టుల సంఖ్య నిర్ధారిస్తారు. వాటిలో ప్రస్తుతము పనిచేస్తున్న వారు పోను మిగిలిన ఖాళీలు సబ్జెక్టువారీగా 2:1 నిష్పత్తిలో ప్రమోషన్లు, రిక్రూట్‌మెంట్ / అబ్జార్షన్ ద్వారా భర్తీ చేస్తారు. అయితే ఇప్పటికీ మంజూరు చేయబడియున్న ఎయిడెడ్ పోస్టుల సంఖ్యకు మించి క్రొత్తగా పోస్టులు మంజూరు చేయబడవు. ప్రాథమిక పాఠశాలలకు 1:30, ప్రాథమికోన్నత పాఠశాలలకు 1:35; ఉన్నత పాఠశాలలకు 1:40గా ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఉండాలి. 1 నుండి 5 తరగతులు 30లోపు; 6,7 తరగతులు 30లోపు; 6 నుండి 10 తరగతులు 75లోపు వుంటే ఆ పాఠశాలలు నష్టదాయక మైనవిగా పరిగణించబడతాయి. వీటిలో పోస్టులు భర్తీచేసే అవకాశం లేదు.

జిఓ ఎంఎస్ నం.40 విద్య; తేది. 18.06.2013 ననుసరించి ఈ పోస్టులు భర్తీ చేయబడతాయి.

**ప్రాథమికోన్నత పాఠశాలలు :**

1) పాఠశాలలో ఎస్ఏ (మాథ్స్ / సైన్సు) కేటగిరీలో ఒక పోస్టు మాత్రమే యుంటే దాని ఎస్ఏ (మాథ్స్) లేదా ఎస్ఏ (బిఎస్) లేదా ఎస్ఏ (పిఎస్) దేనికైననూ కేటాయించవచ్చు. రెండు పోస్టులు ఉంటే ఒకటి ఎస్ఏ (మాథ్స్ / పిఎస్)కు రెండవది ఎస్ఏ (బిఎస్)కు కేటాం చాలి. మూడు పోస్టులు ఉంటే మొదటది ఎస్ఏ (మాథ్స్), రెండవది ఎస్ఏ (బిఎస్), మూడవది ఎస్ఏ (పిఎస్)కు కేటాయించాలి.

2) స్కూలు అసిస్టెంటు (సోషల్ స్టడీస్) పోస్టులు ఒకటికంటే ఎక్కువ ఉన్నప్పుడు మొదటిది ఎస్ఏ (సోషల్), రెండవది ఎస్ఏ (ఇంగ్లీషు), మూడవది ఎస్ఏ (సోషల్), 4వది ఎస్ఏ (ఇంగ్లీషు).... ఈ విధంగా కేటాయించాలి.

3) ఉర్దూ, హిందీ, తమిళం, ఒరియా, మరాఠి, కన్నడ మీడియంలు కలిగిన పాఠశాలల్లో నాన్-లాంగ్వేజ్ సబ్జెక్టులకు పోస్టులు మీడియం వారీగా విడివిడిగా చూపాలి. తెలుగు / ఉర్దూతోబాటు ఇంగ్లీషు మీడియం కూడా ఉంటే మాత్రము నాన్-లాంగ్వేజ్ సబ్జెక్టులకు విడిగా పోస్టులు కేటాయింపు ఉండదు.

**ఉన్నత పాఠశాలలు :**

1) బిఎస్‌సి (ఎంపిసి); బిఇడి (ఎం/పిఎస్) అర్హత కలిగిన వారిని స్కూలు అసిస్టెంటు (మాథ్స్) లేదా ఎస్ఏ (పిఎస్)గా మేనేజి మెంటు సౌలభ్యం ప్రకారం కేటాయించవచ్చు.

2) ఎస్ఏ (సైన్స్)కు సంబంధించి మొదటిది ఎస్ఏ (బిఎస్), రెండవది ఎస్ఏ (పిఎస్), మూడవది ఎస్ఏ (బిఎస్), 4వది ఎస్ఏ (పిఎస్).. ఈ విధంగా కేటాయించాలి.

3) స్కూలు అసిస్టెంటు (సోషల్ స్టడీస్) పోస్టులు ఒకటికంటే ఎక్కువ ఉన్నప్పుడు మొదటిది ఎస్ఏ (ఎస్ఎస్), రెండవది ఎస్ఏ (ఇంగ్లీషు), మూడవది ఎస్ఏ (ఎస్ఎస్), 4వది ఎస్ఏ (ఇంగ్లీషు)... గా కేటాయించాలి.

# ఆగస్ట్ 10న యుటియఫ్, 12న ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించండి

ఆగస్ట్ 10న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) 44వ వ్యవస్థాపక దినోత్సవం, ఆగస్ట్ 12న స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) 18వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని యుటియఫ్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, మండల, పట్టణ కేంద్రాలలో ఆగస్ట్ 10న యుటియఫ్ పతాకాలను, జిల్లా,డివిజన్ కేంద్రాలలో ఆగస్ట్ 12న ఎస్‌టిఎఫ్ఐ పతాకాలను ఆవిష్కరించాలి. అంతేకాకుండా ఆగస్టు నెలంతా కూడా ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా సదస్సులు, సమావేశాలు నిర్వహించాలి. ఉపాధ్యాయులను సమీకరించి వర్తమాన విద్యారంగంలో వస్తున్న మార్పులు వివరించాలి. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా, మండల / పట్టణ శాఖల బాధ్యులు తగిన ముందస్తు ప్రణాళికతో కార్యక్రమాలను రూపొందించుకొని విజయవంతానికి కృషి చేయాలని యుటియఫ్ అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి విజ్ఞప్తి చేశారు.

4) పాఠశాలలో మైనర్ మీడియం ఉన్నప్పుడు మీడియం వారీగా పోస్టుల కేటాయింపు ఉంటుంది. తెలుగు / ఉర్దూ, ఇంగ్లీషు మీడియంలు ఉన్నప్పుడు వాటి మొత్తం రోలు ఆధారంగా పోస్టుల కేటాయింపు ఉంటుంది.

5) పాఠశాలలో భాషా పండితుల పోస్టులలో 50% స్కూల్ అసిస్టెంట్లు గాను, మిగిలిన 50% లాంగ్వేజి పండితులుగాను చూపుతారు.

**ప్రమోషన్లకు కావలసిన అర్హతలు :**

1) జిఓ ఎంఎస్ నం.11 పాఠశాల విద్య; తేది.23.01.2009 లేదా జిఓ ఎంఎస్ నం.12 పాఠశాల విద్య; తేది.23.01.2009 (అధ్యాపకదర్శిని 26)లోగల అర్హతలే ఎయిడెడ్ టీచర్ల ప్రమోషన్లకు కూడా వర్తిస్తాయి.

**ముగింపు :**

ఎయిడెడ్ పోస్టులలో పనిచేస్తున్న ఫీడర్ కేటగిరీ వారికి మాత్రమే ప్రమోషన్లు వర్తిస్థాయి. మంజూరైన అన్‌ఎయిడెడ్ పోస్టులలో పనిచేస్తున్న వారిని తగిన విద్యార్హతలుంటే అబ్జార్బు చేస్తారు. ప్రమోషన్‌కు కేటా యించిన పోస్టులలో రిక్రూట్‌మెంట్ చేపట్టరాదు. జిఓ ఎంఎస్ నం.1 తేది.01.01.1994 ప్రకారమే పోస్టుల భర్తీ జరపాలి. ఒకటికంటే ఎక్కువ పోస్టులు ఉన్న సబ్జెక్టులలో రోస్టర్ పద్ధతి పాటించాలి. ప్రమోషన్లు, అబ్జార్బన్లు అయిన తరువాతనే రిక్రూట్‌మెంటు చేపట్టాలి. అనుమతి లభించిన యాజమాన్యాలు కోర్టులలో వేసిన కేసులు విరమించుకోవాలి. మొత్తం ప్రక్రియ అంతా ఆగస్టు 20వ తేదీలోపు భర్తీ చేయాలి.

కోర్టు ఆదేశాలకనుగుణంగా చేపట్టిన భర్తీ ప్రక్రియ ప్రభుత్వం లేదా యాజమాన్యాల మొండివైఖరి కారణంగా నిలిచిపోకుండా చూడాలి. అప్పుడే ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కొంతైనా ఉపశమనం కలుగుతుంది. ప్రభుత్వం కూడా అవసరమైన పోస్టులు మంజూరుచేసి ఎయిడెడ్ విద్యాసంస్థలు నిలబడేందుకు ఊతమివ్వాల్సివుంది.

## రచయితలకు ఆహ్వానం

సృజనాత్మకత, అభ్యుదయ భావజాలం కల్గిన రచనలను ఐక్య ఉపాధ్యాయ పాఠకులకు అందించాలనే లక్ష్యంతో కథలు, వ్యాసాలు, కవితలు పంపవలసిందిగా రచయితలను ఆహ్వానిస్తున్నాము. సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబించే ఏ అంశాన్నైనా వస్తువుగా తీసుకుని రచనలు పంపండి. అనుకరణ, అనువాదం కాకుండా స్వీయ రచన అయి ఉండాలి. హామీ పత్రం జత పరచండి. ప్రచుర నార్హమైన రచనలను సమయాను కూలంగా "ఐక్యఉపాధ్యాయ" లో ప్రచురిస్తాము. రచనతోపాటు రచయిత ఫోటో, చిరునామా, ఫోన్ నంబరు పంపండి.

– సంపాదకవర్గం, ఐక్యఉపాధ్యాయ

**రచనలు పంపవలసిన చిరునామా :**

**చీఫ్ ఎడిటర్, ఐక్యఉపాధ్యాయ,** 27-31-11,
గవర్నపేట, పాలపర్తివారి వీధి,
విజయవాడ- 520002
మెయిల్ : *ikyopadhyaya1975@gmail.com*

## ఉద్యమవార్తలు పంపండి

**యుటియఫ్ జిల్లా శాఖలు, మండల శాఖలు మీ జిల్లా / మండలంలో నిర్వహించిన సమావేశాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, ప్రాతి నిధ్యాల వార్తలను, ఫోటోలను ఎప్పటి కప్పుడు 'ఐక్య ఉపాధ్యాయ'కు మెయిల్ / పోస్టు ద్వారా పంపండి. మీ పోరాటాలు, విజయాలు అన్ని జిల్లా / మండల శాఖలకు స్ఫూర్తిని కల్గిస్తాయి. ప్రతినెల 30వ తేదీలోగా వచ్చిన వార్తలు, ఫోటోలు మరుసటి నెల పత్రికలో ప్రచురించడం జరుగుతుంది.**

– సంపాదకవర్గం

## నూతన సర్వీస్‌రూల్స్ రూపొందించి విడుదల చేయాలి

ఏకీకృత సర్వీస్‌రూల్స్‌కు రాష్ట్రపతి ఆమోదం లభించిన నేపథ్యంలో నూతన సర్వీస్‌రూల్స్ వెంటనే విడుదల చేయాలని విద్యాశాఖ కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్‌కు విజ్ఞప్తి చేశాము. నూతన సర్వీస్ రూల్స్‌లో 1976లో లోకల్ కేడర్ ఆర్గనైజ్ కాబడిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను కూడా చేర్చాలని విజ్ఞప్తి చేయడమైనది. యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్సీ బి.నాగేశ్వరరావు ఆగస్టు 1వ తేదీన గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఆర్‌పి సిసోడియాను కలిసి నూతన సర్వీస్‌రూల్స్ రూపొందిస్తున్న నేపథ్యంలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను ఉమ్మడి సర్వీస్‌లోకి చేర్చేదానికి ప్రతిపాదనలు విద్యాశాఖకు పంపాలని విజ్ఞప్తి చేయగా ఆ మేరకు ప్రతిపాదనలు విద్యాశాఖకు పంపుతున్నట్లు తెలిపారు.

మున్సిపల్ మేనేజిమెంట్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కామన్ డిఎస్‌సి ద్వారా నియామకాలు, 010 హెడ్ జీతాలు, విద్యా శాఖ సర్వీస్ రూల్స్‌నే అమలు చేస్తునందున నూతన సర్వీస్‌రూల్స్‌లో వీరిని చేర్చాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి కరికాల వలవలన్ మరియు డైరెక్టర్ కన్నబాబులకు ప్రతిపాదనలు విద్యాశాఖకు పంపాలని విజ్ఞప్తి చేయడమైనది.

## మున్సిపల్ టీచర్స్‌కు ప్రమోషన్స్ ఇవ్వాలి

మున్సిపల్, కార్పొరేషన్‌లలో పండిట్స్, పిఇటి అప్‌గ్రేడ్ పోస్టులకు, ఇతర ఖాళీలకు ప్రమోషన్స్ ఇవ్వాలని, పిఎఫ్ సౌకర్యం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేయాలని, తెలుగు మీడియంలో చేరే విద్యార్థులకు అడ్మిషన్లు చేసుకునేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని జులై 13 మరియు 19 తేదీలలో ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ని కలిసి విజ్ఞప్తి చేయడమైనది.

మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చేందుకు, పిఎఫ్ సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని, పాఠశాలల్లో తెలుగు మీడియం పాఠ్య పుస్తకాలు అందించేందకు కమీషనర్లకు తగిన ఆదేశాలు ఇచ్చామని, తెలుగు మీడియం నూతన అడ్మిషన్లకు మంత్రిగారితో చర్చించి తగిన ఉత్తర్వులు ఇస్తామని డైరెక్టర్ తెలియజేశారు.

## ఆన్‌లైన్‌లో మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు

విద్యాశాఖ నుండి పంపబడిన ఉపాధ్యాయులు, పెన్షనర్‌ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు చేయడంలో జాప్యం నివారించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే మంజూరు చేయాలని జులై 14న ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి ఎన్‌టిఆర్ వైద్యసేవా ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ని కలిసి విజ్ఞప్తి చేయడమైనది.



ఐ.వెంకటేశ్వరరావు
యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు

సిఇఓ సానుకూలంగా స్పందించి పెండింగ్ బిల్లులు ఆగస్టులోగా పరిష్కరిస్తామని తెలిపారు. బిల్లులు మంజూరు చేయుటకు ఆన్‌లైన్ సిస్టమ్ ఏర్పాటు చేశామని ఇకపై డ్రాయింగ్ ఆఫీసర్లు ఆన్‌లైన్‌లోనే బిల్లులు పంపాలని, మంజూరైన బిల్లుల ఉత్తర్వులు కూడా ఆన్‌లైన్‌లోనే డ్రాయింగ్ ఆఫీసర్లకు పంపబడతాయని తెలియజేశారు. ఈ నెల 10వ తేదీనుండి ఆన్‌లైన్ సిస్టమ్ అమలు చేస్తున్నారని, పేపర్ ఫైల్స్ పంపాల్సిన అవసరం లేదని, ఈ విషయమై అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయిలో డ్రాయింగ్ ఆఫీసర్లకు, ఉద్యోగ, పెన్షనర్ సంఘాలకు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసినట్లు సిఇఓ తెలియజేశారు.

## బదిలీల సమస్యలపై మంత్రితో చర్చలు

బదిలీల సమస్యలపై జులై 17న విద్యాశాఖమంత్రితో జరిగిన చర్చలలో 2015, 2017 బదిలీలలో రేషనలైజేషన్ / విలీనం జరిగిన వారికి పూర్వపు స్కూల్ పాయింట్లు ఇవ్వాలని, పండిట్స్, పిఇటిల అప్‌గ్రేడేషన్‌లో తప్పనిసరిగా బదిలీ కావల్సిన వారికి పూర్వపు స్కూల్ పాయింట్లు ఇవ్వాలని, ఏజెన్సీలో హిల్‌టాప్ ఏరియా పాఠశాలలను కేటగిరీ–4గా పరిగణించాలని, జులై నెల ఖాళీలను కూడ వేకేన్సీలుగా చూపాలని విజ్ఞప్తి చేయగా వీటిపై ఉత్తర్వులు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఆ మేరకు ఉత్తర్వులు విడుదలైనాయి.

## ఏజెన్సీ, మైదాన ప్రాంత సీనియార్టీ లిస్టులు

షెడ్యూల్ ఏరియాలోని గిరిజనేతరులు మైదాన ప్రాంతానికి బదిలీ కోరుకొంటే వారిని మైదానప్రాంత బదిలీ సీనియార్టీ జాబితాలో వారిని చేర్చాలని జాయింట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డికి జులై 20న విజ్ఞప్తి చేశాము. షెడ్యూల్ ఏరియాలో పనిచేస్తున్న గిరిజనేతరులు ఏజెన్సీ సీనియార్టీ లిస్టులోను, మైదానప్రాంత లిస్టులోను వారి సీనియార్టీ ప్రకారం ఉండేటట్లు సీనియార్టీ జాబితా తయారు చేయాలని డిఇఓలకు ఆదేశాలు ఇస్తామని చెప్పారు. మరియు మైదాన ప్రాంతం నుండి ఏజెన్సీకి బదిలీ కోరుకుంటే ఏజెన్సీ సీనియార్టీ జాబితాలో వారి పేర్లు చేర్చాలని విజ్ఞప్తి చేశాము.

## మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రాతినిధ్యాలు

జూన్ 27వ తేదీన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, యుటియఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులతోపాటు ఏపిఎంఎస్‌టిఎఫ్ ప్రతినిధులు సిఎం చంద్రబాబు నాయుడుని కలిసి మోడల్ స్కూల్స్‌ని రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని, మే నెల నుండి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేయడమైనది. దీనిపై సిఎం స్పందిస్తూ కేంద్ర సాయం కోసం చూస్తున్నామని త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

జులై 17వ తేదీన యుటియఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు గంటా శ్రీనివాసరావుని కలిసి మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల జీతాల సమస్యను పరిష్కరించాలని కోరగా మంత్రి స్పందిస్తూ క్యాబినెట్ సమావేశంలో మాట్లాడ తానని చెప్పారు.

జులై 25వ తేదీన ముఖ్యమంత్రి కార్యాలయంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాసులురెడ్డి, బి. నాగేశ్వరరావులు మరియు పి.బాబురెడ్డి సతీష్‌చంద్రను కలిసి మోడల్ స్కూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని జీతాలను 010 హెడ్ ద్వారా చెల్లించాలని కోరారు. సతీష్‌చంద్ర వెంటనే పాఠశాల ముఖ్య కార్యదర్శి ఆదిత్యానాథ్‌దాస్‌ని 6 నెలల జీతాలకు నిధులను పాఠశాల విద్యా బడ్జెట్‌లో నుండి కేటాయించాలని, ఈ పాఠశాలలను గవర్నమెంట్ మోడల్ స్కూల్స్‌గా మార్చి స్కూల్ ఎడ్యుకేషన్‌లో ప్రత్యేక విభాగంగా ఉండేటట్లుగా ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపాలని ఆదేశించారు.

జులై 27వ తేదీన పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి.నాగేశ్వరరావు పాఠశాల విద్య కార్యదర్శిని కలవగా జీతాల ఫైల్‌ని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లుగా కార్యదర్శి తెలిపారు. ఆగస్టు 2,3 తేదీలలో యుటియఫ్ నాయకత్వం, ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు సతీష్‌చంద్రను కలిసి విజ్ఞప్తి చేయగా సిఎం ఆమోదానికి ఫైలు పంపినట్లు చెప్పారు.

### డిఏలు, పిఆర్‌సి అరియర్లు విడుదల చేయాలి ముఖ్యమంత్రికి జెఏసి విజ్ఞప్తి

జులై 2016, జనవరి 2017 డిఏలు వెంటనే విడుదల చేయాలని, 10 నెలల పిఆర్‌సి అరియర్లు చెల్లించాలని, ప్రభుత్వ రంగ, గురుకుల ఉపాధ్యాయులకు 60 సం॥ల పదవీ విరమణ పెంపు 02.06.2014 నుండి అమలు చేయాలని ఆగస్టు 2వ తేదీన జెఏసి రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేసింది. జులై 2016 డిఏ ఆగస్టు 3వ తేదీన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని, పిఆర్‌సి అరియర్లు ఆర్థికమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, 60 సం॥ల పదవీ విరమణ పెంపు ప్రభుత్వరంగ, గురుకులాలకు వర్తింపచేస్తామని తెలిపారు. చైర్మన్ పి.అశోక్‌బాబు, సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావుతో పాటు జెఏసి ఆఫీసు బేరర్లు ప్రతినిధివర్గంలో వున్నారు.

### ఎస్ఎస్ఏ సిబ్బంది, మోడల్ ఉన్నత పాఠశాలలు మరియు కెజిబివి టీచర్ల సమస్యలకై పిడిఎఫ్ కృషి


కెజిబివి పాఠశాలల్లో పనిచేయుచున్న సిఆర్‌టిలు, ఎస్ఓలు తదితర సిబ్బంది సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మరియు యుటియఫ్, కెజిబివి సంఘం నాయకులు కలిసి సమస్యలపై ఎస్‌పిడి మరియు విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి ప్రాతినిధ్యం చేయడం జరిగింది.

ఏపిఎస్ఎస్ఏలు సెక్టోరల్ ఆఫీసర్స్‌గా పనిచేయుచు తొలగించబడిన 11మందిని తిరిగి రెన్యువల్ చేయడమైనది.

ఎస్ఎస్ఏలో పనిచేయుచున్న 25వేలమంది కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వారి గౌరవ వేతనాలు పెంపుదలకు విద్యామంత్రి, విద్యాశాఖ కార్యదర్శికి ప్రాతినిధ్యం చేశాము. ఆ మేరకు వారి జీతాలు పెంపుదల చేయడం జరిగింది.

మోడల్ ఉన్నత పాఠశాలల సిబ్బంది జీతాలు బడ్జెటు గురించి ముఖ్యమంత్రితోను, కార్యదర్శి సతీస్‌చంద్రకు ప్రాతినిధ్యం చేసి 122.78 కోట్లు పాఠశాల విద్యాశాఖ బడ్జెట్ నుండి చెల్లించు టకు ప్రతిపాదనలు విద్యాశాఖ నుండి పంపే ఆదేశాలు ఇప్పించాము. తదుపరి విద్యాశాఖ కార్యదర్శి మరియు మంత్రి ద్వారా ఫైలు సిఎం పేషికి త్వరగా చేరేట్టు కృషి చేశాము. సిఎం కార్యాలయంలో కూడా యుటియఫ్ నాయకులతో కలిసి ప్రాతినిధ్యం చేశాము. సమస్య త్వరలో పరిష్కారం కాబడుతుంది.

## అభ్యుదయ శాస్త్రవేత్త పిఎం భార్గవ మృతికి సంతాపం



సెంటరు ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సిసిఎంబి) వ్యవస్థాపక డైరెక్టర్, అభ్యుదయ శాస్త్రవేత్త పుష్పమిత్ర భార్గవ (89) ఆగస్టు 1న హైదరాబాద్‌లో మరణించారు. ఈయన మరణానికి యుటియఫ్ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నది. 1928 ఫిబ్రవరి 22న ఆజ్మీర్‌లో జన్మించిన ఆయన 21 ఏళ్ళకే సింథటిక్ ఆర్గానిక్ కెమెస్ట్రీలో పిహెచ్‌డి పట్టా పొందారు. ఈయన సేవలకు 1986లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. దేశంలో నెలకొన్న అసహన పరిస్థితులు, దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని నిరశిస్తూ 2016లో ఈ అవార్డును వెనక్కి ఇచ్చేశారు. అవార్డుతోబాటు ఆవేదనను కేంద్ర హెూంశాఖకు పంపారు. శాస్త్ర విజ్ఞానాన్ని సామాన్య ప్రజలలోకి తీసుకెళ్ళాలని విశాల దృక్పథంతో వ్యవహరించారు. నేషనల్ నాలెడ్జి కమీషన్ వైస్ చైర్మన్‌గా పనిచేసి ప్రభుత్వానికి విలువైన సూచనలు చేశారు. సైంటిస్టుగానే గాకుండా జనంకోసం పనిచేసిన మహా మనిషి భార్గవ. ప్రజలకు ఉపయోగపడే అంశాలపైనే ఎక్కువ ప్రయోగాలు చేసేవారు. మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేశారు. 2017 జనవరిలో తిరుపతిలో జరిగిన సైన్సు కాంగ్రెస్‌లో సైన్సు లేదంటూ వ్యాఖ్యలు చేశారు. సూడో సైన్సును ప్రచారం చేస్తున్న శాస్త్రవేత్తల డిగ్రీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.




# ఆదర్శ పాఠశాలలకు ఆదరణ కరువైంది?

2009 ఆగస్టు 15న యుపిఏ ప్రభుత్వం దేశవ్యాపితంగా వెనకబడిన గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు కోసం ఇంగ్లీషు మీడియంలో 6000 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ఘనంగా ప్రకటించింది. అందులో 3500 పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, 2500 పిపిపి పద్ధతిలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

2011 సం॥లో కేంద్రం 75%, రాష్ట్రం 25% నిధుల కేటాయింపులతో ఒక్కొక్క భవనానికి 3 కోట్ల 3 లక్షలు వంతున భవనాల నిర్మాణం ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 355 పాఠశాలలు మంజూరు కాగా విభజన అనంతరం నవ్యాంధ్ర ప్రదేశ్‌లోని 12 జిల్లాలలో 163 పాఠశాలలు కొనసాగుతున్నాయి.



ఎన్.బోసుబాబు
రాష్ట్ర ప్రధానకార్యదర్శి
APMSTF

ఈ పాఠశాలల్లో 6వ తరగతి నుండి ఇంటర్మీడియేట్ వరకు విద్యాబోధన జరుగుతుంది. 6 నుండి 10వ తరగతి వరకు క్లాసుకు 80మంది (2 సెక్షన్‌లు) వంతున 400మంది, ఇంటర్మీడియేట్‌లో గ్రూపుకి 20 వంతున నాలుగు గ్రూపులలో 80మంది రెండు సంవత్సరాలకు 160మంది విద్యార్థులుంటారు.

బోధన సిబ్బందిగా ఒక ప్రిన్సిపాల్, 13మంది పిజిటిలు 6 మంది టిజిటిలను రెగ్యులర్ టీచర్లుగా నియమించారు. పిడి, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్, వాచ్‌మెన్ వంటి నాన్‌టీచింగ్ సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ ద్వారా నియమించారు.

2013-14 విద్యా సంవత్సరం నుండి 6,7,8 తరగతులు మరియు మొదటి సంవత్సరం ఇంటర్మీడియేట్‌కి అడ్మిషన్‌లు ప్రారంభించబడ్డాయి. మొదట్లో లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక జరిగేది. 2015-16 విద్యా సంవత్సరం నుండి అడ్మిషన్ టెస్ట్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతోంది.

**ప్రత్యేకంగా బోధన సిబ్బంది నియామకాలు :**

ఇంగ్లీషు మీడియం బోధనకు కొరకు ప్రత్యేక డిఎస్‌సి ద్వారా నియమకాలు జరిపారు. 2012 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చి 2012 మే లో నియామక పరీక్షలు నిర్వహించి డిసెంబర్‌లో ఫలితాలు ప్రకటించారు.

2013 జూన్ నెలలో ప్రిన్సిపల్స్, పిజిటిలు నియమించారు. తగిన అర్హతలు కల్గిన వారు లేక అన్ని ప్రిన్సిపల్ పోస్టులు భర్తీ కాలేదు. అనంతరం నవంబర్ నెలలో టిజిటి పోస్టులు భర్తీ చేసారు. ఇప్పుడు సుమారు 1900 బోధనా సిబ్బంది, 1200 బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు.

2015-16 విద్యా సంవత్సరంలో మొదటిసారిగా పదవ తరగతి పరీక్షలకు ఆదర్శ పాఠశాలల విద్యార్థులు హాజరుకాగా 97.16% ఫలితాలు సాధించి ఆదర్శ పాఠశాలలు ప్రజలను ఆకర్షించగలిగాయి. ఇప్పుడు అడ్మిషన్‌లకోసం పోటీ ఎక్కువ అయింది. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించలేక అందరు ఆదర్శ పాఠశాలలవైపు వస్తున్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కుప్పంలోని పాఠశాలలలో సీట్ల సంఖ్య చాలక ప్రత్యేకంగా పెంచారు. అన్ని ప్రభుత్వ స్కూల్సులాగే యూనిఫాం, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు అన్ని ఇస్తున్నారు.

ఈ విద్యా సంవత్సరం నుండి బాలికల హాస్టల్స్ ప్రారంభించారు. వార్డెన్‌లను నియమించాల్సి ఉంది. ఆర్ఎంఎస్ఏ సహకారంతో 2016-17 విద్యా సం॥ నుండి 126 పాఠశాలల్లో ఒకేషనల్ విద్యా కోర్సులు ప్రారంభించారు.

**కేంద్ర ప్రభుత్వం 2015 బడ్జెట్ సమావేశాల్లో ఇకపై మోడల్ స్కూల్సు నిర్వహణ బాధ్యత కేంద్రానిది కాదు. రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించుకోవాలి అని స్పష్టంగా ప్రకటించి తన బాధ్యత నుండి తప్పుకుంది.**

**ఇక్కడనుంచే సమస్యలు :**

మంచి పాఠశాలలుగా గుర్తింపుపొందిన మోడల్ స్కూల్సు బాధ్యతను తీసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. వివిధ రకాల ఫండ్స్‌నుండి జీతాలు మాత్రం చెల్లించారు తప్ప రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. 2017 ఫిబ్రవరి నుండి జీతాలు లేక, ఏప్రిల్ 12న డైరెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తే మూడు నెలల జీతాలు వచ్చాయి. మరల మూడు నెలలుగా జీతాలు అందలేదు. ఏపిఎంఎస్‌టిఎఫ్ ఆధ్వర్యంలో

# ప్రఖ్యాత శాస్త్రవేత్త, పద్మవిభూషణ్ ప్రొ॥ యశ్‌పాల్ మృతి



ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్త, పద్మవిభూషణ్ ప్రొ॥ యశ్‌పాల్ జులై 24వ తేదీన ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడాలో మృతిచెందారు. శాస్త్రవేత్తగా యశ్‌పాల్ అంతర్జాతీయ ఖ్యాతి గడించారు. శాస్త్ర రంగంలో ఆయన చేసిన కృషికి 1976లో పద్మభూషణ్ 2013లో పద్మవిభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. సైన్సుకు ప్రాచుర్యం కల్పించడంలో ఆయనచేసిన కృషికి 2000 సం॥లో ఇందిరాగాంధీ అవార్డు, 2006లో మేఘనాథ్ సాహా అవార్డు అందుకున్నారు. 2007-2012 సం॥ల్లో న్యూఢిల్లీలోని జెఎన్‌టియు యూనివర్శిటీకి చాన్సలర్‌గా ఉన్నారు. 1986-91 వరకు యూనివర్సిటీ గ్రాంట్సు కమీషన్ చైర్మన్‌గా సేవలందించడమేగాక పాఠశాల విద్యని, ఉన్నత విద్యని సంస్కరించేందుకు ఉద్దేశించిన కమిటీల్లో కీలక పాత్ర వహిస్తూ దేశ విద్యారంగాన్ని సంస్కరించారు. 1993లో కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ ఏర్పాటు చేసిన జాతీయ సలహామండలి చైర్మన్‌గా యశ్‌పాల్ “Learning without Burden” అనే అంశంపై ఒక డాక్యుమెంట్ తయారు చేసి అందించారు.

NCF-2005 తయారు చేయడంలో యశ్‌పాల్‌గారు తయారు చేసిన “Learning without Burden” ప్రభావం ఎక్కువగా ఉంది. 2009లో ఉన్నత విద్యారంగంలో మార్పుల కోసం వేసిన కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించిన యశ్‌పాల్ అనేక మౌలికమైన మార్పులు ప్రతిపాదించారు. కాని ఆనాటి ప్రభుత్వాలు అవి అమలు చేయలేదు.

విద్యారంగంలో వస్తున్న 'కాషాయీకరణ, కార్పొరేటీకరణ' అనే అంశంపై 2015లో ఎస్‌టిఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన అఖిల భారత సదస్సులో పాల్గొని నేటి పాలకులు విద్యారంగాన్ని ఏ వైపు తీసుకె ళ్తున్నారు. దీనివల్ల వచ్చే ప్రమాణాలపై మంచి విశ్లేషణ చేశారు.

సమాజం పట్ల స్పష్టమైన విజన్ కలిగిన గొప్ప శాస్త్రవేత్త యశ్‌పాల్. వారి మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తోంది.






జిల్లాస్థాయి ధర్నాలు, రాష్ట్ర స్థాయి నిరాహారదీక్షలు, డైరెక్టర్ ఆఫీసు ముట్టడి చేపట్టడం జరిగింది. ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఫైలు కదిలింది. త్వరలో జీతాలు వస్తాయి. ఇది తాత్కాలిక పరిష్కారమే.

ఈ పాఠశాలలన్నీ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నిర్వహించడమే శాశ్వత పరిష్కారంగా ఏపి ఎంఎస్‌టిఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, యుటియఫ్ సహకారంతో సమస్యని అధికారుల కు, విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళింది.

పేరుకే ఆదర్శ పాఠశాలలు కాని అందులో పనిచేసే సిబ్బంది సమస్యలు లెక్కలేనన్నిగా ఉన్నాయి.

## జిల్లాల వారీగా మోడల్ స్కూల్స్

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. శ్రీకాకుళం | - | 14 | 7. ప్రకాశం | - | 10 |
| 2. విజయనగరం | - | 16 | 8. నెల్లూరు | - | 10 |
| 3. విశాఖపట్నం | - | 05 | 9. చిత్తూరు | - | 18 |
| 4. తూర్పుగోదావరి | - | 02 | 10. కడప | - | 10 |
| 5. కృష్ణా | - | 02 | 11. కర్నూలు | - | 33 |
| 6. గుంటూరు | - | 14 | 12. అనంతపురం | - | 25 |

**మొత్తం 159 (ప్రస్తుతం నడుస్తున్నవి. 4 పెండింగ్‌లో ఉన్నాయి)**

సర్వీస్ రూల్స్ లేకపోవటం వలన బదిలీలు మరియు ఇంక్రిమెంట్లపై స్పష్టమైన ఉత్తర్వులు లేవు.

ఏపిఎంఎస్‌టిఎఫ్ ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయులందరిని సమైక్యపరిచి అనేక పోరాటాలు చేపట్టింది. ఎస్ఆర్ ఓపెన్ చేయడం నుండి ఇంక్రిమెంట్లు సాధన, డిఏలు, ఐఆర్ అరియర్లు పొందడం, రిక్వెస్టు బదిలీలు, లీవులు సాధించుకున్నాం. సిపిఎస్ పెన్షన్ ఉత్తర్వులు వచ్చాయి.

కాని సర్వీస్‌రూల్స్ ప్రధానంగా రావాలి. 010 హెడ్ క్రింద జీతాలు రావాలి. ఖాళీ పోస్టుల భర్తీ చేయాలి. కారుణ్య నియామకాలు చేపట్టాలి. హిందీ పిజిటి పోస్టు మంజూరు చేయాలి, పిడిల స్కేలు సవరించాలి. ఇవన్నీ రావాలంటే మోడల్ స్కూల్సు నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి. అందుకోసం సంఘటిత మై పోరాటం చేద్దాం.

పాఠశాలల నిర్వహణలో ఇంకా మెరుగుదలకు మౌలిక వసతులు కల్పించాలి. హాస్టల్ వార్డెన్స్ నియమించి పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పరచాలి. బాలికల రక్షణకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి.

వీటన్నిటిని సాధించుకుందాం. ఏపిఎంఎస్‌టిఎఫ్ సంఘాన్ని అభివృద్ధి చేసుకుందాం. అందుకు ఉపాధ్యాయులందరూ ఐక్యంగా సహకరించాలని కోరుతున్నాము.

# ప్రశ్నోత్తరాలు



*నిర్వహణ :* టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు,
ఐక్య ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు
mail : ikyopadhyaya1975@gmail.com

ప్రశ్న : **నేను మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నాను. ప్రసూతి సెలవు ఎప్పటినుండి పెట్టవచ్చును? చైల్డ్‌కేర్ సెలవు ఎన్ని రోజులు వాడుకోవచ్చు? మెడికల్ సెలవుతో కలిపి వాడుకోవచ్చునా?**

**- పి.సుజాత, పాలకొల్లు**

**జవాబు :** ప్రసూతి సెలవు ప్రసవించిన రోజు నుండి వాడుకో వచ్చును. దానికి ముందు అవసరమైతే కమ్యుటెడ్ సెలవు వాడుకోవచ్చు. చైల్డ్‌కేర్ సెలవు రెండు నెలలు మూడు పర్యాయాలు తక్కువ కాకుండా వాడుకోవాలి. మెడికల్ సెలవుతో కలిపి వాడుకోవచ్చు.

ప్రశ్న : **నేను ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేయుచున్నాను. 24 సం॥ స్కేలు తీసుకొనివున్నాను. ఆగస్టులో హెచ్ఎంగా పదోన్నతి లభించనున్నది. నా వార్షిక ఇంక్రిమెంట్ అక్టోబర్. నా ప్రస్తుత వేతనం 69750/- పదోన్నతి పోస్టులో నా వేతనం ఎలా స్థిరికరించ బడుతుంది?**

**- ఎస్.భరత్‌కుమార్, మెయిల్**

**జవాబు:** మీరు 24 సం॥ల స్కేలు పొందినందున పదోన్నతి పొందిన రోజున పదోన్నతి పొందిన పోస్టులో మీ వేతనం ఎఫ్ఆర్ 22ఎ(1) ప్రకారం స్థిరీకరణ చేయబడుతుంది. ఇంక్రిమెంట్ తేదీ ఆయన అక్టోబర్‌లో ఎఫ్ఆర్ 31(2) ప్రకారం పున:స్థిరీకరణ చేయబడుతుంది. మీ మూల వేతనం 69750/-లు కాబట్టి పదోన్నతి ఆగస్టులో వచ్చినట్లయితే రూ.71,510/-లు గా నిర్ణయించ బడుతుంది.

ప్రశ్న : **నేను ఎయిడెడ్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా నియ మించబడినాను. నేను హెచ్ఎం అకౌంట్ టెస్ట్ పాస్ కాలేదు. నేను 6,12,18 సం॥ల స్కేళ్ళు పొందాను. నాకు 24 సం॥ల స్కేలుకు అర్హత ఉన్నదా?**

**- వి.హెచ్.సి.ప్రసాద్, శ్రీకాళహస్తి**

**జవాబు :** ఉన్నది. నేరుగా స్కూల్ అసిస్టెంట్‌గా నియమించ బడినందున మీరు 24 సం॥ స్కేలు పొందాలంటే రెండవ ప్రమోషన్ పోస్టు లేనందువలన మీకు అర్హతలతో సంబంధం లేకుండా 24 సం॥లు పూర్తి కాగానే స్కేలు మంజూరు చేయబడుతుంది.

ప్రశ్న : **నేను తెలుగు భాషా పండితునిగా పనిచేయుచున్నాను. నా విద్యార్హతలు బిఏ (ఓఎల్) సంస్కృతము మరియు శిక్షాశాస్త్రి ఉత్తీర్ణత పొందాను. నేను స్కూల్ అసిస్టెంట్ (సంస్కృతము)నకు అర్హుడేనేనా?**

**- కె.బాలసుందర్, మెయిల్**

**జవాబు :** అర్హులే.

ప్రశ్న : **మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్‌రూల్స్ వచ్చినందున హెచ్ఎం అకౌంట్ టెస్ట్ పనికిరాదని, దాని స్థానంలో ఇఓ, జిఓ టెస్ట్‌లు పాస్‌కావాలని అంటున్నారు. నిజమేనా? గతంలో హెచ్ఎంటి పాస్ అయినవారు కూడా ఇఓ, జిఓ వ్రాయాలా వివరణ ఇవ్వగలరు.**

**- షేక్ రహమాన్, మంగళగిరి**

**జవాబు:** జిఓ ఎంఎస్ నం.320; తేది.07.12.2016 ప్రకారం హెచ్ఎం అకౌంట్ టెస్ట్ ఉత్తీర్ణులైన వారిని సర్వీస్ రూల్స్ వచ్చిన 3 సం॥ల వరకు పదోన్నతికి పరిగణన లోకి తీసుకుంటారు. కాని 07.12.2016 నాటికి హెచ్ఎం అకౌంట్ టెస్ట్ పాసైన వారిని 3 సం॥లతో సంబంధంలేకుండా సర్వీస్ మొత్తంలో పరిగణనలోకి తీసుకోవాలని యుటియఫ్ డిమాండ్ చేస్తున్నది.

ప్రశ్న : **ఒక ఉపాధ్యాయుడు 2014 ఆగస్టు 29న సస్పెండ్ కాబడి 2016 నవంబరు 16న తిరిగి విధులలో నియమించ బడినారు. మా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రీఇన్‌స్టేట్ అయిన తేదీ నుండి మాత్రమే ఫిక్సేషన్ చేయబడుతుంది అంటున్నారు. సరియైనదేనా?**

**- పవన్‌కుమార్, నెల్లూరు**

**జవాబు:** సరియైంది కాదు. జిఓ నం.46; తేది.30.04.2015 ప్రకారం కేవలం 01.07.2013 నాడు సస్పెన్షన్‌లో వున్న వారికి మాత్రమే తిరిగి నియామకపొందిన తేదీ నుండి ఫిక్సేషన్ చేస్తారు. మీరు 01.07.2013న విధులలో వున్నారు కాబట్టి మీకు 01.07.2013 నుండి ఫిక్సేషన్ చేస్తూ తదనుగుణంగా సబ్‌స్టిట్యూసెన్స్ అలవెన్స్ 2015 ఏప్రిల్ నుండి రివైజ్ చేయాలి.

ప్రశ్న : **నాకు అనారోగ్యం ఉన్నందువల్లవాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంటే నా కుమారునికి ఉద్యోగం లభిస్తుందా?**

**- మల్లేశ్వరరావు, ఒంగోలు**

**జవాబు:** జిఓ నం.601, 23.10.2008లో నిర్ధారించబడిన కొన్ని వ్యాధులకు సంబంధించి వైద్య బృదం ఉద్యోగి సదరు ఉద్యోగానికి పూర్తిగా ఆసక్తుడని ధృవీకరించడం తోపాటు దరఖాస్తు చేసేనాటికి 5 సం॥ల సర్వీస్ మిగిలిన వున్న వారి విషయంలో ఆ కుటుంబంలో మరి ఎవరు సంపాదన పనిలో లేనప్పుడు మాత్రమే కారుణ్య నియామకం వర్తిస్తుంది.

## పాఠకులకు గమనిక

ఇ-మెయిల్ **(ikyopadhyaya1975@gmail.com)** లేదా లేఖల ద్వారా ప్రశ్నలు పంపేవారు వారి పేరు, గ్రామం, జిల్లా పేరు, ఫోన్ నంబరు, ఐక్య ఉపాధ్యాయ చందానంబరు తప్పనిసరిగా వ్రాయాలి. ప్రశ్నలు సూటిగా, స్పష్టంగా ఉండాలి. జిఓ / మెమో కాపీలు కావలసిన వారు సంబంధిత జిల్లాలలో యుటియఫ్ కార్యాలయాలను లేదా బాధ్యులను సంప్రదించాలి. పత్రికా కార్యాలయం నుండి జిఓ / మెమో కాపీలు పంపుటకు వీలుకాదు.

# పోరాడి సాధించుకున్న రీయంగేజ్‌మెంట్ ఉత్తర్వులు - వేతనాల పెంపు

రాష్ట్రవ్యాప్తంగా కస్తూరిబా పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అనతికాలంలోనే కెజిబివి టీచర్సు ఫెడరేషన్ పోరాటాలు, ప్రాతినిధ్యాలుచేసి కొన్ని విజయాలను సాధించింది. పోరాటాలు, ధర్నాలు చేసే ప్రతి సందర్భంలో అధికారులు భయపెడుతూ వేధించే చర్యలు ఆయా జిల్లాల్లో ఉండటం వల్ల నిర్భయంగా బయటకు రాలేని పరిస్థితులు కూడా ఈ వ్యవస్థలో కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల నుండి బయటపడి పోరాట కార్యక్రమాలకు సిద్ధం అయినారు.



కె.విజయగౌరి
UTF రాష్ట్రసహాధ్యక్షులు

ఏప్రిల్ 30వ తేదీన విజయవాడ యుటియఫ్ రాష్ట్ర కార్యాల యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశం ప్రధానంగా పనిభారం, వెట్టిచాకిరి, ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, ప్రసూతి సెలవులపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించింది.

10వ తరగతి రిజల్టు శాతం తక్కువ వచ్చిందనే పేరుతో 19మంది ప్రత్యేక అధికారిణులను, 47మంది సిఆర్‌టిలను ఉద్యోగాల నుండి తొలగిస్తూ ఎస్‌పిడి ఉత్త ర్వులు జారీ చేశారు. వెంటనే కెజిబివి టీచర్స్ ఫెడరేషన్ స్పందించి మే 15వ తేదీన ఎస్‌పిడి కార్యాలయం ఎదుట సామూహిక వినతిపత్రాలతో ఒక రోజంతా నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఎస్ఎస్ఏ జెఏసి రాష్ట్ర నాయకులు కె.విజయ్ పాల్గొని మద్దతు తెలిపారు. అప్పటికే గడిచిన 3 సం॥ల ఫలితాలకు సంబంధించిన వివరాలను ఫార్మేట్ ద్వారా ఎస్‌పిడికి అందజేసి సమస్య తీవ్రతను వివరించడం జరిగింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, యుటియఫ్ రాష్ట్ర నాయకులు కెజిబివి టీచర్సు ఫెడరేషన్, ఎస్ఎస్ఏ జెఏసి నాయకులు ఉమ్మడిగా చేసిన కృషి ఫలితంగా పెరఫార్మెన్స్‌తో కూడిన బదిలీలను నిలుపుదల చేయగలిగింది.

జూన్, జులై నెలల్లోనే సమస్యలకు సంబంధించిన 5రకాల వినతులను ఎస్‌పిడి దృష్టికి తీసుకెళ్లి చర్చించడం జరిగింది. ఫలితంగా ఉద్యోగాల నుండి తొలగించిన వారందరికీ రీయంగేజ్‌మెంటు ఉత్తర్వులు సాధించుకోవడం కెజిబివిటిఎఫ్ మొదటి విజయం. అలాగే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను, మెస్ బిల్లులను సాధించుకోవటంలో కృషి చేసింది.

గత రెండేళ్లుగా పిఏబి ప్రకారం వేతనాలు పెంపుదల చేస్తామని చెప్తున్న ప్రభుత్వం, అధికారులు హామీని అమలు చేయకపోవడంతో జులై 12వ తేదీన ధర్నాచౌక్ వద్ద కెజిబివిటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించారు. దీనికంటే ముందు రాష్ట్ర ఎస్ఎస్ఏ జెఏసి ఆధ్వర్యంలో వేలాదిమందితో జులై 7వ తేదీన మహాధర్నా నిర్వహించారు. పోరాటాలు, ధర్నాలు ఉమ్మడిగా చేసిన కృషి ఫలితంగా ఎట్టకేలకు వేతనాలను పెంచుతూ ఉత్తర్వులను జారీ చేశారు. 10వ పిఆర్‌సి ప్రకారం లేదా సమానపని సమాన వేతనంను అమలు చేయాలని కెజిబివిటిఎఫ్ డిమాండ్ చేస్తుంది. అంతేకాదు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రధాన పోరాటానికి సిద్ధంకానుంది.



**భవిష్యత్‌లో సాధించుకోవలసిన అంశాలు :**

వేతనంతో కూడిన 3 మాసాల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఇపిఎఫ్, హెల్త్‌స్కీమ్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలని, పాఠశాల సమయాన్ని ఉదయం 9 గం॥ల నుండి సా॥ 4.30 ని॥ల వరకు ఉండేలా మార్పు చేయాలని, వార్డెన్లను నియమించాలని, పిఇటి, ఎఎన్ఎంలకు సిఆర్‌టిలతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, ఇంగ్లీషు మీడియంను పూర్తిగా రద్దు చేయాలని, 5 ప్రత్యేక సెలవులు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలనే డిమాండ్లను పరిష్కరించుకోవలసి ఉంది. మన కనీస అవసరాల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం.

కవిత

## నాడు నేడు

- కె.అరుణాచలం, రిటైర్డ్ టీచర్, మంగళగిరి

నాడు కలసి ఉంటే కలదు సుఖం
నేడు కలసిఉంటే కలదు దుఃఖం
నాడు తృప్తికి, త్యాగానికి బానిసలం
నేడు బిపి, సుగర్‌లకు వారసులం
నాటి తరం అరవైలో ఇరవై
నేటి తరం ఇరవైలో అరవై
నాడు అనురాగాలకు, ఆప్యాయతలకు వారసులం
నేడు టివిలకు సెల్‌ఫోన్‌లకు కట్టుబానిసలం
నాడు లేమిలోనే కలదు తృప్తి
నేడు కోట్లు ఉన్నా లేదు సంతృప్తి
నాడు ఆరుబయిలే హాయినిద్ర
నేడు ఏసిలున్నా లేమి నిద్ర
నాడు కళలకు భారతావని పుట్టినిల్లు
నేడు అవినీతికి నల్లధనానికి మెట్టినిల్లు
నాడు సంపాదన జీవన భృతికోసం
నేడు సంపాదన తృప్తిలేని జీవనం కోసం
నాడు మానవ బంధాలన్నీ భోగ భాగ్యాలు
నేడు మానవ బంధాలన్నీ ఆర్థిక సంబంధాలు
నాటి మనిషి ఆస్వాధించాడు నవరసాలు
నేడు మనిషి ఆస్వాధిస్తున్నాడు సారంలేని రసాల్ని
నాడు ఇల్లు వాకిళ్ళు అమ్మానాన్నలతో ఆనంద నిలయాలు
నేడు వృద్ధాశ్రమాలే ఆ జీవచ్ఛవాలకు నిలయాలు
నాడు బలానికి శక్తికి నెలవైన పప్పు చెక్కి సున్నుండలు
నేడు రోగాలకు నెలవైన పిజ్జా, బర్గర్, కూల్‌డ్రింకులు
నాడు "నేటి బాలలే రేపటి పౌరులు"
నేడు "నేటి యువతయే రేపటి వృద్ధులు"
మేలుకో యువతా మేలుకో, మేలుకో, మేలుకో॥

# రాష్ట్రవ్యాపితంగా ఫ్యాప్టో ధర్నాలు

**శ్రీకాకుళం జిల్లా**

**మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి**



శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఆగస్టు 3న ధర్నా నిర్వహించడమైనది. యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్ర ధర్నా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు రెండు మీడియంలు కొనసాగించాలని, పాఠశాలలు పట్టణాల్లో పెరిగిన జనభా ప్రాతిపదికన పట్టణ శివారు ప్రాంతాలలో నూతన పాఠశాలలను ప్రారంభించాలని, ఉపాధ్యాయులకు జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలి. పదోన్నతులను పాత పద్ధతిలో చేపట్టాలని, మున్సిపల్ సర్వీస్ రూల్స్ తప్పులను సవరణచేసి అమలు చేయానలి జిఓ 40 ప్రకారం ప్రధానోపాధ్యాయులకు అధికారాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 17న గుంటూరులోని మున్సిపల్ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని యుటియఫ్ జిల్లా అధ్యక్షులు రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ నాయకులు కె.గోవిందరావు, శంకర రావు, యుటియఫ్ నాయకులు మెండ చంద్రశేఖర్, సూర్యప్రకాష్, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ నాయకులు కె.రాంగోపాల్, పన్నీరురాజు, ఎస్ఎల్‌టిఏ నాయకులు జె.రామారావు మరియు ఎస్ఎస్ ప్రధాన్, కె.అప్పన్నదాస్, ఎ.చిన్నవాడు, డి.మోహనరావు, పి.మోహనరావు, ఎం.గోవిందరావు, పి. ధర్మారావు, బి.రామచంద్రరావు, కె.అన్నాజి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లా**

**మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా**



తెనాలి : రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు మున్సిపల్ పాఠశాలల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఆగస్టు 3న తెనాలిలో మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా జరిగింది. ధర్నా శిబిరానికి పట్టణశాఖ అధ్యక్షులు ఎస్.బసవేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఫ్యాప్టో చైర్మన్, యుటియఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థను కార్పొరేట్ గ్రహణం పట్టిందని, అందుకనే తెలుగు మాధ్యమాన్ని రద్దు చేశారన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు సమాంతర మీడియంలు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఆగస్టు 17న డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.ఎస్.ఎల్.ఎన్. మల్లేశ్వరరావు, ఎ.వి.గోపాలరావు(ఎస్‌టియు), నాయకులు ప్రసన్నకుమార్, మాధవి, నాగమ్మ, డివిఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**చిత్తూరు జిల్లా**

**మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా**




ఆగస్టు 3న చిత్తూరు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు యుటియఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ మున్సిపల్ స్కూళ్ళలో కేవలం ఆంగ్ల మాధ్యమమే పెట్టడం దారుణమైన చర్య అనీ, ఇది మాతృభాష మీద ప్రభుత్వానికి ఎంతప్రేమ ఉందో ఈ విధానాన్ని బట్టి తెలుస్తుంది అని, అసంబద్ధమైన, మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్‌ను సవరించాలని, జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలని, రెండు మీడియంలో పాఠ్యపుస్తకాలు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమమునకు జిల్లా కార్యదర్శులు కనకాచారి, పరంధామ నాయుడు, యుటియఫ్ కార్యకర్తలు మరియు ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

**కడప జిల్లా**

**మున్సిపల్ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి**

తెలుగు, ఇంగ్లీషు రెండు మీడియంలు కొనసాగిస్తామని ఇచ్చిన హామీని గాలికొదిలేశారని, రేషనలైజేషన్ జరిగినప్పటికీ పెద్ద ప్రయోజనాలు లేవు. పెరిగిన జనాభాకనుగుణంగా నూతన పాఠశాలల ఏర్పాటు లేదని, మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్‌రూల్స్ వచ్చినప్పటికీ అనేక సవరణలు రావాల్సి వుందని, పిఎఫ్ సౌకర్యం రాలేదని, పదోన్నతులు ఇవ్వాల్సి ఉందని, తక్షణమే మున్సిపల్ పాఠశాలల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి అని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆగస్టు 3న కడప నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో కో-చైర్మన్ జీవీ నారాయణరెడ్డి, ఎస్టీయు మున్సిపల్ విభాగం రాష్ట్ర కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి ఇలియాస్‌బాషా, యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా ప్రధానకార్యదర్శి సుబ్బరాజు, జిల్లా అధ్యక్షులు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

## మున్సిపల్ పాఠశాలల్లో మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాల్సిందే




రాష్ట్ర వ్యాప్తంగా వున్న అన్ని మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులకు స్వేచ్ఛ, సృజనాత్మకతను పెంపొందించే మాతృభాష తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాల్సిందేనని రాష్ట్ర ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు మున్సిపల్ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం యుటియఫ్ జిల్లా కార్యదర్శి జి.సర్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగినది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జి.హృదయరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ పాఠశాలల్లో మాతృభాష తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా రద్దుచేస్తూ, కేవలం ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెడుతూ జిఓ 14ను జారీ చేయడం అసంబద్ధం, అశాస్త్రీయమనీ, తక్షణమే 14 జిఓను రద్దుచేసి తెలుగు మీడియంను కొనసాగింది, పాఠ్య పుస్తకాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర యుటియఫ్ గౌరవాధ్యక్షులు ఎన్.నర్సింహుడు మాట్లాడుతూ మున్సిపల్ టీచర్లకు పిఎఫ్ సౌకర్యం కల్పించి, సర్వీస్‌రూల్స్‌లోని లోపాలని సవరించాలన్నారు. ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కమలాకరావు మాట్లాడుతూ 872 పండిట్, పిఇటి అప్‌గ్రేడెడ్ పోస్టుల పదోన్నతులు తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఎస్‌టియు సిటి అధ్యక్షులు ఇ.రాముడు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలపై వివక్షత చూపుతుందని కొత్త ఉన్నత పాఠశాలల్లో టీచర్ల పోస్టులు భర్తీ చేయాలన్నారు. మున్సిపల్ పిఇటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుధీర్ మాట్లాడుతూ మున్సిపాలిటినందు ఎడ్యుకేషనల్ ఆఫీసర్, ఉప విద్యాధికారి పోస్టులను సృష్టించి భర్తీ చేయాలని, హెచ్ఎంలకు గెజిటెడ్ హోదా కల్పించాలన్నారు. ధర్నాలో డిటిఎఫ్ నాయకులు అబ్రహాం లింకన్, యుటియఫ్, ఎస్‌టియు, ఏపిటిఎఫ్ నాయకులు ఐ.మరియానందం, వెంకటనారాయణ, సురేష్, కమాల్‌భాషలు మాట్లాడుతూ ధర్నాతో సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 17న డిఎంఏ అమరావతిలో 'మహాధర్నా" చేపడతామన్నారు. అనంతరం కమీషనర్‌కు మెమోరాండం సమర్పించారు.

**ఆదోని :**

పురపాలక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులంతా ఉద్యమాలు చేపడతామని ఫ్యాప్టో నాయకులు రామశేషయ్య, నాగరాజు, రఘురామయ్య అన్నారు. ఆగస్టు 3న పురపాలక కార్యాలయం ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపుతో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఫ్యాప్టోకు, పుర పాలకశాఖ మంత్రితో జరిగిన చర్చల్లో తెలుగు, ఇంగ్లీషు సమాంతర మీడియంలు కొనసాగిస్తామని హామీ యిచ్చి గాలికి వదిలేశారన్నారు. సర్వీస్ రూల్స్ సవరణ చేయాలని, పెండింగ్ సమస్యలపై ఎన్నోసార్లు విన్నవించామన్నారు. పురపాలక శాఖ మంత్రి ఏకపక్ష నిర్ణయాలతో మున్సిపల్ పాఠశాలల్లో విద్యావిధానం, బోధన విధానాన్ని మార్చేయడం ఎంతవరకు సమజసమని ప్రశ్నించారు. ప్రధానోపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించి జీఓ 40లోని అధికారాలు అన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం స్పందించకుంటే ఆగస్టు 17వ తేదీన గుంటూరు మున్సిపల్ డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేపడుతున్నట్లు వారు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ రామలింగేశ్వర్‌కు వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో యుటియఫ్, ఏపిటిఎఫ్, ఎస్‌టియు నాయకులు హనుమంతు, సునీల్‌రాజ్‌కుమార్, పార్ధసారధి, నాగరాజు, లోక్యానాయక్, రమేష్‌నాయుడు, ప్రహ్లాద, కృష్ణమూర్తి, ఫయాజుద్దీన్, నాగేంద్రప్ప, కాశీ విశ్వనాథ్‌శాస్త్రి, రంగన్న, పద్మావతి, కల్యాణి పాల్గొన్నారు.

**అనంతపురం జిల్లా**

## విజయవంతమైన మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నాలు




అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమమునకు యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎం. సుధాకర్ అధ్యక్షతన వహించారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ప్రధానకార్యదర్శి రమణయ్య మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యా యులకు సర్వీస్‌రూల్స్ రూపొందించినప్పటికి అందులో అనేక సవరణలు సూచించినప్పటికి సవరణలు చేయలేదన్నారు. పురపాలక పాఠశాలలన్నీ ఇంగ్లీషు మీడియంగా మార్చివేయడాన్ని ఖండించారు.

ఇంగ్లీషు మీడియంలో పాటు తెలుగు మీడియంను కొనసాగించాలని డిమాండ్‌చేశారు. సమాంతర మీడియం పాఠ్యపుస్తకాలను సరఫరా చేయాలని అన్నారు. పురలపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఏకీకృత సర్వీస్‌రూల్స్ పరిధిలోకి తెచ్చి విద్యను ఒకే గొడుగుక్రిందకు తేవాలని కోరారు.

ఈ ధర్నా కార్యక్రమానికి ఏపిటిఎఫ్, ఎస్‌టియు, పిఇటి అసోసియేషన్, టిఎన్‌యుఎస్ తదితర సంఘాల నాయకులు మద్దతు తెలుపుతూ ప్రసంగించారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో మున్సిపల్ ఉపాధ్యాయిని, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు. తదనంతరం ముఖ్యకార్యదర్శికి వినతిపత్రాన్ని పంపాలని కోరుతూ డిప్యూటీ కమీషనర్‌కి వినతిపత్రము ఇవ్వడమైనది.

అనంతపురం జిల్లాలో గుంతకల్లులో మున్సిపల్ కమీషనర్‌కి రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 45మంది, తాడిపత్రిలో జిల్లా కార్యదర్శి సూరి, రఘురామయ్య, పుల్లన్న ఆధ్వర్యంలో 50మంది, రాయదుర్గంలో జిల్లా సహాధ్యక్షులు గోవిందరాజులు, జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో 40మంది, ధర్మవరంలో జిల్లా కోశాధికారి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 60మంది కలిసి ఆయా కమీషనర్లకు వినతి పత్రాలు ఇచ్చి, కార్యాలయాలు ముందు ధర్నాలు చేయడం జరిగింది.

# సమస్యలపై ధర్నాలు - నిరసనలు

### శ్రీకాకుళం జిల్లా

#### బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి




ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్‌ను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించాలని, పాఠశాల కేటగిరీలను సహేతుకంగా నిర్ణయించి పాయింట్లు కేటాయించాలని యుటియఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. జులై 17న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేటగిరీ మార్పు తేదీల ప్రకారం పాయింట్లు ఇవ్వాలని అన్నారు. అలాగే అన్ని ఖాళీలను సత్వరం ప్రకటించాలని, బదిలీల సీనియార్టీ జాబితా సమగ్రంగా చూపాలని, జాబితాలో ఎలాంటి తప్పిదం లేకుండా చూడాలన్నారు. స్పౌజ్, ఫ్రిఫరెన్షియల్ కేటగిరీలను సక్రమంగా అమలు చేయాలని, ఉపాధ్యాయుల్లో గందరగోళాన్ని నివారించాలని, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు. ఈ ధర్నాలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా ప్రధానకార్యదర్శి సిహెచ్.రవీంద్ర, కార్యదర్శులు ఎస్. కిశోర్, పొందూరు అప్పారావు, వై.ఉమాశంకర్, చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

#### ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తా - శ్రీకాకుళం డిఇఓ బెదిరింపు

ఉపాధ్యాయ కౌన్సిలింగ్‌లో లోపాలను ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తానని, డిఇఓ అనడంపై యుటియఫ్ శ్రీకాకుళం జిల్లాశాఖ తీవ్రంగా ఖండించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉపాధ్యాయ బదిలీ కౌన్సిలింగ్ తీవ్ర గందర గోళం నెలకొంది. స్కూల్ అసిస్టెంట్-జీవశాస్త్ర ఉపాధ్యాయుడు తన సందేహాన్ని తీర్చమని అడిగినందుకు, సందేహాన్ని తీర్చలేక సంజాయిషీ నోటీసు జారీచేశారు. స్కూల్ అసిస్టెంట్-సోషల్ కౌన్సిలింగ్‌కు రమ్మని, శ్రీకాకుళం వచ్చిన తరువాత, వాయిదావేసాం, పొమ్మనడంతో ఎందుకు వాయిదా వేశారని ప్రశ్నించినందుకు తీవ్రస్థాయిలో విరుచుకుపడిన జిల్లా విద్యాశాఖాధికారి, నీ అడ్రస్ ఏమిటి? నీ సంగతి చూస్తానని బెదిరించడం పట్ల యుటియఫ్ తీవ్రంగా ఖండించింది.

జులై 27న స్కూల్ అసిస్టెంట్-సోషల్ కౌన్సిలింగ్ ప్రభుత్వ బాలికల పాఠశాల నుండి బదిలీ కౌన్సిలింగ్‌కు వచ్చిన ఉపాధ్యాయినిని ప్రభుత్వ బాలుర పాఠశాల కోరుకోవద్దనీ, కోరుకుంటే నీ అంతు చూస్తామని, జెసి రజనీకాంతరావు సమక్షంలోనే బెరించడం ఆశ్చర్యకరం. ఫ్రిఫరెన్షియల్ కేటగిరీ (విడో) వున్న ఉపాధ్యాయినిని బలవంతంగా వేరే ఖాళీని కోరించారు. ఆమె కన్నీరు పెట్టిన మహిళా అని కూడకుండా ప్రవర్తించిన జిల్లా విద్యా శాఖాధికారి, ప్రభుత్వ ఉత్తర్వులను వక్రీకరించి వ్యవహరించారు.

స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్ (వికలాంగులు) మెడికల్ బోర్డువారు చేయవలసి ఉండగా, వెరిఫికేషన్ మెడికల్ బోర్డుచే చేయించలేదు. 40% పైనున్న వికలాంగుల వెరిఫికేషన్ కొంతమంది ఉన్నత పాఠశాలల ఉపా ధ్యాయులచే చేయించారు. సాంకేతిక అంశాలను పరిశీలించవలసిన వారు పరిశీలించకుండా, వేరే వారిచే చేయించడంలో ఆంతర్యమేమిటని యుటియఫ్ ప్రశ్నిస్తుంది?

ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను విద్యాశాఖాధికారులకు పాయింట్ల కేటాయింపుపై స్పష్టమైన సూచనలు ఇవ్వకపోవడం వలన ఒక్కో మండల విద్యాశాఖాధికారి ఒక్కోవిధంగా పాయింట్లు కేటాయించడం వలన ఉపా ధ్యాయులలో తీవ్రగందరగోళం నెలకొని వుంది. 2005లో రేషనలైజేషన్ / మెర్జింగ్ చేయబడి, 2017లోను రేషనలైజేషన్‌కు గురైన వారికి (190 క్లారిఫికేషన్, తేది.17.07.2017 ప్రకారం) పాత స్టేషన్ పాయింట్లు 8 సం॥ల గరిష్ఠపరిమితికి మించకుండా ఇవ్వవలసి ఉంది. అయితే కొందరు మండల విద్యాశాఖాధికారులు ప్రస్తుత స్టేషన్ పాయింట్లను, పాతస్టేషన్ పాయింట్లను వేరువేరుగా చేసి చూపడం వలన ఉపాధ్యాయులకు 3 రేషనలైజేషన్ పాయింట్లు కలిపి ప్రస్తుత సీనియార్టీ జాబితాలో ఉన్నాయి. మరికొందరు విద్యాశాఖాధికారులు ప్రస్తుత, పాత స్టేషన్ పాయింట్లు ఉమ్మడిగా చూపడంవలన ఒకేవిధంగా జరిగిన రేషనలైజేషన్‌లో పాయింట్లలో తేడాలు కనిపిస్తున్నాయి. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. జిల్లాల ప్రస్తుతం రేషనలైజేషన్ జరిగి 2011, 2013 సంవత్సరాలలో రేషనలైజేషన్ పాయింట్లను కూడా కొన్ని మండలాల్లో కలిపి చూపించారు.

సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయు సీనియార్టీ జాబితాలో ఇన్ని తప్పులు ఉన్న ఏం పరిశీలన చేయించారో జిల్లా విద్యాశాఖాధికారి వారికే తెలియాలి! జిల్లా విద్యాశాఖాధికారి వ్యవహారశైలిపై విచారణ జరిపి, చర్య తీసుకోవాలని యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రెడ్డి మోహనరావు, చౌదరి రవీంద్ర కోరారు. డిఇఓ వైఖరి మార్చుకోకపోతే పోరాటాలతో తగిన జవాబు చెప్పాల్సి ఉంటుదని జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఒక ప్రకటనలో హెచ్చరించారు.

### విజయనగరం జిల్లా

#### నాప్‌కీన్స్‌పై జిఎస్‌టి పన్ను రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన జిఎస్‌టి బిల్లులో భాగంగా ఆడ పిల్లలు, మహిళలు వాడుకునే శానటరీ నాప్‌కీన్స్‌పై లగ్జరీ పన్నును 5% నుండి 12%కి పెంచడాన్ని నిరశిస్తూ విజయనగరం జిల్లాలో 5 కేంద్రాలలో నిరసన కార్యక్రమాలను విమెన్ టీచర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విమెన్ టీచర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.విజయగౌరి పాల్గొని మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, సంక్షేమ హాస్టల్సులో, కెజిబివి విద్యా

సంస్థల్లో చదువుకుంటున్న ఆడ పిల్లలకు ప్రభుత్వమే ఉచితంగా నాప్‌కీన్స్‌ను సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ గత 16 నెలలుగా సరఫరా నిలుపుదల చేసిందన్నారు. ప్రభుత్వం బాధ్యత నుండి తప్పుకోవడమే కాకుండా, ఇప్పుడు జిఎస్‌టి పన్నుల భారాన్ని వీటిపై కూడా వేయటం దుర్మార్గమని అన్నారు. తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**రామభద్రపురం :**

మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, అనంతరం గాంధీ విగ్రహానికి వినతిని అందజేసి మానవహారం నిర్వహించారు.




ఈ కార్యక్రమంలో కె.విజయగౌరి, భానుమతి, సర్వలక్ష్మి, ఉమ, జ్యోతి, లక్ష్మి, సుచరిత, సుందరిలతో పాటు యుటియఫ్ నాయకులు జి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, సురేష్‌కుమార్‌లు విద్యార్థినులు పాల్గొన్నారు.

**బొబ్బిలి :**




బొబ్బిలి పట్టణ కేంద్రంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద నిరసన తెలియజేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.విజయగౌరి, కృష్ణవేణి, బేగం, పద్మావతి, సుధారాణి, సూర్యకుమారిలతో పాటు కృష్ణమూర్తి, పి.సత్యన్నారాయణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

**దత్తిరాజేరు :**



దత్తిరాజేరు మండలం మరడాం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులు, విద్యార్థినులతో అవగాహన కార్యక్రమం జరిపి అనంతరం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.విజగౌరి, శ్రీదేవి, బుజ్జి, శారద, నిర్మల, స్వప్న, విద్యార్థినులు, యుటియఫ్ నాయకులు రాంప్రసాద్, భాస్కరరావు, శ్రీరాములు నాయుడు, తారక్, పైడిపి నాయుడులు పాల్గొన్నారు.

**మెంటాడ :**




మెంటాడ మండలం పోరాం ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యా యులు, విద్యార్థినులు జిఎస్‌టి బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయగౌరితోపాటు, వనజాక్షి, సరళ, జ్యోతి, సుగుణలు యుటియఫ్ నాయకులు పి.లక్ష్మణరావు, రవి, శ్రీను, ఈశ్వరరావులు పాల్గొన్నారు.

**సాలూరు :**

సాలూరు కేంద్రంలో బాలికోన్నత పాఠశాలలో నిరసన కార్యక్రమం జరిగిపారు. ఈ కార్యక్రమంలో విజయగౌరి, రాజామణి, సరళ, శ్రీదేవి, విద్యార్థినులు, నాయకులు బి.విజయ్‌కుమార్, జగదీష్, సింహాచలం, ప్రదీప్‌లు పాల్గొన్నారు.

**తెలుగు మీడియం కోసం ఆందోళనలు, వినతులు - ధర్నాలు**

పురపాలక పాఠశాలల్లో రెండు మీడియంలు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో 4 మున్సిపాలిటీలలో కమీషనర్‌లకు, మంత్రులకు వినతి పత్రాలు, కౌన్సిలర్‌లకు ప్రత్యేక లెటర్లు, తల్లిదండ్రులతో, విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున నిరసనలు, ముట్టడులు, మానవహారాలు నిర్వహించారు. పార్వతీపురంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీ ప్రదర్శన నిర్వహించి ఆర్‌డిఓకి వినతి పత్రం అందజేశారు. విజయనగరంలో మున్సిపల్ చైర్ పర్సన్‌కు, కౌన్సిలర్లకు వినతులు అందజేశారు. బొబ్బిలిలో 2సార్లు ఆందోళనా కార్యక్రమాలు జరిపారు. పురపాలక కార్యాలయం ముట్టడి, ప్రదర్శనలు జరిపి సిపికి వినతిని అందజేశారు. సాలూరులో విద్యార్థులు ఎమ్మెల్సీ ఇంటిని ముట్టడించారు. యుటియఫ్ నాయకత్వం వినతులు ఇచ్చింది.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.విజయగౌరి, జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి కె.శేషగిరి, జిల్లా సహాధ్యక్షులు ఎస్.మురళి, జిల్లా కార్యదర్శులు పి.శ్రీను, వి.ప్రసన్నకుమార్, రమేష్‌లతో పాటు 4 మున్సిపాలిటీల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లా**

**నాప్‌కిన్స్‌పై జిఎస్‌టి తొలగించాలి**

**మంగళగిరి :** శానిటరి నాప్‌కిన్స్‌పై కూడా ప్రభుత్వం జిఎస్‌టి విధించి నందుకు నిరసనగా యుటియఫ్ రాష్ట్ర మహిళా ఫోరం పిలుపు మేరకు జులై 8న సికె బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా ఫోరం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగినది. జిల్లా సహాధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి ప్రసంగిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో

చదువుతున్న ఆడపిల్లలకు గతంలో ప్రభుత్వమే ఉచితంగా నాప్‌కిన్స్ సరఫరా చేసేదని ఇప్పుడు నిలుపుదల చేసిందన్నారు. నాప్‌కిన్స్‌పై జిఎస్‌టిని తొలగించి ఆడపిల్లలకు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మండల యుటియఫ్ అధ్యక్షురాలు ఎం.రోజ్‌రాణి, పుష్పావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని గీత కిరణ్, పాఠశాల ఉపాధ్యాయినిలు, మండల ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



**ప్రకాశం జిల్లా**

### కౌన్సిలింగ్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ జోక్యం

పారదర్శకంగా జరగాల్సిన బదిలీల కౌన్సిలింగ్ ప్రకాశం జిల్లాలో జిల్లా పరిషత్ చైర్మన్ జోక్యంతో అక్రమాలు జరిగాయని పలువురు ఉపాధ్యాయులు ఆరోపించారు. స్కూల్ అసిస్టెంట్స్ బదిలీల్లో జిల్లా పరిషత్ చైర్మన్ నేరుగా కౌన్సిలింగ్ హాలులో కూర్చుని ఉపాధ్యాయులను తాను చెప్పిన చోటే కోరుకోవాలని బెదిరించడం జరిగింది. సోషల్, ఫిజికల్ సైన్స్ పోస్టులు బ్లాక్ చేసి ఉన్న ఖాళీలు లేవని ప్రకటించారు. యుటియఫ్ జిల్లా శాఖ జోక్యం చేసుకొని ఆందోళన చేపట్టడంతో కౌన్సిలింగ్ ఆపివేశారు. సోషల్, ఫిజికల్ సైన్స్ పోస్టులు బ్లాక్ చేయడం పట్ల వచ్చిన సమస్యను డిఇఓ పరిష్కారం చేయడంతో కౌన్సిలింగ్ కొనసాగింది.

చైర్మన్ వ్యవహారం పట్ల యుటియఫ్ ప్రశ్నించగా పొరపాటు జరిగిందని ఇకపై అలా వ్యవహరించనని స్పౌజ్ బదిలీల్లో జరిగిన అక్రమాలు సరి చేయిస్తానని చైర్మన్ అంగీకరించడంతో ఆందోళన ముగిసింది. ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాల్సిన డిఇఓ ప్రేక్షక పాత్ర వహించడాన్ని యుటియఫ్ ఖండించింది.

**నెల్లూరు జిల్లా**

### శానిటరీ నాప్కిన్స్‌పై జిఎస్‌టి రద్దు చేయాలి



నేటి పరిస్థితులలో ఆడపిల్లలు, మహిళలకు అత్యంత ఆవశ్యకంగా మారిన శానిటరీ నాప్కిన్స్‌పై జిఎస్‌టి విధించడం పట్ల కావలి పట్టణంలో విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. జులై 20న కావలి పట్టణంలోని జెడ్‌పి బాలికోన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డా॥ అజిత పాల్గొన్నారు.

యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీదేవి మాట్లాడుతూ ఆడపిల్లలు, విద్యార్థినుల సంక్షేమం గురించి ఆలోచించి ప్రభుత్వం ఈ టాక్స్ రద్దు చేయాలని, రాజకీయాలకు అతీతంగా మహిళా ప్రజా ప్రతినిధులందరూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. విలాస వస్తువుల వాడకాన్ని తగ్గించ డానికి, ఉన్నత వర్గాలవారిని దృష్టిలో పెట్టుకుని పన్నుల విధానం ఉండాలి కాని పేద, మధ్యతరగతి వర్గాలవారికి భారం పెంచేదిగా ఉండకూడదన్నారు. మహిళా ప్రజాప్రతినిధులందరూ తమ బాధ్యతగా ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్ళి నాప్కిన్స్‌పై జిఎస్‌టిని రద్దు చేయించాలని ఉపాధ్యా యినులు, విద్యార్థినిలు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ఏ సంపత్‌కుమారి, కావలి పట్టణ శాఖ కోశాధికారి రమణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయినులు మాధవి, రాజరాజేశ్వరి, రేణుక, నీరజ, తనూజ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

**కడప జిల్లా**

### ఇష్టారాజ్యంగా 4వ కేటగిరీ పాఠశాలల కేటాయింపు డిఇఓ కార్యాలయం వద్ద ధర్నా

ఉపాధ్యాయ బదిలీల కొరకు పంచాయితీరాజ్ స్కూల్ ఎడ్యుకేషన్ తయారుచేసిన 4వ కేటగిరీ జాబితా పూర్తి అసంబద్ధముగా, తప్పులడకగా ఉన్నదని దీనిని వెంటనే రద్దు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా హెచ్చరించారు.

జులై 10న కడప జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద యుటియఫ్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నానుద్దేశించి లక్ష్మిరాజ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు కేటగిరీ 4లో 60 పాఠశాలలు మాత్రమే ఉండగా, పంచాయితీరాజ్ స్కూల్ ఎడ్యుకేషన్ నిర్లక్ష్యవైఖరి వల్ల ఆ జాబితాలో 940 పాఠశాలలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఏలాంటి రవాణా, వాహన సదుపాయాలు లేని గ్రామాలను 4వ కేటగిరీ పాఠశాలలుగా కేటాయించాలని, అయితే పంచాయితీరాజ్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో 4వ కేటగిరీ జాబితా అస్తవ్యస్తంగా తయారైంద న్నారు. ఈ జాబితా వల్ల ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదని, తక్షణమే ఈ జాబితాను రద్దుచేయకపోత మరో ఉద్యమం జరుగుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఈ ధర్నాలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.విజయ కుమార్, ఎస్.వి.సుబ్బరాజులు మాట్లాడుతూ 2015వరకు ఉన్న 4వ కేటగిరీ ఉపాధ్యాయులకు పాయింట్ల కేటాయింపులో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయా ధికారులు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తు న్నారన్నారు. 4వ కేటగిరీ జాబితా ఉత్తర్వుల ఆధారంగా కాకుండా కార్యాలయ సిబ్బంది స్వయంగా కట్ ఆఫ్ డేట్ నిర్ణయించి పాయింట్లను అమలు చేయడం తగదన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులను పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపించారు. మధ్యాహ్నం భోజన పథకం పాయింట్ల కేటాయింపును ఉపా ధ్యాయులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ నాయకులు వై.మస్తానయ్య, రమణ మూర్తి, కిరణ్, వేణు, రమణమూర్తి, శివసుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై ప్రాతినిధ్యాలు

### శ్రీకాకుళం జిల్లా

#### తప్పుడు ధృవపత్రాలపై విచారణ జరపాలి

ఉపాధ్యాయ బదిలీ కౌన్సిలింగ్‌లో తప్పుడు ధృవపత్రాలను సమర్పించి బదిలీ కోరుకున్నవారి ధృవపత్రాలను పరిశీలించి, విచారణ జరిపి సర్టిఫికెట్లు సమర్పించిన వారు, ఆమోదించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టి శిక్షించాలని యుటియఫ్ ప్రతినిధివర్గం జిల్లా విద్యాశాఖాధికారి ఆబోతుల ప్రభాకరరావును కోరారు. ఉపాధ్యాయుల బదిలీ సీనియార్టీ జాబితాలో వైద్య ధృవపత్రాలు, స్పౌజ్ పాయింట్లు విషయంలో చాలా తేడాలున్నాయని, వాటిని సరిచేయాలని పలుమార్లు ప్రాతినిధ్యం చేసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. తప్పుడు వైద్య ధృవపత్రాలతో కొంతమంది ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా డిపెండెంట్లకు సంబంధించి కేన్సర్, గుండెసంబంధమైన, న్యూరాలజీ సంబంధించిన వైద్య ధృవపత్రాలు అనుమతించారు. అంతే కాకుండా భార్య, భర్త 8 సం॥లు పూర్తికాకుండా మరళ స్పౌజ్ పాయింట్లు అప్లై చేశారు. సీనియార్టీ జాబితాలో చాలా వ్యత్యాసాలు ఉన్నాయి. సీనియార్టీ జాబితాను సరిచేసి, సమగ్ర సీనియార్టీ జాబితాను రూపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారిని యుటియఫ్ జిల్లా ప్రతినిధి వర్గం డిమాండ్ చేసింది.

జిల్లా విద్యాశాఖాధికారి సానుకూలంగా స్పందించి, తప్పుడు ధృవపత్రాలు పరిశీలించి చర్య తీసుకుంటామని, సమగ్ర సీనియార్టీ జాబితాను రూపొందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారిని కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్ర, రాష్ట్ర ఆడిట్ సభ్యులు ఎస్.కిషోర్, జిల్లా కార్యదర్శులు హెచ్ అన్నాజీరావు, వై.ఉమాశంకర్, కార్యవర్గ సభ్యులు మురళీధర్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విజయనగరం జిల్లా

#### తెలుగు, ఇంగ్లీషు సమాంతర మీడియం కొనసాగాలి

**బొబ్బిలి :** రాష్ట్రంలో మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, తెలుగు మీడియం పాఠ్య పుస్తకాలను తక్షణమే సరఫరా చేయాలని, పురపాలక ఉపాధ్యాయులకు పిఎఫ్ ఖాతాలు కేటాయించాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, జిఓ 14ను పూర్తిస్థాయిలో రద్దు చేయాలని విజయనగర జిల్లా శాఖ తరపున రాష్ట్ర భూగర్భ గనులశాఖ మాత్యులకు జులై 24న ప్రాతినిధ్యం చేశారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.విజయగౌరి, జిల్లా కార్యదర్శులు వి.ప్రసన్నకుమార్, వై.స్వామినాయుడు, బొబ్బిలిశాఖ అధ్యక్షులు ఎస్. అచ్చుతరావు, గౌరవాధ్యక్షులు పి.సత్యన్నారాయణ, కార్యదర్శి ఎన్.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### గుంటూరు జిల్లా

#### ప్రిఫరెన్షియల్ కేటగిరీలో అనర్హులపై విచారణ జరపండి

ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీలోకి చేరడానికి 40% అంగవైకల్యం కలిగి ఉండవచ్చు అని ఇచ్చిన సడలింపు నిజమైన అర్హులకు నష్టం కలిగించే విధంగా తయారైందని యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాగేమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు యుటియఫ్ జిల్లా కమిటీ తరపున జిల్లా విద్యాశాఖాధికారికి మెమోరాండం అందించారు. దరఖాస్తుల గడువు ముగిసి కౌన్సిలింగ్‌కు సిద్ధం అయిన సమయంలో జిఓ నం.50 విడుదల చేసి ఈ అవకాశం కల్పించారు. అయితే దీన్ని అవకాశంగా చేసుకొని కొంతమంది దళారులు బయలుదేరి సర్టిఫికెట్లు ఇప్పించే పనిచేశారు. ఈ నేపథ్యంలో వేల రూపాయలు చేతులు మారినట్లుగా తెలుస్తున్నది.



ప్రాధాన్యత సర్టిఫికెట్లతో ఉన్న లోపాలను విచరణ జరిపి నిగ్గు తేల్చాలని, అనర్హులు పొందిన సర్టిఫికెట్లను వెరిఫికేషన్ ద్వారా తేల్చి వారిపై చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారికి న్యాయం చేయాలని యుటియఫ్ జిల్లా శాఖ డిఇఓని డిమాండ్ చేసింది. డిఇఓని కలిసి మెమోరాండం ఇచ్చిన వారిలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులతోపాటు కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్, గౌరవాధ్యక్షులు ఎం.డి.గౌస్, జిల్లా సహాధ్యక్షులు బి.ఆది లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎం.కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

### నెల్లూరు జిల్లా

#### ఉపాధ్యాయ బదిలీలు వెంటనే చేపట్టాలి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పాఠశాలల రేషనలైజేషన్‌ను సంక్లిష్టంగాను, రహస్యంగాను చేసి బదిలీలు సక్రమంగా జరగకుండా విద్యాశాఖ వ్యవహరించిందని ఇప్పటికైనా అనిశ్చితిని తొలగించి వెంటనే బదిలీలు నిర్వహించాలని యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మరియు అసోసియేట్ అధ్యక్షులు కె.తులసీరాంబాబు, ఎన్.నవకోటేశ్వర రావు మరియు ఎన్వి సుబ్బారావులు డిమాండ్ చేశారు.

ఈ జిల్లాలో 67 ప్రాథమిక పాఠశాలలు, 150 ప్రాథమికోన్నత, 3 ఉన్నత పాఠశాలలు, 26 ఉన్నత పాఠశాలలోని ఆంగ్లమాధ్యమాలను రద్దు చేయుటకు ప్రతిపాదనలు నడిచాయని అందులో 150 ప్రాథమికోన్నత పాఠశాలలో 80కిపైగా నిబంధనలకు విరుద్ధంగా డౌన్‌గ్రేడ్ కాబడుచున్నాయని వాటిని కొనసాగించాలని యుటియఫ్ ప్రాతినిధ్యం చేయగా పరిశీలిస్తామని చెప్పిన డిఇఓ పెడచెవిన పెట్టి ఎంఇఓల మీద వత్తిడి తెచ్చి ఎక్కువ పాఠశాలలు మూసేసే విధంగా చేశారని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బదిలీలు జరుగుచున్న సందర్భంలో పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను వేరే పాఠశాలలకు నియమించి విద్యార్థులకు టిసి ఇచ్చి పంపడం జరిగిందని ఈ విధంగా రేషనలైజేషన్‌ను సంక్లిష్టంగా మార్చేశారని ఆరోపించారు.

నిబంధనలకు విరుద్ధంగా డౌన్‌గ్రేడ్ చేయుచున్న ప్రాథమికోన్నత పాఠశాలలను, నిబంధనలకు దగ్గరగా ఉన్న 2 ఉన్నత పాఠశాలలను, 5

ఉన్నత పాఠశాలలోని ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించేవిధంగా రేషన లైజేషన్ ప్రక్రియ పూర్తిచేసి, బదిలీలు సక్రమంగా జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.

**చిత్తూరు జిల్లా**

**ఉపాధ్యాయుల బదిలీ కౌన్సిలింగ్ వెంటనే జరపాలి**



ఉపాధ్యాయ బదిలీ కౌన్సిలింగ్ చిత్తూరు జిల్లాలో జరగకపోవడం శోచనీయమని, కౌన్సిలింగ్ ముందుగా అన్ని ఉపాధ్యాయ సంఘ నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని, మెడికల్ బిల్లులు మంజూరిలో జాప్యం నివారించాలని యుటియఫ్ నాయకులు డిఇఓని కోరారు. రేషనలైజేషన్‌లో భాగంగా ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలో మూడిపడుతున్న కారణం చేత అన్ని మినహాయింపులు ఇవ్వాలి అని కలెక్టరు నిర్ణయంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. 40% అంగవైకల్యం గల ఉపాధ్యాయులకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి, సీనియార్టీ జాబితాను తయారుచేయాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సోమశేఖరనాయుడు, ఎన్. గుణశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు రాధాకృష్ణ, సీనియర్ నాయకులు జి.శ్రీరామమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు కనకాచారి, పరంధామ నాయుడు, సాంబశివరావు, శేరఖ్, పట్టాభి, శివప్రసాద్, ధనంజయరాజు, ఎం.ఎన్. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**కడప జిల్లా**

**కార్పొరేషన్‌ను ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలి**



కడప కార్పొరేషన్ పరిధిలో గత 3 సం॥లుగా ప్రమోషన్లు ఉపాధ్యాయులకు అందనిద్రాక్ష పండులాగా మారాయని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా ఆరోపించారు. ప్రమోషన్లు వెంటనే కల్పించాలని కడప కమీషనర్‌కి ప్రాతినిధ్యం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015 సం॥ నుండి అనేక పర్యాయాలు పదోన్నతుల కొరకు జాబితా తయారు చేయటానికి కాలం వెచ్చిస్తున్నారు తప్ప ఆచరణలో అధికారులు నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనబడుతునన్నదన్నారు. గతంలో ధర్నాలు, నిరాహార దీక్షలు, ఆమరణ నిరాహారదీక్షలు, కార్యాలయ ముట్టడి కార్యక్రమాలు జరిగిన సందర్భంలోనే ప్రమోషన్లు ఇచ్చారు. కావున అధికారులు ఇప్పటికైనా స్పందించి అలాంటి పరిస్థితులు కల్పించకుండా వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కమీషనరును కలిసిన వారిలో జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.వెంకటసుబ్బరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.రామాంజ నేయులు, దావుద్దీన్, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**బదిలీల అక్రమాలపై డిఇఓను వివరణ కోరిన జిల్లా కలెక్టరు**



ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో జరిగిన అక్రమాలపై మరియు పండితుల పదోన్నతులలో మెరిట్-కం-రోస్టర్ విధానాన్ని అమలు చేయక పోవడం పట్ల యుటియఫ్ కడప జిల్లా కమిటీ జిల్లా విద్యాశాఖాధికారిపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసింది.

యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, ఎస్‌వి సుబ్బరాజుల ఆధ్వర్యంలో కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టరును కలిసి ఉపాధ్యాయ బదిలీలలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ జరిపించాల్సిందిగా కోరారు. గతంలో ఉపాధ్యాయ పదోన్నతులన్నీ మెరిట్-కం-రోస్టర్ ఆధారంగానే నిర్వహించే వారని, ఏపి సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996, 33(బి) ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టిన జాబితా ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని, అయితే అందుకు భిన్నంగా జిల్లా విద్యాశాఖాధికారి కేవలం మెరిట్ ప్రాతిపదికన పదోన్నతులు చేపడుతున్నారని కలెక్టరుకు విన్నవించారు. అలాగే, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) ఉపాధ్యాయులు బదిలీలలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాధికారులు వ్యవహరించిన తీరువల్ల తీవ్రంగా నష్టపోయారని, నిబంధనల ప్రకారము బదిలీల నాటికి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని క్లియర్ వేకెన్సీలను చూపించాలని, కాని 6 ఖాళీలను చూపించకుండా నిర్లక్ష్యం వహించారని, దీనితోపాటు అభ్యర్థన బదిలీల ద్వారా ఖాళీ కాబడిన అరైజింగ్ వేకెన్సీలను కూడ బదిలీల్లో ఖాళీలుగా చూపించలేదని, ఈ విషయాన్ని ఉపాధ్యాయ సంఘాలు జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తెచ్చినా స్పందించ కుండా, ఉన్న ఖాళీలనే కోరుకోవాలని, ఉపాధ్యాయులను బలవంతపెట్టి బదిలీలు నిర్వహించారని, దీనివల్ల ఇంగ్లీషు ఉపాధ్యాయులు అనుకూలమైన స్థానాలు కోల్పోయి తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు కలెక్టరు దృష్టికి తెచ్చారు.

బదిలీలలో జరిగిన పలు అక్రమాలలో విద్యాశాఖ కార్యాలయ అధి కారుల పాత్ర ఉందని, నిబంధనల ప్రకారం స్పౌజ్ పాయింట్లు పొంది బదిలీలు కోరే ఉపాధ్యాయులు భర్త లేదా భార్య పనిచేస్తున్న స్థానానికి దగ్గరగా వెళ్ళాలని అయితే అధికారులు చేతివాటం ప్రదర్శించి కొందరికి ఇష్టారాజ్యంగా స్థానాలను కేటాయించారని తెలిపారు. సైన్స్ ఫైర్, వికలాంగత్వ ధృవపత్రాలను కొంతమంది నకిలీవి సృష్టించి అడ్డదారిలో బదిలీలు పొందారని, వీటిపై విచారణ జరపించాలని జిల్లా విద్యాశాఖాధి కారిని పలుమార్లు కోరినా స్పందించలేదని కలెక్టరుకు తెలిపారు.

యుటియఫ్ నాయకులు చేసిన ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టరు ఆరోపణలపై తక్షణమే వివరణ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా ట్రెజరర్ బి.హరి ప్రసాద్, జిల్లా కార్యదర్శులు వై.రవికుమార్, రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు నిత్యప్రభాకర్, యుటియఫ్ నాయకులు చెన్నకేశవులు, నాగార్జున, రఫి తదితరులు పాల్గొన్నారు.

# జోహార్ కా॥ ముత్తుసుందరం



కా॥ ముత్తుసుందరం చనిపోయారన్న వార్త తెలిసి చాలా బాధ కలిగింది. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారన్న విషయం తెలిసింది. కాని ఇంతలోనే చనిపోతారని ఊహించలేదు.

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకునిగా ఎదిగిన కాలంలోనే ముత్తు సుందరం అఖిలభారతస్థాయి విషయాలపై అధ్యయనం చేసేవారు. ఉద్యోగులకు సమాజానికి ఉన్న సంబంధాన్ని ఉద్యోగులపై రాజకీయ నిర్ణయాల ప్రభావాన్ని లోతుగా తెలిసిన ఆయన ఈ విషయాలపై కూడా ఉద్యో గుల సమావేశాల్లో మాట్లాడి వారిని ఆలోచింపచేసేవారు.

**కె.వేణుగోపాల్**
**జాతీయ ఉపాధ్యక్షులు**
**ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్**

ఇంగీషులోను, తమిళంలోను అనర్గళమైన ఉపన్యాసకుడు ఆయన. 2 గంటలసేపు ఆయన మాట్లాడినా ఉద్యోగులు ఆసక్తితో వినేవారు. ఆయన ఉపన్యాసంలో ఆ విధమైన పట్టుఉండేది. ఉద్యోగుల తక్షణ సమస్యలతోపాటు సమకాలీన రాజకీయాలను సరళంగా జోడించ గలిగే నైపుణ్యం ఆయనది. మనిషి బక్కపలచగా ఉన్నా, ఉక్కులాంటి దృఢమైన ఆలోచనలు ఆయనవి.

కా॥ సుకోమల్‌సేన్ తరువాత అఖిలభారత స్థాయిలో ప్రధాన కార్యదర్శిగా, చైర్మన్‌గా ముత్తుసుందరం అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల సమాఖ్యకు సమర్థమైన నాయకునిగా సేవలిందించారు.

రాష్ట్రస్థాయిలో ఉన్నా, అఖిలభారత స్థాయిలో ఉన్నా అదే విధమైన సాదా సాదా జీవితాన్ని ఆయన గడిపారు. 2010 సం॥లో ఢిల్లీలో జరిగిన అఖిలభారత బీమా ఉద్యోగుల సంఘం మహాసభలకు ఆయనను అతిథిగా ఆహ్వానించాం. విమాన ప్రయాణానికి టికెట్ కొని పంపుతామని చెప్పినా ఆయన ఒప్పుకోలేదు. తానే సెకండ్ క్లాస్ స్లీపర్ టికెట్ రిజర్వు చేసుకుని ఢిల్లీకి వచ్చారు. అటువంటి విలువలను ఆయన పాటించేవారు. చనిపోయిన తరువాత తన శరీరాన్ని మద్రాసు జనరల్ హాస్పిటల్‌కు అందజేసి తద్వారా తన శరీరం వైద్య పరిశోధనకు ఉపయోగపడాలని ఆయన కోరుకున్నారు. వారి కుటుంబ సభ్యులు దానిని నెరవేర్చారు.

క్యూబాలో హవానాలో జరిగిన ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య సమావేశాలకు ఆయనతో కలిసి వెళ్లే అవకాశం నాకు వచ్చింది. మొత్తం సమావేశాలను సునిశితంగా పరిశీలించడమే కాకుండా, వివిధ దేశాల నుండి వచ్చిన కార్మిక ప్రతినిధులతో కలిసి అనుభవాలను పంచుకొనేవారు. ఆ విధంగా అంతర్జాతీయంగా కార్మిక వర్గ స్థితి గతులను అంచనావేయడానికి అంతర్జాతీయ సమావేశాలను ఆయన ఉపయోగించుకొనేవారు.

ముత్తుసుందరం మృతి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా, భారత కార్మిక వర్గానికే పెద్దలోటు. అయితే ఇతర నాయకులతో కలిసి ఆయన నిర్మించిన ఉద్యోగుల ఉద్యమం, కార్మిక ఐక్యతను బలోపేతం చేసే దిశలో పనిచేస్తుందని తద్వారా ముత్తుసుందరం ఆశయాలు నెరవేరుతాయని నా నమ్మకం.

జోహార్ కా॥ ముత్తుసుందరం.

**అనంతపురం జిల్లా**

### బోగస్ సర్టిఫికెట్లపై అధికారులపై చర్యలు తీసుకోవాలి



జులై 20న ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు యుటియఫ్, ఎస్‌టియు, పిఎస్‌హెచ్ఎం, డిటిడబ్ల్యుఎ తదితర సంఘాల నాయకులు ఉపాధ్యాయ బదిలీల్లో ప్రాధాన్యత కొరకు బోగస్ మెడికల్ సర్టిఫికెట్లు పెట్టిన ఉపాధ్యాయులు పరిశీలించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇన్‌చార్జ్ రమావణికి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ వారికి, అవినీతి నిరోధక శాఖ వారికి, జిల్లా విద్యాశాఖాధికారి లక్ష్మీనారాయణకి ప్రాతినిధ్యం చేశారు.

ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జిలాన్ అర్హతలేనివారు కూడా డాక్టర్లకు ముడుపులు చెల్లించి సర్టిఫికెట్లు తెచ్చుకున్నారని అన్నారు. సర్టిఫికెట్లు ఇచ్చిన అధికారుల మీద విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి అవినీతి నిరోధక శాఖ వారు, అలాగే జిల్లా విద్యాశాఖాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రిఫెరెన్షియల్ క్యాటగిరీ మీద ప్రత్యేక దృష్టి పెట్టమని అలాంటి వారు తప్పుడు ధృవీకరణ పత్రాలు పెట్టివుంటే వారిమీద శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, అలాంటివారిని క్యాటగిరీ 4 పాటశాలలకు పనిష్మెంట్ క్రింద బదిలీ చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.సుధాకర్, ఎన్.వి.రమణయ్య, కోటేశ్వరప్ప, సాయినాథ్‌బాబు, అనిల్, ఎస్‌టియు జిల్లా ప్రధానకార్యదర్శి రామన్న, పిఎస్‌హెచ్ఎం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, గోవిందరెడ్డి, డిటిడబ్ల్యుఎ పెద్దన్న, ఏపిపిటిఏ సంఘ అధ్యక్షులు చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సదస్సులు, సమావేశాలు

**విజయనగరం జిల్లా**

## బదిలీల కౌన్సిలింగ్‌లో ఉపాధ్యాయులకు మరింత చేరువుగా యుటియఫ్ రాత్రింబవళ్ళు కృషి

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో సీనియార్టీ లిస్టులు ప్రకటన చేసినప్పటినుండి, అప్పీళ్ల స్వీకరణలో, స్పష్టత, సమాచారాన్ని అందివ్వడంలో యుటియఫ్ ప్రథమ స్థానంలో ఉండి మంచి సర్వీసును అందించింది. రేషనలైజేషన్, పాయింట్లు, మెడికల్, స్పౌజ్, ఏజెన్సీ టు మైదాన ప్రాంతం వంటి అంశాలపై అలుపెరగని కృషి యుటియఫ్ జిల్లాశాఖ సమర్ధవంతంగా చేపట్టింది. వీటన్నింటిలో అధికశాతం అప్పీల్సును మన సంఘ నాయకత్వా నికి అందజేయటం జరిగింది. మొత్తం ఈ ప్రక్రియలో సాంకేతిక, సోషల్ మీడియాని వినియోగించుకోవడం, దత్తిరాజేరు, గరివిడి, మక్కువ మండల నాయకత్వం ఈ కృషిలో కీలకపాత్ర పోషించారు. కౌన్సిలింగ్ దగ్గర స్వాగత బ్యానర్లు, యుటియఫ్ సరైన సమాచారం ఇస్తుందనే ఆత్మవిశ్వాసం కలిగింది. ఏజెన్సీ, ఖాళీలు వంటి అంశాలలో అధికారులను నిలదీయటం జరిగింది. యు-డైస్ విషయంలో యుటియఫ్ పోస్టులు కాపాడటంలో మంచి కృషి చేసింది. మొత్తం ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకత్వాలు పాల్గొన్నాయి.

**విశాఖపట్నం జిల్లా**

## గిరిజన విద్యను బలోపేతం చేయండి సిఆర్‌టిల సమస్యలను పరిష్కరించండి

ఐటిడిఏ సిఆర్‌టిల సంఘం జులై 30న సిఐటియు కార్యాలయంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఇ.భాస్కరరావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు.

ఈ సమావేశంలో సిఆర్‌టిల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.విజయ గౌరి మాట్లాడుతూ గిరిజన విద్య బలోపేతం కావాలంటే పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని, ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న 1500పై చిలుకు ఐటిడిఏ సిఆర్‌టిల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 516 పాఠశాలల్లో 1000మందికి పైగా పనిచేస్తున్న సిఆర్‌టిలకు ఉద్యోగ భద్రత లేదన్నారు. రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వకుండా ప్రతియేటా భయాందోళనలకు గురి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

5 జిల్లాల ఐటిడిఏ సిఆర్‌టిల నాయకులు, కార్యకర్తలు ఈ రాష్ట్రస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర కోశాధికారి రాజగోపాల్ సిఆర్‌టిల సమస్యలపై ప్రవేశ పెట్టిన తీర్మానాలు ఆమోదించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి, మహిళా సిఆర్‌టిలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవు ఇవ్వాలి, 22 రోజులు సాధారణ సెలవులు ఇవ్వాలి, 10వ పిఆర్‌సి ప్రకారం ఎస్‌జిటిలకు 22వేలు, స్కూలు అసిస్టెంట్లకు 28వేలు కనీస వేతనాలు ఇవ్వాలి. వైద్యసౌకర్యం కల్పించాలని తీర్మానించారు.

ఈ సమావేశంలో పాడేరు నుండి రాష్ట్ర అధ్యక్షులు నూకరాజు, మహేష్, విజయరామరాజు, పార్వతీపురం నుండి సూర్యనారాయణ, సోములు, శ్రీను, రంపచోడవరం నుండి చిన్నారావు, ఎలీషా, శ్రీకాకుళం నుండి చిన్నప్ప, విశ్వేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పై సమస్యల పరిష్కారానికి అన్ని జిల్లాల ఐటిడిఏ పిఓలకు, గిరిజన సంక్షేమ శాఖామంత్రికి విజ్ఞాపన పత్రంలు ఇవ్వాలని రాష్ట్ర సమావేశం నిర్ణయించింది.

**తూర్పుగోదావరి జిల్లా**

## మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం రద్దుపై యుటియఫ్ ఆందోళన

తూర్పుగోదావరి జిల్లా మున్సిపల్ సబ్‌కమిటీ ఆధ్వర్యంలో కాకినాడలో సమావేశం జరిగింది. ప్రభుత్వం అవలంభిస్తున్న తెలుగుద్వేషాన్ని ప్రజలు గమనిస్తున్నారని, సామాన్య ప్రజలకు విద్యను దూరం చేసే చర్యలు ప్రభుత్వం విడనాడకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని యుటియఫ్ మున్సిపల్ సబ్‌కమిటీ హెచ్చరించింది.

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం మున్సిపల్ పాఠశాలల్లో ఒక్క 10వ తరగతి మాత్రమే ఈ సంవత్సరం తెలుగు మీడియం ఉంటుందని మిగిలిన 1 నుండి 9 తరగతులు అన్ని ఇంగ్లీషు మీడియంలోనే బోధించాలని అందుకు తగ్గట్లుగా తల్లిదండ్రులను మోటివేట్ చేయాలని కమీషనర్లను ఆదేశించారు. దీనితో ఇప్పటివరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులను అయోమయంలో పడ్డారు. తల్లిదండ్రుల నుండి, విద్యార్థుల నుండి క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. సమాంతరంగా రెండు మీడియంలు కొనసాగాలని, మీడియంను ఎంపిక చేసుకునే హక్కు విద్యార్థికే ఉండాలని, అధికారులు - మున్సిపల్ మంత్రులు ఏకపక్ష ధోరణులు విడనాడాలని, విద్యాహక్కు చట్టానికి భిన్నంగా పబ్లిక్ పాఠశాలల్లో పేదలకు విద్యను దూరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ తల్లిదండ్రులతో కలిసి ఉద్యమాలు చేయక తప్పదని యుటియఫ్ హెచ్చరించింది.

ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డి.వి.రాఘవులు, టి.కామేశ్వరరావు, కన్వీనర్ ఎం. వెంకటేశ్వరరావు, సిహెచ్.వి.రమణ, జి.అప్పలనాయుడు, జి.అంజనేయులు ఎం.ఏడుకొండలు, బిఎన్ వెంకటేశ్వరరావు, బిక్కిన ప్రసాద్, ఎన్.గోపాల కృష్ణారెడ్డి, జెవివి సుబ్బారావు, ఆర్.సూర్యచక్రం, సిబిఎస్ ఇమ్మాన్యూల్, ఎస్.అరుణకుమారశర్మ పాల్గొన్నారు.

## స్వయంప్రతిపత్తి స్వతంత్ర పాఠశాలలతో ఉచిత విద్యకు ఉరి

**కాకినాడ :** రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యపై రూపొందించిన "స్వయం ప్రతిపత్తి స్వతంత్ర పాఠశాలల చట్టం-2017" అమలులోకి వస్తే ఉచిత విద్యకు ఉరి వేయడమేనని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వర రావు పేర్కొన్నారు.

జులై 29న స్థానిక యుటియఫ్ కార్యాలయంలో విద్యా వికాస వేదిక ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సుకు విద్యావికాస వేదిక జిల్లా కన్వీనర్ కె.సత్తిరాజు అధ్యక్షత వహించగా, యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు ముఖ్యవక్తగా పాల్గొని ప్రసగించారు. రాజ్యాంగ లక్ష్యం మేరకు పాఠశాల విద్య ఉచితంగా అందించవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రూపొందించిన చట్టం అమలులోకి వస్తే కార్పొరేట్ శక్తులు పాఠశాల విద్యను విద్యారంగం మార్చే పరిస్థితి వస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, బడ్జెట్ పాఠశాలలు కనుమరుగు అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టంలో నిబంధనలు ప్రజలను దోచు కునేందుకు కార్పొరేట్లకు బాగా అవకాశం కల్పిస్తున్నాయన్నారు. ప్రభుత్వానికి గాని, విద్యాశాఖకు గాని ఎలాంటి నియంత్రణ ఈ స్వతంత్ర పాఠశాలలపై ఉండదన్నారు. ఫిక్కి, సిఐఐ లాంటి సంస్థలు ఈ చట్టం రూపకల్పనలో తెరవెనుక పాత్ర పోషించారన్నారు.

విద్యాచట్టం 1982కు లోబడి 1994లో వచ్చిన జిఓ నం.1 స్థానంలో ఈ కొత్త చట్టాన్ని ప్రభుత్వం తీసుకువస్తుందన్నారు. ప్రతీ సంవత్సరం ఫీజులు 12% పెంచుకోవడానికి, సిలబస్, పనివేళలు, పాఠ్యపుస్తకాలు వారి ఇష్టానికే వదిలివేయడం జరిగిందన్నారు. పిల్లలకు, తల్లిదండ్రులకు ఏ విధమైన హక్కులు లేకుండా ఈ చట్టాన్ని రూపకల్పన చేశారని తెలిపారు. ఈ చట్టంపై సివిల్ కోర్టులలో చాలెంజ్ చేసే అవకాశం లేదన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ చట్టం యాజమాన్యాలకు పాఠశాలలకు సంబంధించిన అన్ని అధికారాలు దఖలు పరిచిందన్నారు. ఈ చట్టంలో ఉపాధ్యాయుల జీతాలు, సౌకర్యాలు గురించి ఒక్కమాట కూడా లేదన్నారు. విద్యా శ్రేయోభిలాషులు, ప్రజాతంత్రవాదులు ఈ చట్టంపై ఉద్యమించాలన్నారు.

ఈ సదస్సులో యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.ప్రభాకరవర్మ, సిఐటియు నగర ప్రధానకార్యదర్శి సిహెచ్. అజయ్‌కుమార్, జెవివి జిల్లా అధ్యక్షులు కెఎంఎంఆర్ ప్రసాద్, కార్యదర్శి యుజిఎన్ రెడ్డి, కాకినాడ రూరల్ ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు శ్రీరామ్, జాఫర్, ఉద్యమ సీనియర్ నేత రామేశ్వరరావు వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కృష్ణా జిల్లా**

### ట్యాబ్‌లతో ఇబ్బందులు



**కలిదిండి :** "ఐరిష్ ట్యాబ్‌ల వల్ల ఉపాధ్యాయులు పలు ఇబ్బందులకు గురికావలసి వస్తుందని కలిదిండి యుటియఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.వెంకటేశ్వరరావు, నున్న ఆంజనేయులు అన్నారు. జులై 5న స్థానిక యుటియఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం బయోమెట్రిక్ విధానంతో ఉపాధ్యాయులకు ఐరిష్ ట్యాబ్‌లను ప్రవేశ పెట్టిందన్నారు. ఉపాధ్యాయుల హాజరు ఐరిష్ ద్వారా లాగిన్ ఆవ్వాలని, ప్రతీ పాఠశాల ఉపాధ్యాయులకు ఆదేశించినట్లు తెలిపారు. సిగ్నల్స్ లేకపోవడంతో ఉపాధ్యాయులు పలు ఇబ్బందులకు గురికావలసి వస్తుందన్నారు. 3-4 ఉపాధ్యాయులు లాగిన్ అయ్యేందుకు 1 నుండి 2 గంటల సమయం పడుతుందన్నారు. సాయంత్రం ఐరిష్ తీసుకోక పోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురి అయ్యారన్నారు. ఈ నెల 6 నుంచి 28 వరకు ఉపాధ్యాయుల బదిలీలు ఉన్నందున బయోమెట్రిక్ విధానాన్ని ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయ్యేవరకూ నిలిపివేయాలని యుటియఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పివి సాగర్‌బాబు, నాయకులు జి.భోగేశ్వరరావు, నాగరాజు, శివకుమార్, మాధవరావు, సురేష్ పాల్గొన్నారు.

### సభ్యత్వాలకు అపూర్వ స్పందన

యుటియఫ్ సభ్యత్వ నమోదుకు ఉపాధ్యాయులనుంచి అపూర్వ స్పందన వస్తోందని కలిదిండి యుటియఫ్ అధ్యక్ష, ప్రధానకార్య దర్శులు వై.వెంకటేశ్వరరావు, నున్న ఆంజనేయులు అన్నారు. ఏకీకృత సర్వీస్‌రూల్స్, సిపిఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ ప్రభుత్వం మంజూరు చేయడం అనేది ఐక్యఉద్యమాల ద్వారానే సాధ్యమైందని రాష్ట్ర కౌన్సిలర్ పి.వి.సాగర్‌బాబు అన్నారు. యుటియఫ్ ఎప్పుడూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, స్పాట్ పాయింట్లలో స్పష్టత ఇవ్వాలని, పిఆర్‌సి వకాయిలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాఘవయ్య, భోగేశ్వరరావు, నాగేశ్వరరావు, మధు, సురేష్, శివకుమార్, రామకృష్ణ, సుఫియన్ తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లా**

### క్రొత్త చట్టం ద్వారా కార్పొరేట్ ఆధీనంలోకి పాఠశాల విద్య



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన స్వయంపోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017 వల్ల పాఠశాల విద్య పూర్తిగా కార్పొరేట్ చేతుల్లోకే పోతుందని, ప్రభుత్వ మరియు చిన్న చిన్న ప్రైవేట్ విద్యా సంస్థలు కనుమరుగవుతాయని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆందోళన వ్యక్తపరిచారు. గుంటూరు జిల్లా యుటియఫ్ కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ముసాయిదాలో విద్యారంగానికి నష్టము చేకూర్చే అంశాలున్నాయని, స్వతంత్ర పాఠశాల బిల్లు హడావిడిగా ఏకపక్షంగా నిర్ణయించడం సరికాదని విద్యాపరిరక్షణ కమిటి రాష్ట్ర బాధ్యులు డి.రమేష్ పట్నాయక్ అన్నారు. ప్రైవేట్ విద్యార్థుల బాధ్యులు చౌదరిబాబు మాట్లాడుతూ సామాజిక సమస్యగా బోధించి ప్రజలను చైతన్యపరచాలన్నారు.

విద్యావికాస వేదిక కన్వీనర్ జి.ప్రభుదాస్ మాట్లాడుతూ ఈ చట్టం అమలయితే విద్యావ్యాపారానికి బహిరంగంగా తెరతీయడమేనని అన్నారు. దీని ప్రకారం నియామకాలు, జీతాలు, ఫీజులు, సిలబస్, సమయం, దండనలు, అడ్మిషన్ విధానం అన్ని నిర్ణయాలకు యాజమాన్యానికి చట్టబద్ధత కల్పించాలన్నారు.

ఏపి ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ బాధ్యులు ఆర్.రాము మాట్లాడుతూ విద్యారంగ ప్రముఖులతో, మేధావి వర్గంతో చర్చించి మార్పులు చేయాలని కోరారు. విద్యారంగంలో చేసే మార్పులకు బహిరంగంగా విస్తృత చర్చ జరిపి ప్రజాభిప్రాయ సేకరణ జరిపి నిర్ణయాలు చేయాలని ఏపిపిఎస్‌ఏ రాష్ట్ర సహాధ్యక్షులు ఎం.రవీంద్రబాబు కోరారు.

విద్యారంగ కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తూ స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టాన్ని విరమించుకోవాలని సమావేశం తీర్మానించినది. ఈ సమావేశంలో యుటియఫ్ జిల్లా, రాష్ట్ర నాయకులు ఎన్.తాండవకృష్ణ, ఎం.హనుమంతరావు, ప్రేమ్‌కుమార్, కళాధర్, డిటిఎఫ్ సీనియర్ నాయకులు ఎస్.లక్ష్మారెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు మణికుమార్, పిడిఎస్ఓ కెవి రమణ, మాజీ మండల విద్యాశాఖాధికారి వి.పాములరెడ్డి, జెవివి జిల్లా ప్రధానకార్యదర్శి టిఆర్ రమేష్, ఆవాజ్ నాయకులు ఎం.అక్బర్, పీపుల్ ఫర్ ఇండియా నాయకులు వివికె సురేష్, స్పేస్ క్లబ్ జి.శాంతమూర్తి, వి.రామమోహన్, రామచంద్రారెడ్డి, కె.చెన్నకేశవరావు, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**చిత్తూరు జిల్లా**

## ఉపాధ్యాయ బదిలీ కౌన్సిలింగ్ వెంటనే చేపట్టాలి




రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయ బదిలీల కౌన్సిలింగ్ జరుగు తున్నాకానీ, చిత్తూరు జిల్లాలో జరగకపోవడం శోచనీయమని, ఉపాధ్యా యుల్లో గందరగోళం నెలకొన్నదని, అధికారులు చొరవ తీసుకొని షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని జిల్లా యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.సోమశేఖర నాయుడు, ప్రధానకార్యదర్శి ఎన్.గుణశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు జి.రాధా కృష్ణ, జిల్లా నాయకులతో కలిసి జిల్లా విద్యాశాఖాధికారిని కలిసి ప్రాతినిధ్యం చేశారు. వెంటనే సీనియార్టీ జాబితాలను ప్రకటించి లోపాలను సవరించి కౌన్సిలింగ్‌ను పారదర్శకంగా జరపాలని కోరారు. పదవ తరగతి ఫలితాలను రెండు విద్యా సంవత్సరాల సరాసరిని తీసుకోవాలని జిఓ ఉన్నా డివిజన్‌లో ఒక్కో విధంగా తీసుకోవడం సరికాదని, దీనిని సవరించాలని, కౌన్సిలింగ్‌కు ముందే అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమస్యలను సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో జాప్యాన్ని నివారించాలని, రేషనలైజేషన్‌లో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు ఎక్కువవున్న పాఠశాలలు మూత పడుతున్న కారణంగా కొన్ని మినహాయింపులు ఇవ్వాలని కలెక్టర్ తీసుకున్న నిర్ణయంపట్ల హర్షం వ్యక్తం చేశారు. 40% అంగవైకల్యం వున్నవారికి మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి వెంటనే సీనియార్టీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల&ఆల నాయకులు జి.శ్రీరామమూర్తి, పరంధామనాయుడు, సాంబ శివన్, కనకాచారి, శేఖర్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

## సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ యాక్టు రద్దు చేయాలి

**ఎమ్మిగనూరు :** విద్యను వ్యాపార వస్తువుగా మార్చే "సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్ యాక్టు-2017" మూసాయిదాను రద్దు చేయాలని యుటియఫ్ డిమాండ్ చేసింది. యుటియఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా సహాధ్యక్షులు ఎన్.నాగమణి మాట్లాడుతూ 1994లో విడుదల చేసిన జిఓ నం.1 అమలులో ఏ నష్టాలున్నాయో బహిర్గతం చేయకుండా నూతన ముసాయిదాను రూపొందించడం విచ్చలవిడిగా విద్యా వ్యాపారంగానికి తెరతీయడమే అన్నారు.

ఈ చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖకు అజమాయిషీ లేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ ముసాయిదా అమల్లోకి వస్తే స్వయం ప్రతిపత్తిగల కార్పొరేట్ కళాశాలల మాదిరిగా స్వయం ప్రతిపత్తిగల కార్పొరేట్ పాఠశాలలు రానున్నాయని అన్నారు. దీనివల్ల విద్యార్థుల నుండి ఫీజుల వసులులో పరిమితి లేకుండా, టీచర్ల నియామకాలకు భద్రత లేకుండా, సామాజిక సౌకర్యాలు, హక్కులు ప్రయోజనాల కోసం కోర్టులను ఆశ్రయించ కూడదనే అప్రజాస్వామిక విధానాల వల్ల విద్యను పూర్తిగా వ్యాపారం అవుతుందన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, మేధావులతో చర్చించి ముసాయిదా తయారు చేయాలని, అభిప్రాయాలు తెలియజేయడానికి గడువు పెంచాలని డిమాండ్ చేశారు.

మండలంలోని పాఠశాలలకు వెళ్ళి ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించడమైనది. ఈ కార్యక్రమంలో సుధాకర్, దావీదు, శ్రీనివాసులు నాయుడు, అల్లాబకాష్, లవకుమార్, బసవరాజు, వీరుపాక్షి, రామాంజ నేయులు, బి.నాగరాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలోనే ఆదర్శం

తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరం మండలంలోని పి.గన్నవరం ఆదర్శ ప్రాథమిక పాఠశాలయందు యుటియఫ్ పిలుపునందుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యుటియఫ్ మండలశాఖ అధ్యక్షులు కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో జరిగిన "మన ఊరు-మనబడి" కార్యక్రమంలో 60మంది విద్యార్థులు నూతనంగా చేరారు. పాఠశాల ఆవాస ప్రాంతంలో 5 ప్రైవేటు పాఠశాలలు పనిచేస్తున్నప్పటికి ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా పనిచేయుచున్న పి.గన్నవరం పాఠశాల యందు ప్రతి సంవత్సరం ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతోంది. ప్రతి సంవత్సరం పిల్లలను చేర్చుకొనుటలో పి.గన్నవరం ఆదర్శపాఠశాల మండలంలో ప్రథమ స్థానంలో ఉందని, యుటియఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన కర పత్రాలు ఎన్‌రోల్‌మెంట్ పెరుగుదలకు ఉపయోగపడుతున్నాయని ప్రధానోపాధ్యాయులు కత్తుల ఆనందరావు తెలిపారు.

ఈ విద్యా సంవత్సరం 60మంది పిల్లలను చేర్చుటవలన పాఠశాల రోలు 160కి పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జులై 25న జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయిన మండల పరిషత్ అధ్యక్షులు సంసాని లక్ష్మీగౌరి, మండల విద్యాశాఖాధి కారిణి కోనహెలినా పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ చుట్టుగుల్ల షర్మిళారమణ, యుటియఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.సురేష్‌కుమార్, గౌరవాధ్యక్షులు సాకా సత్యం, సీనియర్ నాయకులు గెద్దం ఆనందరావు, ఉపాధ్యాయులు కెవి దుర్గాదేవి, జి. రాంబాబు, బి.మీనాకుమారి, బి.అచ్చుతకుమారి మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆదర్శ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

**కర్నూలు జిల్లా :** ఎమ్మిగనూరు, నందవరం మండలాల్లో వివిధ పాఠశాలలో పనిచేసి జూన్ 30న రిటైరైన ఉపాధ్యాయుడు శ్రీనివాసులుని యుటియఫ్ ఎమ్మిగనూరు తాలూకా శాఖ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కె. సురేష్‌కుమార్ హాజరై ప్రసంగించారు. శ్రీనివాసులు తన వృత్తి ధర్మాన్ని క్రమశిక్షణతో నిబద్ధతతో పనిచేసి పాఠశాలలో విద్యాభివృద్ధి అవిరాళకృషి చేశారన్నారు. నందవరం మండలం హాలహర్వీ ప్రాథమిక పాఠశాలలో 12 సం॥లు పనిచేసి జూన్ నెలలో పదవీవిరమణ చెందిన ఈయన తన స్వంత ఖర్చులతో ముగ్గురు విద్యావాలంటీర్లను నియమించుకొని విద్యాభివృద్ధికి కృషి చేసిన శ్రీనివాసులకు అభినందనలు తెలియజేశారు. ఈయన కృషికి 2016లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడ అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో దాదాపు 200మంది ఉపాధ్యాయులు హాజరైనారు. ఈ సందర్భంగా త్వరలో జరగబోయే బదిలీలలో ఉపాధ్యాయులకు వున్న అనుమానాలను నివృత్తి చేశారు. ఏకీకృత సర్వీస్‌రూల్సు సాధించడంలో యుటియఫ్, పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషిని వివరించడమైనది. సమిష్టి కృషి ఫలితంగానే సర్వీస్‌రూల్స్ సాధించడ మైనదని తెలియజేశారు.

ఈ సమావేశంలో అన్ని మండలాల బాధ్యులు దావీదు, రాఘవేంద్ర, ఎల్లప్ప, భాస్కర్, కౌలన్న, పెద్దారెడ్డి, జ్ఞానప్రకాష్, నరసింహులు, విజయ లక్ష్మి, సుజాత, నాగమణి, తులశమ్మ, ఉమ, వేణుగోపాల్, విజయ్, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ టీచర్స్ సమస్యలు పరిష్కరించాలి

**శ్రీకాకుళం జిల్లా**

### ఆదర్శ పాఠశాలలను పరిరక్షించండి



దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల సాధన కోసం పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నపాలు అందజేసినా మోడల్ స్కూల్స్‌లో పేరుకుని ఉన్న సమస్యలు పరిష్కరింపబడని కారణంగా ఏపిఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జులై 7న శ్రీకాకుళం జిల్లాలోని 14 మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్, పిజిటిలు, టిజిటిలు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పిడిలు కలెక్టర్ కార్యాలయంవద్ద ధర్నాలో పాల్గొన్నారు.

ఈ ధర్నాకు యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రెడ్డి మోహనరావు, చౌదరి రవీంద్ర, ఇతర యుటియఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈ ధర్నాని ఉద్దేశించి గొంటి గిరిధర్ మాట్లాడుతూ మంచి ఫలితాలు సాధిస్తున్న మోడల్ స్కూల్స్ కావాలనే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యుటియఫ్ అధ్యక్ష, ప్రనధానకార్యదర్శులు రెడ్డి మోహనరావు, సిహెచ్.రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి మోడల్ అధ్యాపకులకు జీతాలు 010 పద్దు ద్వారా చెల్లించి, కారుణ్య నియామకాలు చేపట్టాలని, పిడిలు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు పెంచాలని లేనిచో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుంట లక్ష్మీనారాయణ, బడగల సురేష్ మాట్లాడుతూ 17 నుండి 5 రోజుల పాటు అమరావతిలో నిర్వహిస్తున్న నిరాహారదీక్షలను భారీగా తరలిరావాలని అప్పటికీ ప్రభుత్వంలో కదలిక లేనియెడల 24వ తేదీ డైరెక్టరేట్ ముట్టడిలో అందరూ పాల్గొని ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు.

**విశాఖపట్నం జిల్లా**

### మోడల్ స్కూల్ టీచర్స్ ధర్నా

ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి. ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలు 2013లో ప్రారంభించిన ఇప్పటికి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆదర్శ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు ప్రతినెలా జీతాలు చెల్లించాలి. సర్వీస్‌రూల్స్ విడుదల చేయాలి, పిఆర్‌సి అరియర్స్ వెంటనే చెల్లించాలి, ఆదర్శ పాఠశాలలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకోవాలి, 010 పద్దుద్వారా జీతాలు చెల్లించాలి, ఏపిఎంఎస్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షులు పివిఎన్ హైమావతి డిమాండ్ చేశారు. పొరుగు ఉద్యోగులకు వేతనాలు వెంటనే చెల్లించాలి, హిందీ పిజిటిని అదనంగా ఏర్పాటుచేయాలి, ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి, రెండు డిఏలను వెంటనే ఆమోదించాలి, పాఠశాల ప్రహరీగోడ నిర్మించి, హాస్టల్స్‌ను వెంటనే ప్రారంభించాలి, కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని జిల్లా ప్రధానకార్యదర్శి డిపి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు.

**గుంటూరు జిల్లా**

### ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలు 2013లో ప్రారంభించటం జరిగింది. గుంటూరు జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగింది. 6వ తరగతి నుండి ఇంటర్మీడియేట్ తరగతులు నిర్వహిస్తున్న ఈ పాఠశాలలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఆదర్శ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు ప్రతినెలా జీతాలు చెల్లించాలని, ఆదర్శ పాఠశాలల సర్వీస్‌రూల్స్ విడుదల చేయాలని, పిఆర్‌సి అరియర్స్ వెంటనే చెల్లించాలని, ఆదర్శ పాఠశాలలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకోవాలని, 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని, హిందీ పిజిటిని అదనంగా ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో జులై 7న కలెక్టరేట్ ముందు ఏపిఎంఎస్‌టిఎఫ్ ఆధ్వర్యంలో ప్రధానకార్యదర్శి విద్యాసాగర్, కె.బాబు ఆధ్వర్యంలో జిల్లాలోని 14 ఆదర్శ పాఠశాలల నుండి ఉపాధ్యాయులు ధర్నాలో పాల్గొనడం జరిగింది.

**ప్రకాశం జిల్లా**

### మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

**ఒంగోలు :** ప్రకాశం జిల్లాలోని 10 మోడల్‌స్కూల్స్‌లో దాదాపు 120మంది ఉపాధ్యాయులు, 80మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పని చేయుచున్నారు. వారికి మే నెల నుండి చెల్లించాల్సిన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జులై 7న ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ఏపిఎంఎస్‌టిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయులు మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాల సమస్యతోపాటు అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జిల్లా అధ్యక్షులు ఇ.రమేష్ బాబు, ప్రధానకార్యదర్శి ఎం.నరసింహారావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎన్.బోసుబాబు పాల్గొన్నారు.

**నెల్లూరు జిల్లా**

**చిత్తూరు జిల్లా**

### ఆదర్శ పాఠశాలలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి



ఆదర్శ పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి ఆరోపించారు. ఏపి ఆదర్శ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ఏపిఎంఎస్‌టిఎఫ్ ఆధ్వర్యంలో జులై 7న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశిస్తూ ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలు కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఏర్పాటైందని, తర్వాత ఆ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించినట్లు చెప్పారు. నిధులు లేవనే సాకులతో రాష్ట్ర సర్కారు ఆదర్శ పాఠశాలల పట్ల నిర్లక్ష్యంగా

వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులకు కనీసం వేతనాలు చెల్లించకపోవడం దారుణమని చెప్పారు.

ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు అనంత చౌడప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయులకు 010 పద్దుకింద వేతనాలు చెల్లించాలని, పదో పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని, ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఆదర్శ పాఠశాలల అభివృద్ధికి సత్వరం చర్యలు తీసుకోవడంతోపాటు పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయుల భర్తీకి చొరవ చూపాలని నినదించారు. యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.సోమశేకరనాయుడు, ఏపిఎంఎస్‌టిఎఫ్ ప్రధానకార్యదర్శి షాదిక్ ఆలీఖాన్, కార్యదర్శి కనకాచారి, ఏపిఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కడప జిల్లా**

### మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలి




ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ దీర్ఘకాలంగా పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టింది. ఈ ధర్నాను ఏపిఎంఎస్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.నరసింహులు, యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా ధర్నాను ప్రారంభించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో గత నాలుగు సంవత్స రాలుగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కనీసం నెలనెల జీతాలు ఇవ్వడానికి కూడ రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మోడల్ స్కూల్ స్కీమ్‌ని డిలింక్ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నాలో ఏపిఎంఎస్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.నరసింహులు, యుటియఫ్ జిల్లా అధ్యక్షులు సుబ్బరాజు, సుబ్బరాయుడు, రజనిరాణి, దివ్య, మోడల్ స్కూల్ ఉపాధ్యాయ, ఉపాధ్యాయినిలు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

**అనంతపురం జిల్లా**

### మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల ధర్నా విజయవంతం

జులై 7న అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమస్యల సాధనకై ధర్నా చేపట్టడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమం ఏపిఎంఎస్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు విశాలాక్షి అధ్యక్షతన జరిగింది.

ఈ ధర్నా శిబిరానికి మాజీ ఎమ్మెల్సీ డా॥ ఎం.గేయానంద్ విచ్చేసి తన సంపూర్ణ మద్ధతును ప్రకటించి ప్రసంగించారు. పాఠశాలల్లో పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులను నడిరోడ్డుకు ఈ ప్రభుత్వం లాగిందని, మోడల్ స్కూల్స్ స్కీమ్‌ను కేంద్ర ప్రభుత్వము డీలింక్ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తమ ఆధీనంలోనికి తీసుకొని ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదర్శ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి బదులు వాటిని నిర్వీర్యము చేస్తుందని విమర్శించారు.



యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జిలాన్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ టీచర్స్‌కు బకాయిపడ్డ పిఆర్‌సి ఎరియర్స్‌ను విడుదల చేయాలని, వారికి సర్వీస్‌రూల్స్ విడుదలచేసి, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏపిఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మురళీమోహన్ మాట్లాడుతూ ఇంత సాధించుకున్న అన్ని సమస్యలు యుటియఫ్ వారి సహకారంతో సాధించు కున్నామని, భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు సిద్ధము కావాలని, విజయవాడలో జులై 17నుండి 21వరకు నిరాహారదీక్షలు, 24న డైరెక్టర్ కార్యాలయం ముట్టడి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సికె నాగేంద్రబాబు మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ టీచర్స్‌కు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, హిందీ పిజిటి పోస్టు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ధర్నాకు మద్ధతుగా అనంతపురం జిల్లా జెఏసి అధ్యక్షులు వెంకట నరసయ్య, పెన్షనర్ల సంఘ ప్రధానకార్యదర్శి బసవరాజు, ఏపిఎంఎస్‌టిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్ మరియు జిల్లాలోని 25 మోడల్ స్కూల్స్ నుంచి 180మంది పాల్గొన్నారు. అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌కి, జిల్లా విద్యాశాఖాధికారికి వినతిపత్రం ఇవ్వడమైనది. వారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

### ఆదర్శ పాఠశాలల్లో హాస్టల్ వార్డెన్స్ నియమించాలి

అనంతపురం జిల్లాలోని ఆదర్శ పాఠశాలలకు అనుబంధంగా ప్రారంభించబోతున్న బాలికల వసతి గృహాల నిర్వహణ విషయమై వార్డెన్ పోస్టులను భర్తీ చేయకుంటే తాత్కాలికంగా ఉపాధ్యాయులను ఈ బాధ్యతలు అప్పగించడం వలన అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయని జిల్లా అధ్యక్షులు వై.విశాలక్ష్మి, ప్రధానకార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు.

బాలికల వసతి గృహాలను ఉపాధ్యాయులకు అప్పగించడం ద్వారా బోధనా పరమైన సమస్యలు ఎదురౌతున్నాయని, ముఖ్యంగా ఇంటర్, పదవ తరగతి వంటి బోర్డు పరీక్షలు రాసే విద్యార్థుల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వసతి గృహాలను ఊరికి దూరంగా, మారుమూల ప్రాంతాలలో నిర్మించడం వలన కనీస భద్రతాపరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించకుండ కేవలం ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించడం వలన వారు తీవ్రమైన మానసిక ఆందోళనకు గురి అవుతున్నారని వెంటనే హాస్టల్ వార్డెన్‌లను నియమించాలని, బాధ్యతలను ఉపాధ్యాయులకు అప్పటించాలనే ఆలోచనను విరమించు కోవాలని డిమాండ్ చేశారు.

**ఐక్య ఉపాధ్యాయలో ప్రకటనల రేట్లు**

| | | | |
|---|---|---|---|
| 4వ కవర్ పేజీ (కలర్) | - | ₹ | 30,000 |
| 2వ కవర్ పేజీ (కలర్) | - | ₹ | 20,000 |
| 3వ కవర్ పేజీ (కలర్) | - | ₹ | 20,000 |
| లోపలి పేజీ (బ్లాక్ & వైట్) | - | ₹ | 10,000 |
| లోపలి పేజీ (బ్లాక్ & వైట్)ఆప్షనల్ | - | ₹ | 11,000 |

## కెజిబివి టీచర్ల సమస్యల పరిష్కారానికై ధర్నా

2017 జులై 12న విజయవాడలో లెనిన్ సెంటర్‌లో గల ధర్నా చౌక్‌వద్ద ఆంధ్రప్రదేశ్ కెజిబివి టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.రత్నమాలినీదేవి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా శిబిరాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావుగారు ప్రారంభిస్తూ పిఎబి ప్రకారం పెరిగిన జీతాలను అమలు చేయాలని, కెజిబివి టీచర్లకు ఉద్యోగ బద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, కెజిబివి టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

మరో ముఖ్య అతిథి యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు, జెఏసి సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిరంతరం మహిళా ఉద్యోగినుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించి కొన్ని విజయాలు సాధించామని, సాధారణ సెలవులు లేకపోతే పోరాటంతో సెలవులను సాధించుకున్నామని, ఇప్పటికే అనేక ప్రాతనిధ్యాలు ఫలితంగా పిఏబి ప్రకారం జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని తెలిపారు.

యుటియఫ్ ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్న కెజిబివి సంస్థల బలోపేతానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అన్నారు.

కెజిబివిటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.విజయగౌరి మాట్లాడుతూ కెజిబివి టీచర్లు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం చేయాలని, జీవితాంతం ఉద్యోగ భద్రతకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రసూతి సెలవు వేతనంతో కూడిన మూడు మాసాలు మంజూరు చేయాలని, అందరూ మహిళా ఉద్యోగులు గనుక ప్రత్యేక సెలవులు, అవసరాలు తీర్చాలని, వార్డెన్నును నియమించాలని, ఇంగ్లీషు మీడియం రద్దుచేయాలని అన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల జెఏసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాలకాశి మాట్లాడుతూ మన సమస్యల పరిష్కారానికి ఐక్యఉద్యమాలే శరణ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు శాంతి ప్రియదర్శిని (విజయవాడ సిటీ), యుటియఫ్ నాయకులు కె.శ్రీనివాసరావు, సిఆర్‌పిల రాష్ట్ర సంఘం నాయకులు కిషోర్, శ్రీనివాస్, కెజిబివిటిఎఫ్ నాయకులు మాణిక్యం, సుజాత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ కుటుంబానికి ఆదరణ

**అంబాజీపేట:** తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట (మం) యుటియఫ్ సంక్షేమ సంఘంలో సభ్యునిగా మరణించిన అంబాజీపేట ఉపాధ్యాయులు నేల రాజారత్నం కుటుంబా నికి 2 లక్షల రూపాయిల సొమ్మును చెక్కుద్వారా అందజేయడం జరిగింది. పీతాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో యుటియఫ్ సీనియర్ నాయకులు జి.చిట్టిబాబు, జిల్లా అధ్యక్షులు డివి రాఘవులు చేతులమీదుగా చెక్కును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబాజీపేట ఎంపిపి డివివి సత్యనారాయణ, జెడ్‌పిటిసి బొంతు గంగధరరావు, ఎఎంజి చైర్మన్ అరిగెల బలరామ్మూర్తి, అంబాజీపేట ఎంఇఓ సుభాష్, కొత్తపేట ఎంఇఓ హరిప్రసాద్, జిల్లా కార్యదర్శులు ఎం.వెంకటేశ్వరరావు, పెంకే వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ జి.వి.రమణ, సంక్షేమ సంఘం కార్యదర్శి సిహెచ్.వి.రమణ, సంక్షేమ సంఘం డైరెక్టర్ బిబిఆర్ ప్రసాద్, అయినవిల్లి యుటియఫ్ బాధ్యులు జి.బంగార్రాజు, గన్నవరం బాధ్యులు కత్తుల ఆనందరావు, అంబాజీపేట యుటియఫ్ ప్రధానకార్యదర్శి పి. నారాయణమూర్తి, ఎల్.లోకేష్, టి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉత్తర్వులు

1. 2017-18 విద్యా సంవత్సరానికి అమ్మకు వందనం కార్యక్రమ అమలుకు ఒకకోటి ఇరవైఐదు లక్షల గ్రాంటు మంజూరు ఉత్తర్వు- **జిఓ ఆర్‌టి నం.124; తేది.14.07.2017**
2. సిపిఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్ మంజూరు ఉత్తర్వు **జిఓ ఎంఎస్ నం.121; తేది.18.07.2017**
3. ఉపాధ్యాయ బదిలీ నిబంధనలకు మరికొన్ని సవరణల ఉత్తర్వు **పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.190/**Esst.III/**2017; తేది.18.07.2017**
4. 01.04.2017 నుండి 30.06.2017 వరకు రివైజ్డ్ గ్రూపు ఇన్సూరెన్స్ ఉత్తర్వు **జిఓ ఎంఎస్ నం.122; తేది.19.07.2017**
5. అన్‌ఎయిడెడ్ అప్రువ్డ్ పోస్టులలో పనిచేస్తున్న అభ్యర్థులను ఎయిడెడ్ పోస్టులలోకి అబ్జార్బ్ చేయుటకు మార్గదర్శకాలు **పాఠశాల విద్యా కమీషనర్ ఉత్తర్వు ఆర్‌సి నం.90/పిఎస్-1/2010-1; తేది.20.07.2017**
6. ఉపాధ్యాయుల బదిలీ నిబంధనలకు సవరణ ఉత్తర్వు **జిఓ ఎంఎస్ నం.50; తేది.20.07.2017**
7. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పదోన్నతుల మార్గదర్శకాలు **పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.90/పిఎస్-1/2010-2; తేది.20.07.2017**
8. ఎయిడెడ్ పాఠశాలల్లో 2005 బ్యాచ్‌కు కోర్టు ఉత్తర్వుల మేరకు పోస్టుల భర్తీకి మార్గదర్శకాల ఉత్తర్వు **పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.90/పిఎస్-1/2010-3; తేది.20.07.2017**
9. ఏపి రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 సం॥ల నుండి 60 సం॥లకు పెంపుదల **జిఓ ఎంఎస్ నం.60; తేది.27.07.2017.**
10. ఉపాధ్యాయుల బదిలీ నిబంధనలకు మరికొన్ని సవరణల ఉత్తర్వు **పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.190/**Esst.III/**2017; తేది.28.07.2017**

## పాఠకులకు గమనిక

తెలుగు మాస పత్రికలలో ఇంగ్లీషులో ప్రభుత్వ ఉత్తర్వులు, ఇంగ్లీషులో వ్యాసాలు వంటివి ప్రచురించరాదని పోస్టల్ శాఖ వారు అభ్యంతరం తెలిపారు. అందువలన ప్రభుత్వ ఉత్తర్వుల నంబరు, వివరాలు మాత్రమే ప్రచురించడం జరుగుతున్నది. ప్రభుత్వ ఉత్తర్వులు యధావిధిగా ప్రచురించడా నికి పోస్టల్ డిపార్టు మెంట్ వారికి, రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ వారికి ప్రతి పాదనలు పంపడం జరిగింది. పోస్టల్ పర్మిషన్ కొరకు కృషి చేయడం జరుగుతున్నది. అసౌకర్యానికి చింతిస్తున్నాం.

**- సంపాదకవర్గం**